www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అమరావతి సమరం.. అజరామరం!

నేటితో 1500వ రోజుకు చేరిన మహా పోరు

- పాలకుల ఎత్తులు, జిత్తులు, కుయుక్తులపై నిత్య సమరం
- నిరవధిక దీక్షలు, పోరాటాలతో సాగుతున్న ఉద్యమం
- లాఠీలు విరిగినా, కేసులు పెట్టినా ఆగని రైతుల రణన్నినాదం
- దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా గుర్తింపు



12

గురువారం | 25-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 280 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 11.25 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పునర్వసు ఉ. 8.17 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా. 5.01-6.45; దుర్ముహూర్తం: ఉ. 10.36-11.21, మ. 3.04-3.49; అమృతఘడియలు: శేషం ఉ. 7.25, తె. 3.29-5.14; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.03 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



12

నేటి నుంచి ఆరోగ్యశ్రీ బంద్

- నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్య సంఘం నిర్ణయం
- 20 రోజులుగా చర్చలు.. నెరవేరని ప్యాకేజీ పెంపు హామీ
- బిల్లుల చెల్లింపు మాటా గాలికే
- సమ్మెలోకి ఆస్పత్రులు



3

ఆ భవన నిర్మాణాలు నిలిపేయండి

- విశాఖ శారదా పీఠం, టీటీడీకి హైకోర్టు ఆదేశం
- తిరుమలలో పీఠం చేపట్టిన నిర్మాణాలపై అభ్యంతరం
- అతిక్రమణలు తేల్చేందుకు అడ్వకేట్ కమిషనర్ నియామకం

హ్యాపీగా దిగిపోతా!

> 56 నెలలుగా అధికారంలో ఉన్నాను. నేను బెటర్‌గానే చేశానని అనుకుంటున్నా. ఎలాంటి విచారం లేదు. ఇప్పటికిప్పుడైనా సంతోషంగా దిగిపోతా.
>
> - ముఖ్యమంత్రి జగన్ నిర్వేదం



ఎన్నికల ముందు జగన్ స్వరంలో నిరాశ

- ప్రభుత్వ ధనంతో 'ఇండియా టుడే' సదస్సు
- తిరుపతిలో రెండు రోజులు ఎడ్యుకేషన్ సమ్మిట్
- చానల్‌కు రూ.3.50 కోట్ల జనం సొమ్ము సమర్పణ
- విద్యా సదస్సులో రాజకీయ ప్రశ్నలు - జవాబులు
- ఇన్నేళ్లలో తొలిసారిగా కాంగ్రెస్‌పై జగన్ విమర్శలు
- రాష్ట్రాన్ని తమ కుటుంబాన్ని విభజించారని ఆక్రోశం
- రాష్ట్ర ప్రయోజనాలకే కేంద్రంతో స్నేహమని వెల్లడి
- అమలులోకి రాని ఐబీ, ఆన్‌లైన్ కోర్సులపై గొప్పలు
- బైజూస్ కంటెంట్, ట్యాబ్‌లపై 'కలర్‌ఫుల్ స్పీచ్'

తిరుపతి/అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'వై నాట్ 175' అంటూ ఊరూవాడా ఊదరగొడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి... తొలిసారిగా నిరాశాపూరిత 'స్వరం' వినిపించారు. '56 నెలలుగా అధికారంలో ఉన్నాను. నేను బెటర్‌గానే చేశానని అనుకుంటున్నా. ఎలాంటి విచారం లేదు. ఇప్పటికిప్పుడైనా సంతోషంగా దిగిపోతా' అని వ్యాఖ్యానించారు. పథకాల పేర్లు, అమలు తీరు మార్చి, బటన్ నొక్కిన ప్రతిసారీ సొంత పత్రికకు కోట్ల రూపాయలతో ప్రకటనలు గుమ్మరిస్తున్న జగన్... తాజాగా ప్రజాధనంతో మరో ప్రచార జాతర మొదలుపెట్టారు. రూ.4 కోట్ల ఖర్చుతో తిరుపతిలో 'ఎడ్యుకేషన్ సమ్మిట్' పేరిట

మిగతా 2వ పేజీలో...

ఇదేనా చదువుల గొప్ప..

పిల్లల చదువులతో రకరకాల ప్రయోగాలు చేస్తూ... స్కూళ్ల విలీనం పేరిట బడులను 'దూరం' చేసిన జగన్... తన విద్యా విధానం గురించి చాలా గొప్పలు చెప్పారు. ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, ఇంటర్‌నేషనల్ బ్యాకెలారియేట్ (ఐబీ), ఆన్‌లైన్ కోర్సులు... అంటూ 'రంగుల చిత్రాన్ని' ఆవిష్కరించారు. ఉన్నత విద్య చదివిన వారికి ఉపాధి అవకాశాల మాటేమిటి, మీరు చేశామంటున్న మార్పు ఒకటి చెప్పండి... అనే ప్రశ్నకు సమాధానం చెప్పలేక తడబడ్డారు. 'ఉదాహరణకు.. ఉదాహరణకు' అంటూ

మిగతా 2వ పేజీలో...

బెరైటీస్‌లో వసూల్‌రాజా

మంగంపేట దోపిడీలో ప్రధాన పాత్రధారి

- ప్లాన్ ఆయనది.. అమలు బంగారుకొండది
- దందాలో మరో ఆరుగురు అధికారులూ
- తెరపైకి ఇద్దరి భార్యలు, భర్త, బామ్మర్దులు
- బినామీ కంపెనీలతో వందల కోట్లు దోపిడీ
- వారిలో అత్యధికులది కడప జిల్లానే
- ఫిర్యాదులు వచ్చినా పెద్ద తలలు సేఫ్



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ 'ఘనుడు' దోపిడీ గురించి విన్నది తక్కువే! దోచుకోవడంలో ఆయన 'బంగారు కొండ' అయితే.. ఆయన్ను మించిన అనకొండ మరొకరు ఉన్నారు. ఆయనే వసూల్‌రాజా. ముఖ్య నేత వద్ద పనిచేస్తున్న ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వసూల్‌రాజానే.. మంగంపేట బెరైటీస్ దోపిడీలో ప్రధాన పాత్రధారి. నమ్మినబంటు బంగారుకొండను ముందుపెట్టి, ఆయన తెరవెనక ఉండి బెరైటీస్ అమ్మకాల్లో భారీ దోపిడీ సాగించారు. అటు ప్రభుత్వంలో చీకటి వ్యవహారాలు చక్కబెట్టడంతో పాటు ఇటు గనుల శాఖలో దోపిడీ దందాలు అడ్డూ అదుపూ లేకుండా నడిపించారు. వసూల్‌రాజా వ్యూహాలను బంగారుకొండ అమలు చేశారు. వ్యవహారం బయటపడకుండా నమకస్తులైన మరో ఆరుగురు అధికారులకు వాటాలు కట్టబెట్టారు. అధికారులు తమ కుటుంబ సభ్యులను (భార్యలు, భర్త, బామ్మర్దులు) వ్యాపారులుగా రంగంలోకి

మిగతా 12వ పేజీలో...

వైఎస్ కొడుకుగా పుట్టి ఇలా చేస్తావా జగనన్నా?

- స్వలాభం కోసం 600 కోట్లకు అదానీకి గంగవరం కట్టబెట్టావ్
- నీ ప్రయోజనం కోసం ప్రజల సొమ్మును, ప్రజలను కూడా తాకట్టు పెడతావా?
- ఉక్కు ఉద్యోగ, కార్మికులకు భరోసా ఏదీ?.. ఇది మీ పాలనా వైఫల్యం కాదా?
- బీజేపీతో కంటికి కుపించని పొత్తు.. ఒక్క రాజధానిని లేకుండా చేశావ్
- సీఎంపై నిప్పులు చెరిగిన పీసీసీ చీఫ్ షర్మిల.. మేనిఫెస్టోలో 'ఉక్కు' హామీ



విశాఖ నగర పరిధిలోని కూర్మన్నపాలెంలో స్టీల్‌ప్లాంటు కార్మికులు, నిర్వాసితులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

11

మైనింగా.. మజాకానా..

విప్ అయితే నాకేంటి?

- వెంకటరెడ్డి ఆఫీసులో ఎవరైనా దిగదుడుపే.. సామినేని ఉదయభానుకు తీవ్ర అవమానం
- ఎండీ కార్యాలయంలో పరాభవం.. కూర్చోబెట్టకుండానే మాట్లాడిన డిప్యూటీ మేనేజర్
- 'నా స్థాయి తెలీకుండానే వచ్చారా' అని గద్దింపు.. ఏం చేయాలో తెలియక విప్ మౌనం
- హక్కులకు భంగం కలిగించడని స్పీకర్‌కు ఫిర్యాదు.. అయినా చర్యలు తీసుకోని గనుల శాఖ
- 'మై హూనా' అంటూ డిప్యూటీ మేనేజర్‌కు ఉన్నతాధికారి అభయం

11

జగన్ కుటుంబానికి ప్రధాని తరహా భద్రత!

» ఎస్‌పీజీ మాదిరిగా ఎస్ఎస్‌జీ ఏర్పాటు

» ఆయన భార్యాబిడ్డలకు దేశ విదేశాల్లో ప్రత్యేక రక్షణ

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు దేశ ప్రధాని స్థాయిలో రక్షణ కల్పించేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రధానిని కంటికి రెప్పలా కాపాడే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్(ఎస్‌పీజీ) తరహాలో రాష్ట్రంలో స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్(ఎస్ఎస్‌జీ) ఏర్పాటు చేసింది. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేని విధంగా జగన్ కుటుంబ సభ్యులకు సైతం 24గంటల పాటు ఎస్ఎస్‌జీ రక్షణ వలయంలా నిలుస్తుంది. రాష్ట్రంలోనే గాక దేశంలోని ఇతర ప్రాంతాలకు.. ఆఖరికి విదేశాలకు వారు వెళ్లినా ఇవే రక్షణ ఏర్పాట్లు ఉంటాయి. ఎందుకింత ఆర్భాటం ప్రదర్శిస్తున్నారని గత సెప్టెంబరులో అసెంబ్లీలో ఈ బిల్లు ప్రవేశపెట్టినప్పుడే ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న ప్రకారం.. ముఖ్యమంత్రి జగన్ ప్రస్తుతం జడ్ ప్లస్ కేటగిరీలో 300 మంది సుశిక్షితులైన పోలీసు కమాండోల రక్షణలో ఉన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌జీలో మొత్తం 431పోస్టులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పోస్టుల్లోకి జిల్లాల్లోని ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీ స్పెషల్ పోలీస్, ఆక్టోపస్(ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక సంస్థ), గ్రేహౌండ్స్(నక్సలైట్ నిరోధక కమాండ్ యూనిట్) విభాగాల నుంచి చురుకైన యువ పోలీసులను తీసుకుని మెరికల్లా తీర్చిదిద్దారు. కొన్ని నెలలుగా శిక్షణ తీసుకున్న సాయుధ కమెండోలు బుధవారమే సీఎం రక్షణలో చేరినట్లు తెలిసింది.

ప్రారంభోత్సవం వేళ కొబ్బరికాయతో తలపగలగొట్టాడు

» వైసీపీలో రెండు వర్గాల ఘర్షణ

చాగల్లు, జనవరి 24: ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో వైసీపీకి చెందిన రెండు వర్గాలు గొడవపడి.. కొబ్బరికాయతో తలపగలగొట్టిన ఘటన తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం కలవలపల్లి శివారు రామచంద్రవరంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని హోంమంత్రి తానేటి వనిత ప్రారంభించాల్సి ఉంది. అయితే కార్యక్రమానికి హోంమంత్రి రాలేదు. ఫోనులో సంప్రదిస్తే.. మీరే చేసుకోండని మంత్రి పీఏ చెప్పారు. దీంతో స్థల దాత కొండేపాటి కాశీవిశ్వనాథం భవనాన్ని ప్రారంభించారు. దీనిపై వైసీపీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మంత్రి లేకుండా ప్రారంభోత్సవం చేస్తారా అంటూ.. వైసీపీ నాయకుడు వై.జోషి కొబ్బరికాయతో అదే పార్టీకి చెందిన జొన్న శ్రీను తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'కోడికత్తి' గాయం చిన్నదే

» హత్యాయత్నం కేసు చెల్లుబాటు కాదు: నిందితుడు శ్రీనివాస్

» హైకోర్టులో ముగిసిన వాదనలు....తీర్పు రిజర్వ్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోడికత్తితో దాడి ఘటనలో అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం జగన్‌కు అయ్యింది చిన్నగాయమేనని, హత్యాయత్నం వంటి తీవ్ర సెక్షన్ల కింద కేసు నమోదు చెల్లుబాటుకాదని నిందితుడు శ్రీనివాస్ తరఫున న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాసరావు, సలీం బుధవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. ఘటన జరిగిన తరువాత బాధితుడు విశాఖ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించారని, ఆస్పత్రిలో చేరిన తరువాత తొమ్మిది గంటల్లోనే డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో హత్యాయత్నం (సెక్షన్ 307) కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదని, పిటిషనర్‌పై ఐపీసీ సెక్షన్ 324(స్వల్ప గాయం) కింద మాత్రమే కేసు నమోదు చేయగలరని పేర్కొన్నారు. ఈ కేసులో 55మంది సాక్షులు ఉండగా, ఐదేళ్లలో ఒక్కరి వాంగ్మూలం మాత్రమే నమోదు చేశారని వివరించారు. బాధితుడు జగన్ విచారణకు సహకరించడం లేదన్నారు. పిటిషనర్ గత ఐదేళ్లుగా జైలులోనే గడుపుతున్నాడని, విచారణలో జాప్యం జరిగినప్పుడు విచారణ ఖైదీలకు బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని పేర్కొన్నారు. పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఎన్ఐఏ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. బెయిల్ ఇచ్చేట్లైతే షరతులు విధించాలని కోరారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

బీఈడ్ కౌన్సెలింగ్‌పై విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎడ్‌సెట్ ఫలితాలు ప్రకటించి ఆరు నెలలు గడుస్తున్నా, బీఎడ్ కౌన్సెలింగ్ నిర్వహించలేదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఏపీఎడ్‌సెట్ కన్వీనర్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది.

విధ్వంసం సృష్టించడంలో మోదీ, జగన్ కెమిస్ట్రీ ఒకటే

తెలంగాణ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని ధ్వజం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలన సాగిస్తున్నారు. ఈ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ, జనసేన కూటమి కమ్యూనిస్టు పార్టీలను కూడా కలుపుకుని ఎన్నికలకు వెళ్తేనే వైసీపీని ఓడించడం సాధ్యమవుతుంది' అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజయవాడలో అన్నారు. 'జగన్ తనకు అడ్డొస్తే.. బాబాయిని కూడా తొలగించగలరు. జగనన్న వదిలిన బాణం ఎదురుతిరిగి ఇప్పుడు జగన్ గుండెల్లోనే గుచ్చుకునేందుకు సిద్ధమైంది. కేంద్రంలో మోదీ, ఏపీలో జగన్‌ల పరిపాలనపై ప్రజలకు విశ్వాసం లేదు. విధ్వంసం సృష్టించడంలో వీరిద్దరి కెమిస్ట్రీ ఒకటే' అని అన్నారు.

ఎన్నికల విధుల నుంచి ఆ ఉద్యోగులకు మినహాయింపు

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి కొన్ని శాఖలకు ఈసీ మినహాయింపు ఇచ్చింది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లోని సీనియర్ అధికారులు, వైద్య, ఆరోగ్యశాఖలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు సహా వైద్య సిబ్బంది, ఆయుష్ శాఖలోని ఆయుర్వేద వైద్యులు, యునానీ, హోమియోపతి మెడికల్ ఆఫీసర్లు, పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ డాక్టర్లు, పారా వెటర్నరీ సిబ్బంది, అటవీశాఖలో ప్రాదేశిక సిబ్బంది, ఆకాశవాణి, దూరదర్శన్ సిబ్బంది, ఎఫ్‌సీఐ అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొంటూ రాష్ట్ర సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

కూలిన రష్యా సైనిక విమానం.. 74 మంది దుర్మరణం

మాస్కో, జనవరి 24: ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలను తరలిస్తున్న రష్యా సైనిక రవాణా విమానం కుప్పకూలింది. అందులోని 65 మంది ఖైదీలు, ఆరుగురు సిబ్బంది సహా మొత్తం 74 మంది మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన బుధవారం రష్యాలోని బెల్గొరాడ్‌లో జరిగింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. ఉక్రెయిన్ బలగాలే క్షిపణుల ద్వారా విమానాన్ని కూల్చివేశాయని రష్యా చట్టసభల సభ్యులు ఇద్దరు ఆరోపించారు. 'ఖైదీల మార్పిడి కోసం రష్యా సైనిక విమానం ఖైదీలను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింద'ని తెలుస్తోంది.

ఇండియా కూటమికి బీటలు!

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీని సమైక్యంగా ఎదుర్కొనే లక్ష్యంతో రూపొందిన ప్రతిపక్ష ఇండియా కూటమిలో బీటలు వారుతున్నాయి. కూటమిలోని ప్రధాన పార్టీల్లో ఒకటైన తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని, తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బుధవారం ప్రకటించారు. 'సీట్ల పంపకాలపై వారికి ఒక ప్రతిపాదన చేశాను. కానీ, దానిని వారు తిరస్కరించారు. కాబట్టే బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేయాలని మా పార్టీ నిర్ణయించింది. ఇక బెంగాల్‌లో కాంగ్రెస్‌తో మాకు ఎటువంటి సంబంధం ఉండదు' అని పేర్కొన్నారు. సీట్ల పంపకాలపై కాంగ్రెస్‌లో ఎవరితోనూ మాట్లాడలేదని చెప్పారు. 'దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సొంతంగా 300 సీట్లలో పోటీ చేయవచ్చు. మిగిలిన స్థానాల్లో ప్రాంతీయపార్టీలు పోటీ చేస్తాయి. బెంగాల్‌లో కాంగ్రెస్ జోక్యం చేసుకుంటే మాత్రం మేం సహించేది లేదు' అని తేల్చి చెప్పారు. అయితే, జాతీయస్థాయిలో మాత్రం తాము ఇండియా కూటమిలో భాగస్వామిగానే ఉంటామని, ఎన్నికల తర్వాత ఎటువంటి వ్యూహాన్ని అనుసరించాలో అప్పుడు ఆలోచిస్తామన్నారు. 'ప్రాంతీయపార్టీలన్నీ కలిసికట్టుగా ఉంటాయి. ప్రతిపక్ష కూటమి ఏ ఒక్క పార్టీదో కాదు. బీజేపీని ఓడించటానికి ఏం చేయాలో అవన్నీ చేస్తాం' అని పేర్కొన్నారు. మరోవైపు, రాహుల్ భారత్ జోడో న్యాయ యాత్ర గురువారం పశ్చిమ బెంగాల్‌లో ప్రవేశించనున్నప్పటికీ తమకు కనీసం మర్యాదకైనా ఆ కార్యక్రమం గురించి సమాచారం ఇవ్వలేదని మమత అసంతృప్తి వ్యక్తం చేశారు.



బెంగళూరులో ఇండియా కూటమి భేటీ(ఫైల్)

కాంగ్రెస్ వైఖరే కారణం: తృణమూల్

ఒంటరిగా వెళ్లాలని తమ నాయకురాలు నిర్ణయించటానికి కాంగ్రెస్ వైఖరే కారణమని తృణమూల్ నేతలు తెలిపారు. ఇండియా కూటమి ఏర్పాటైన కొత్తలో బీజేపీకి వ్యతిరేకంగా ముఖాముఖి (ఒకే పార్టీ) పోటీ జరిగేలా చూద్దామని అందరం భావించామని, కానీ కాంగ్రెస్ ఆ ఫార్ములాను పాటించటం లేదని చెప్పారు. తాము బలంగా ఉన్న రాష్ట్రాల్లో సీట్లను పంచుకోవటానికి కాంగ్రెస్ ఇష్టపడటం లేదని, ప్రాంతీయపార్టీలు బలంగా ఉండి తమ ఉనికి నామమాత్రంగా ఉన్న రాష్ట్రాల్లో మాత్రం సీట్ల కోసం పట్టు బడుతోందని విమర్శించారు. డిసెంబరు నెలాఖరులోపు సీట్ల పంపకాలపై నిర్ణయం తీసుకుందామని మమత చెప్పినప్పటికీ కాంగ్రెస్ తీవ్ర జాప్యం చేసిందని, చర్చలు ఫలించి ఉంటే ఒకటి రెండు సీట్లు అదనంగా ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డామని తెలిపారు.

పంజాబ్‌లో స్వీప్ చేస్తాం: మాన్

పంజాబ్‌లో ఉన్న మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లో తామే గెలుస్తామని ఆమ్‌ఆద్మీపార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి భగ్‌వంత్‌సింగ్ మాన్ తెలిపారు. కాంగ్రెస్‌తో ఎటువంటి చర్చలు లేవని చెప్పారు. ఒక్కో సీటుకు ముగ్గురు చొప్పున 13 సీట్లకు అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నామని, విజయమే ప్రాతిపదికగా అభ్యర్థిని నిర్ణయిస్తామన్నారు. సీట్ల పంపకాలపై కాంగ్రెస్-ఆప్ మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ.. మాన్ ఈ ప్రకటన చేయటం గమనార్హం. 'దేశంలోనే పంజాబ్ హీరోగా నిలుస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 13 సీట్లూ మేం గెలుస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు.

తాత్కాలిక అవరోధమే: కాంగ్రెస్

మమతా బెనర్జీ లేకుండా ఇండియా కూటమిని ఊహించలేమని, పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి పోటీ చేస్తుందని, భాగస్వామ్య పక్షాలన్నీ పాల్గొంటాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. అనిశ్చితికి త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

లోకం తీరు





3.5 టన్నుల జటాయువు

» రూపొందించిన 99 ఏళ్ల శిల్పి రామ్ సుతార్

అయోధ్యలోని కుబేర్ తిలాపై ఏర్పాటు చేసిన 3.5 టన్నుల బరువైన జటాయువు విగ్రహాన్ని తయారు చేయడానికి 3నెలల సమయం పట్టిందని, దీనికోసం 2నెలల పాటు అనేక గ్రంథాలను విస్తృతంగా పరిశోధించినట్లు ప్రముఖ శిల్పి రామ్ సుతార్ వివరించారు. ఆయన చెక్కిన విగ్రహం ప్రస్తుతం రామమందిరానికి సమీపంలోని గుట్టపై దర్శనమిస్తోంది. 20 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు, 8 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహానికి అయోధ్యలో చోటు దక్కటం సంతోషంగా ఉందని ఆయన కుమారుడు అనిల్ రామ్ సుతార్(66) పేర్కొన్నారు. గుజరాత్‌లోని 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'తో సహ దేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఎన్నో విగ్రహాలు రామ్ సుతార్ చేతుల నుంచే జాలువారాయి. ఆయన ఈ ఫిబ్రవరిలో 99వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. జటాయువు విగ్రహాన్ని 85 శాతం రాగి, 5శాతం టిన్, 5 శాతం జింక్, 5శాతం సీసంతో నోయిడాలోని తమ స్టూడియోలో తయారు చేయడంలో తన తండ్రికి సహకరించానని అనిల్ తెలిపారు.

అయోధ్యలో అదే రద్దీ

రెండోరోజు 3లక్షల మందికి రామయ్య దర్శనం.. రద్దీపై యోగి సమీక్ష

అయోధ్య, జనవరి 24: అయోధ్య నూతనంగా నిర్మితమైన రామమందిరానికి భక్తులు పోటెత్తుతున్నారు. బాల రాముడి దర్శనం కోసం బారులు తీరుతున్నారు. ఆలయం వెలుపల కిటకిటలాడుతున్న పొడవైన క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సామాన్య భక్తులకు దర్శనాలు ప్రారంభమైన తర్వాత వరుసగా రెండోరోజు బుధవారం కూడా తీవ్ర రద్దీ కొనసాగింది. మధ్యాహ్నం వరకూ దాదాపు 3లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రాణప్రతిష్ఠ అనంతరం మొదటిరోజు మంగళవారం సుమారు 5లక్షల మంది ఆలయాన్ని సందర్శించారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో రామమందిరానికి వెళ్లే ప్రధాన రహదారులపై ప్రయాణించే వాహనాలను దారి మళ్లించారు. అటువైపుగా భక్తులు నడిచి వెళ్లడానికి కూడా అనుమతించడం లేదు. భక్తుల కోసం మెరుగైన క్యూ వ్యవస్థను సిద్ధం చేశామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని శాంతిభద్రతల డీజీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. దర్శనాలు సాఫీగా సాగుతున్నాయని,



పబ్లిక్ ఫెసిలిటేషన్ సెంటర్‌తో పాటు దర్శనం అనంతరం భక్తులు ఆలయం బయటకు వెళ్లడానికి మరో మార్గాన్ని ఏర్పాటు చేశామని హోంశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ ప్రసాద్ వివరించారు. రద్దీ నియంత్రణలో భాగంగా సుల్తాన్‌పూర్ నుంచి అయోధ్య మార్గంలో బస్సుల రాకపోకలు నిలిపివేసినట్లు యూపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. ఈ నగరానికి వెళ్లే రహదారుల్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని నియంత్రించడానికి ఆలయంలో చేసిన ఏర్పాట్లను సమీక్షించడానికి సీఎం యోగి ఆదిత్యనాథ్ లఖ్‌నవూలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతానికి అయోధ్యకు అదనపు బస్సు సర్వీసులను నిలిపివేయాలని ఆదేశించారు.

బాల రాముడి దర్శనానికి హనుమ

అయోధ్య రామమందిరంలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన మరుసటి రోజే గర్భగుడిలోకి ఒక వానరం ప్రవేశించింది. అది కాసేపు అక్కడ ఉండి వెళ్లిపోయింది. ఈ ఘటనను ఆలయ ట్రస్ట్ సోషల్ మీడియాలో పంచుకుంది.

'అయోధ్య'కు దళితుల విరాళాలు పనికిరావట!

న్యూఢిల్లీ, జనవరి 24: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనతో దేశమంతా పండుగ జరుపుకొంటుండగా.. రాజస్థాన్‌లోని ఓ గ్రామంలో ఇందుకోసం సేకరించిన విరాళాల విషయంలో వివాదం తలెత్తింది. రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, ప్రసాదం పంపిణీ కోసం ఝలావర్ జిల్లాలోని ముండ్లా గ్రామంలో దళితుల నుంచి సేకరించిన విరాళాలను వెనక్కి ఇచ్చేశారు. తామిచ్చిన విరాళాలను ప్రసాదం తయారీకి వినియోగిస్తే అపవిత్రమవుతుందంటూ తిరిగి ఇచ్చేశారని ఆ గ్రామానికి చెందిన దళితులు చెబుతున్నారు. విరాళాలు వసూలు చేసి, తిరిగి ఇచ్చిన అగ్రకులాల వారిపై చర్యలు తీసుకోవాలంటూ కాన్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హ్యాపీగా దిగిపోతా!

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల చర్చా వేదిక ఏర్పాటు చేశారు. ఈ చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసిన చానల్‌కే రూ.3.50 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ప్రభుత్వ 'ఇమేజ్ బిల్డప్' కోసం టైమ్స్ గ్రూప్‌కు రూ.25 కోట్లు సమర్పించిన జగన్... ఇప్పుడు 'ఇండియా టుడే' చానల్‌తోనూ అదే తరహా డీల్ కుదుర్చుకోవడం గమనార్హం.



అక్కడా రాజకీయాలే...

బుధవారం రెండో రోజు జరిగిన 'ఎడ్యుకేషన్ సమిట్'లో సీఎం జగన్ పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చర్చను విద్యారంగానికే పరిమితం చేశారా అంటే అదీ లేదు. సుమారు గంటపాటు సాగిన చర్చలో దాదాపు 25 నిమిషాలు రాజకీయాంశాలకు కేటాయించారు. 'ముందే అనుకున్నట్లు'గా అన్నట్లుగా ఈ ప్రశ్నోత్తరాలు సాగడం మరో విశేషం. 'మీరు మళ్లీ అధికారంలోకి వస్తారా' అని రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశ్నించగా... 'హోప్ ఈజ్ స్ట్రాంగర్ దేన్ రియాలిటీ' (వాస్తవం కంటే ఆశ/నమ్మకం బలమైనది) అని జగన్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత... '56 నెలలుగా అధికారంలో ఉన్నాను. నేను బెటర్‌గానే చేశానని అనుకుంటున్నా. ఇప్పటికిప్పుడైనా సంతోషంగా దిగిపోతా' అంటూ ఎన్నికల ముందు 'ఓటమి' స్వరం వినిపించారు.

'విభజన' ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

విభజన హామీలు సాధించేందుకు జగన్ ఇన్నేళ్లలో చేసిన ప్రయత్నమే లేదు. కేంద్రానికి తూతూమంత్రం లేఖలు రాయడం తప్ప... ఘాటుగా ప్రశ్నించిందే లేదు. రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌ను విమర్శించిందీ లేదు. కానీ... రాష్ట్ర విభజన అన్యాయమైన పద్ధతిలో జరిగిందంటూ హఠాత్తుగా గుర్తుకొచ్చింది. సోదరి షర్మిల పీసీసీ అధ్యక్షురాలి హోదాలో ప్రత్యేక హోదా సహా ఇతర అంశాలపై వరుస ప్రశ్నలు సంధిస్తుండటంతో కాంగ్రెస్‌పై జగన్‌కు బాగా కోపమొచ్చింది. "కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలు చేస్తోంది. అది ఆ పార్టీ సాంప్రదాయం. విభజించి పాలించడం ఆ పార్టీకి అలవాటు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని అన్యాయమైన పద్ధతిలో విభజించారు. అలాగే... మా కుటుంబాన్ని కూడా విభజించారు. నేను కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చినప్పుడు... మా చిన్నాన్నకు మంత్రి పదవి ఇచ్చి, మాపై పోటీకి నిలబెట్టారు. ఇప్పుడు ఆ పార్టీ సారథ్య బాధ్యతలు నా సోదరికి అప్పగించారు. వారికి దేవుడే బుద్ధి చెబుతాడు" అంటూ శాపనార్థాలు పెట్టారు. కొత్త రాష్ట్రం కావడంతో కేంద్ర సహకారం అవసరమంటూ ఎన్డీయేలో కొనసాగిన టీడీపీని... జగన్ విపక్షంలో ఉండగా నిత్యం వేధించుకుతిన్నారు. ఇప్పుడు మాత్రం తాను రాష్ట్రంలో అభివృద్ధి కోసమే కేంద్రంతో సఖ్యతగా ఉన్నట్లు చెప్పడం గమనార్హం. ఏపీలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ఉనికి లేదని, తమకు టీడీపీ-జనసేన పార్టీలతోనే పోటీ అని స్పష్టం చేశారు.

నాపై సానుకూలం.. నేతలపై వ్యతిరేకత

సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఎడాపెడా మార్చేస్తున్న, టికెట్లు నిరాకరిస్తున్న జగన్... తన నిర్ణయాలను సమర్థించుకున్నారు. ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారని, కొందరు స్థానిక నాయకుల విషయంలో అసంతృప్తితో ఉన్నారని ఆయన చెప్పారు. ప్రజా వ్యతిరేకత ఉన్నందుకే కొందరికి టికెట్లు ఇవ్వలేదన్నారు. సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. సామాజిక సమీకరణల దృష్ట్యా కూడా కొన్ని మార్పులు చేశామన్నారు.

ఇదేనా చదువుల గొప్ప..

(మొదటి పేజీ తరువాయి)

మన దేశంలో బీకాం చదివిన వాళ్లకు ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ తెలియదని జగన్ చెప్పారు. ఇలాంటి వాళ్లకు హార్వర్డ్ లాంటి ప్రఖ్యాత వర్సిటీలతో సర్టిఫికెట్లు ఇప్పించేందుకు 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకున్నామన్నారు. నిజానికి... ఈ ఒప్పందం ఇంకా అమలులోకి రాలేదు. ఇదే కాదు... సీఎం గొప్పగా చెబుతున్న 'ఐబీ' సంగతీ అంతే. జగన్ అధికారంలోకి రాగానే... మొత్తం 45వేల పాఠశాలల్లో సీబీఎస్ఈ ప్రవేశపెడతామని గొప్పగా చెప్పారు. కానీ... వెయ్యి స్కూళ్లలో కూడా ప్రవేశపెట్టలేకపోయారు. సీబీఎస్ఈకి సరిపడా ప్రమాణాలు, వసతులు లేకపోవడమే దీనికి కారణం. దీంతో... 'ఐబీ' అంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నారు. దీని పేరు వినడానికి మాత్రమే గొప్పగా ఉంటుంది. కానీ... ప్రపంచవ్యాప్తంగా పదివేల స్కూళ్లలో కూడా ఈ సిలబస్ అమలులో లేదు. మనదేశంలో ఎక్కడుందో ఎవరికీ తెలియదు. దీనివల్ల ఉపయోగమేమిటో కూడా విద్యా నిపుణులకు అర్థం కావడంలేదు. ఇది 2025 నుంచి రాష్ట్రంలో అమలులోకి వస్తుందని... ఒక్కో తరగతికి పొడిగించుకుంటూ వెళ్తామని, 2035 నాటికి రాష్ట్రంలోని విద్యార్థులంతా టెన్త్ పరీక్షలను 'ఐబీ'లో రాస్తారని జగన్ తిరుపతి సదస్సులో చెప్పారు.

బైజూస్, ట్యాబ్‌ల కథ...

'ఎడ్యుకేషన్ మీట్'లోనూ జగన్ బైజూస్ కంటెంట్, ట్యాబ్‌ల పంపిణీ గురించి అందంగా వివరించారు. దీనివల్ల నిజంగానే ఉపయోగముందా? స్టేట్ సిలబస్‌నే బైజూస్ కంటెంట్ పేరిట ట్యాబ్‌లలోకి ఎక్కించడం వల్ల ఉపయోగం ఏమిటి? పిల్లలు ఆ ట్యాబ్‌లను ఓపెన్ చేస్తున్నారా? అవి దుర్వినియోగం కావడం లేదా? వాటిలో ఎన్ని పనికొస్తున్నాయి? పక్కాగా సర్వే చేస్తే ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. అసలు వాస్తవాలు ఏమైనప్పటికీ... జగన్ చెప్పిన అంశాలతో రాజ్‌దీప్ సర్దేశాయ్ బాగా సంతృప్తి చెందడం, 'మీరు కూడా చప్పట్లు కొట్టండి' అని అందరితో చప్పట్లు కొట్టించడం కొసమెరుపు!

ప్రతీకారం లేనేలేదట!

వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచీ విపక్ష నేతలను కేసుల్లో ఇరికించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న సంగతి తెలిసిందే. కానీ... చంద్రబాబు విషయంలో ప్రతీకారం లేనే లేదని 'ఎడ్యుకేషన్ సమ్మిట్'లో జగన్ స్పష్టం చేశారు. సీఐడీని దుర్వినియోగం చేశామన్న ఆరోపణలు అర్థరహితమన్నారు. సీఐడీ కేసులు పెట్టినా కోర్టులు ఆధారాలను చూస్తాయి కదా అని ప్రశ్నించారు.

152 చోట్ల ఆమెదే ఆధిపత్యం

» అత్యధిక నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం

» 23 నియోజకవర్గాల్లోనే పురుషుల ఆధిక్యం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని మహిళలే తేల్చనున్నారు. వారు మెచ్చిన పార్టీనే అధికారంలోకి రానున్నది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా-2024లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 152 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కేవలం 23 నియోజకవర్గాల్లోనే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,08,07,256గా తేలింది. అందులో మహిళా ఓటర్లు 2,07,29,452 కాగా, పురుష ఓటర్లు 2,00,74,322, ట్రాన్స్‌జెండర్లు 3,482. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో భీమిలి నియోజకవర్గంలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. అతితక్కువగా ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా పెడన నిలిచింది. మహిళా ఓటర్లు అధికంగా ఉన్న 152 నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో భీమిలి ఉంది. ఇక్కడ 1,78,999 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రెండో స్థానంలో పాణ్యం (1,65,311), మూడో స్థానంలో చంద్రగిరి (1,58,615) ఉన్నాయి. పురుష ఓటర్లు అధికంగా ఉన్న 23 నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో గాజువాక నిలిచింది. ఇక్కడ 163165 మంది ఓటర్లు ఉన్నారు. ద్వితీయ స్థానంలో రాప్తాడు (1,24,487), తృతీయ స్థానంలో హిందూపురం (1,24,058) ఉన్నాయి. సీఎం జగన్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పోటీ చేసే నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పులివెందులలో పురుషులు 1,11,227 మంది, మహిళలు 1,16,610 మంది ఉన్నారు. కుప్పంలో పురుష ఓటర్లు 1,11,428 మంది, మహిళా ఓటర్లు 1,11,860 మంది ఉన్నారు.

రాష్ట్రంలో భీమిలిలోనే ఓటర్లు ఎక్కువ

విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలో అత్యధికంగా 3,52,728 మంది ఓటర్లు ఉన్నారు. గాజువాక (3,24,441) ద్వితీయ, కర్నూలు జిల్లాలోని పాణ్యం (3,22,799) తృతీయ స్థానంలో నిలిచాయి. అత్యల్పంగా కృష్ణా జిల్లా పెడనలో 1,65,828 మంది ఓటర్లు ఉన్నారు.

ఏపీలోనూ కొనసాగుతున్న తెలంగాణ ఓటర్లు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏపీ జాబితాలో ఉన్న తెలంగాణ ఓటర్లను తుది జాబితాలోనూ తొలగించలేదు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురంలో రహీమున్నీసా దూదేకులకు ఖమ్మం జిల్లా మధిరలో ఓటు ఉంది. అక్కడే రేషన్ కార్డు కూడా ఉంది. ఇదే రహీమున్నీసాకు ఏపీలోని పెద్దాపురంలో కూడా ఓటు ఉంది. అలాగే దూదేకుల జానీ, దూదేకుల షాహిబ్జానీ ఓట్లు కూడా రెండు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఫామ్-7 లను ఇచ్చినప్పటికీ ఎన్నికల అధికారులు వీటిని తుది జాబితాలోనూ తొలగించలేదు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఓటర్ల జాబితాల పంపిణీ పూర్తి కాలేదు. జాబితాలు రాజకీయ పార్టీల చేతికి వచ్చాక.. ఇంకా అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అత్యధిక ఓటర్లు ఉన్న టాప్-10 నియోజకవర్గాలు

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
భీమిలి	3,52,728
గాజువాక	3,24,441
పాణ్యం	3,22,799
చంద్రగిరి	3,09,316
పెందుర్తి	2,99,572
తిరుపతి	2,98,335
పెనమలూరు	2,86,743
మంగళగిరి	2,86,552
అనంతపురం	2,78,672
గన్నవరం	2,77,393

ఓట్ల తొలగింపునకు తప్పుడు ఫాం-7లు

» కాకినాడ జిల్లా గొల్లప్రోలులో నలుగురిపై కేసు

గొల్లప్రోలు, జనవరి 24: ఓట్ల తొలగింపునకు తప్పుడు ఫాం-7లు దాఖలు చేసిన నలుగురు వ్యక్తులపై కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఐదు అంతకుమించి ఓట్లు తొలగించాలంటూ దాఖలైన ఫాం-7 దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక విచారణ జరిపారు. ఈ విచారణలో 90శాతంపైగా తప్పుడు దరఖాస్తులుగా తేలింది. దీనిపై ఎన్నికల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన ఓ వ్యక్తి పేరుపై 25 ఓట్లు, పట్టణంలో రెండు ఓట్లు, కొత్తపల్లి మండలంలో ఒక ఓటు తొలగింపునకు ఫాం-7 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై విచారణ జరపగా గొల్లప్రోలు మండలంలోని రెండు దరఖాస్తులు మాత్రమే వాస్తవమని తేలింది. ఇదే మండలంలోని దుర్గాడకు చెందిన మరో వ్యక్తి పేరున గొల్లప్రోలు మండలంలో 11 ఓట్ల తొలగింపునకు ఫాం-7 దరఖాస్తులు రాగా అవన్నీ తప్పుడివిగా తేలింది. ఇదే మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేరుతో గొల్లప్రోలు మండలంలో 13, పట్టణంలో 3 ఓట్లు తొలగింపునకు దరఖాస్తులు రాగా అవన్నీ తప్పుడువిగా విచారణలో వెల్లడైంది.

వైసీపీ ఓట్ల జాబితా కుట్రలపై జాగ్రత్త

» పల్లెలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయండి: పురందేశ్వరి

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని చెబుతోన్న వైసీపీ ఓట్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతోంది. ప్రతి పల్లెకు వెళ్లి ప్రజల్ని అప్రమత్తం చేయండి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికార పార్టీ తనకు అనుకూల ఓటర్ల జాబితా తయారు చేస్తోందని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర బీజేపీ సమాయత్తం అవుతోందని ఆమె అన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో 'గావ్ చలో అభియాన్' (పల్లెకు వెళ్లి ప్రచారం) కార్యక్రమాన్ని పార్టీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడారు. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కొత్త ఓటర్ల జాబితాపై పల్లెల్లోకి వెళ్లి ఆరా తీసి అసలైన ఓటర్లకు అన్యాయం జరగకుండా పార్టీ కార్యకర్తలు ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం పని చేయాలన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మంది యువ ఓటర్లతో సమ్మేళనం నిర్వహించబోతున్నట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ కృష్ణ తెలిపారు.

శ్రీశైలంలో మహాకుంభాభిషేకానికి

వారంలో ముహూర్తం

- దేవదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించిన హైకోర్టు
- 7 నెలల సమయం తీసుకోవడంపై తీవ్ర అభ్యంతరం
- ఇంత ఆలస్యం ఎందుకు జరిగిందని నిలదీత
- ముహూర్తం నిర్ణయంపై ఎవరెవరిని సంప్రదిస్తారు?
- ఇప్పటివరకూ ఎంతమంది సలహాలు తీసుకున్నారు?
- వారు ఏ తేదీలు నిర్ణయించారని అడిగిన ధర్మాసనం
- కోర్టులో ఉన్న దేవదాయ కమిషనర్‌పై ప్రశ్నల వర్షం
- తేదీలు ఖారారు చేసి కోర్టు ముందుంచాలని ఆదేశం
- విచారణ రెండు వారాలకు వాయిదా



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మహాకుంభాభిషేకం, ఇతర క్రతువుల నిర్వహణకు వారం రోజుల్లో ముహూర్తం ఖరారు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ముహూర్తం ఖరారు చేసేందుకు ఏడు నెలల సమయం తీసుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇంత ఆలస్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించింది. 'ముహూర్తం నిర్ణయించేందుకు ఎవరెవరిని సంప్రదిస్తారు? ఇప్పటివరకు ఎంత మంది సలహా తీసుకున్నారు? వారు ఏ తేదీలు నిర్ణయించారు?' అంటూ కమిషనర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. సాధ్యమైనంత త్వరగా సంప్రదింపుల ప్రక్రియను పూర్తి చేయాలని, మహాకుంభాభిషేకం ముహూర్తం ఖరారు చేసి, వివరాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. శ్రీశైలంలో మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణను వాయిదా వేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అఖిల భారత వీరశైవ ధార్మిక ఆగమ పరిషత్ చైర్మన్ సంగాల సాగర్ ప్రజా ప్రయోజనం వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గతేడాది మే నెలలో విచారణ జరిపిన ధర్మాసనం.. ముహూర్తం తిరిగి ఖారారు చేయాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, శ్రీశైలం దేవస్థానం ఈవోను ఆదేశించింది. అందుకోసం సంప్రదింపుల ప్రక్రియను గరిష్ఠంగా ఆరు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు అమలుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం దేవాదాయశాఖ కమిషనర్ హాజరుకు ఆదేశించింది. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వి.వి. సతీశ్ వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేవాదాయశాఖ కమిషనర్, ఐఏఎస్ అధికారి సత్యనారాయణ హైకోర్టు ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మాసనం కమిషనర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. కమిషనర్ బదులిస్తూ... ముహూర్తం తిరిగి ఖరారు చేసేందుకు ఇప్పటివరకు కంచి కామకోటి పీఠం విజయేంద్రసరస్వతీ స్వామి, విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి, శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చిన్న సిద్ధరామ పండితారాధ్య శివచార్య మహాస్వామి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మను సంప్రదించామని వివరించారు. వారు మార్చి 12 నుంచి 30 వరకు వేర్వేరు తేదీలు సూచించారని తెలిపారు. మహాకుంభాభిషేకం కార్యక్రమం మొత్తం 5 రోజుల పాటు జరుగుతుందన్నారు. దేవస్థానానికి సంబంధించిన ప్రధాన పూజారులను, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, మరికొందరిని సంప్రదించాల్సి ఉందని, రెండు రోజుల్లో సంప్రదింపుల ప్రక్రియను పూర్తిచేసి తేదీలు ఖరారు చేస్తామని కోర్టుకు విన్నవించారు.

ఆ భవన నిర్మాణాలు నిలిపేయండి

- విశాఖ శారదా పీఠం, టీటీడీకి హైకోర్టు ఆదేశం
- తిరుమలలో పీఠం చేపట్టిన నిర్మాణాలపై అభ్యంతరం
- అతిక్రమణలు తేల్చడానికి అడ్వకేట్ కమిషనర్ నియామకం
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశం
- టీటీడీ, శారదా పీఠానికి నోటీసులు జారీ
- విచారణ మూడు వారాలకు వాయిదా

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుమల గోగర్భం డ్యాం ప్రాంతంలో విశాఖ శారదా పీఠం అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను తక్షణం నిలుపుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. నిర్మాణాల్లో ఏ మేరకు అతిక్రమణలు జరిగాయో తేల్చేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. భద్రత విషయంలో రాజీపడలేమని తేల్చిచెప్పింది. టీటీడీ ఈవో, దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ చీఫ్ ఇంజనీర్, జేఈవో, విశాఖ శారదా పీఠం తిరుమల మేనేజర్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. తిరుమల గోగర్భం డ్యాం ప్రాంతంలో విశాఖ శారదా పీఠం అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టీటీడీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు న్యాయవాది తుమ్మా ఓంకార్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... బిల్డింగ్ ప్లాన్ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం చేస్తున్నారని, నిబంధనల మేరకు భవనాల చుట్టూ తగినంత సెట్‌బ్యాక్ స్థలాన్ని వదలడం లేదని తెలిపారు. కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేశారన్నారు. భవన నిర్మాణ పనులను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. శారదా పీఠం తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ... భవనాలకు సంబంధించి సవరించిన ప్లాన్ ఆమోదం కోసం టీటీడీకి సమర్పించామని, నిర్మాణాల క్రమబద్ధీకరణకు సొమ్ము చెల్లించామని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టిన భవన నిర్మాణాల్లో ఎలాంటి అతిక్రమణలు జరగలేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... సెట్‌బ్యాక్ స్థలం వదలకుండా ప్లాన్‌కు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టడం తీవ్ర ఉల్లంఘనగా పేర్కొంది.

కిడ్నాప్ కేసులో దస్తగిరికి బెయిల్.. హైకోర్టు తీర్పు

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరికి హైకోర్టులో ఉపశమనం లభించింది. కడప జిల్లా ఎర్రగుంట్ల పోలీసులు నమోదు చేసిన కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం తీర్పు ఇచ్చారు. బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో దస్తగిరి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఇదే కేసులో ఇతర నిందితులకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని.. రాజకీయ కారణాలతో దస్తగిరి బయటకు రాకుండా కేసులు పెడుతున్నారని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. అసిస్టెంట్ పీపీ బదులిస్తూ.. దర్యాప్తు కొనసాగుతోందని.. ఇప్పటికే 23 మంది సాక్షులను విచారించామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. దర్యాప్తు చివరి దశకు చేరుకుందని దస్తగిరికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

తెలంగాణ పోలీసులతో భద్రత కల్పించాలి

- దస్తగిరి భార్య షబానా

కడప (క్రైం), జనవరి 24: ఆంధ్రప్రదేశ్ పోలీసులు కల్పించే భద్రతపై తమకు నమ్మకం లేదని వైఎస్ వివేకా హత్యకేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి భార్య షబానా అన్నారు. తన భర్త కేసు తెలంగాణలో ఉందని, తమకు కూడా ఆ రాష్ట్ర పోలీసులతోనే భద్రత కల్పిస్తే మంచిదన్నారు. బుధవారం ఆమె 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నా భర్తకు బెయిలు ఇవ్వకుండా అక్రమ కేసులు, పీటీ వారెంట్ల ద్వారా ఇబ్బందులకు గురి చేస్తున్నారు" అని షబానా అన్నారు. తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మఠాలా...లాడ్జీలా?

- తిరుమల కొండపై భారీ వ్యాపారం
- మఠాల్లో జరగాల్సింది అనుగ్రహ భాషణం కానీ, అద్దెకు గదులిచ్చి వేలల్లో వసూలు
- మఠాల్లో కల్యాణాలకు లక్షల్లో రేట్లు
- కాంట్రాక్టర్ల అజమాయిషీలోనే సకలం
- గోగర్భతీర్థంలో విశాఖ శారదాపీఠం ఇష్టారాజ్యం
- రోడ్డుపై దాకా చొచ్చుకొచ్చిన నిర్మాణాలు
- రూల్స్ ఉల్లంఘించి అదనపు అంతస్థు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

తిరుమల కొండమీద ధర్మప్రచారంతో ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉండాల్సిన మఠాలు వ్యాపార కేంద్రాలుగా రూపు మార్చుకుంటున్నాయి. నిత్యపూజలు, ధార్మిక విషయాలపై అనుగ్రహ భాషణం వంటి కార్యక్రమాలు చేపట్టడం మఠాల విధులు. కానీ కల్యాణ మండపాలు, గదులు నిర్మించుకుని అద్దెలకు ఇచ్చుకుంటూ వ్యాపారం చేస్తున్నాయి. కొన్ని మఠాలు అయితే టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నాయి. తిరుమలలో 31 మఠాలున్నాయి. కల్యాణాలు చేయడం మఠాల పని కాదు. కానీ 21 మఠాల్లో కల్యాణ మండపాలున్నాయి. వీటికి అనుబంధంగా ప్రతి మఠంలోనూ గదులుంటాయి. ఒక్కో మఠంలో పదిహేను నుంచి 40 గదులుంటాయి. ఇలా మఠాలన్నింటిలో కలిపి 840 గదులున్నాయి. వీటిల్లో ఏసీ గదులు 200. తిరుమల కొండమీద వసతి దొరకడం దర్శనంకన్నా కష్టమైనది. ఈ డిమాండునే మఠాలు సొమ్ము చేసుకుంటున్నాయి. గదికి రూ.రెండు వేల నుంచి రూ.ఆరు వేల దాకా వసూలు చేస్తున్నారు. కొన్ని మఠాల్లోని గదులు స్టార్ హోటల్ వసతులను తలపిస్తున్నాయి. ఇక కల్యాణ మండపాల అద్దెలు కూడా భారీగానే ఉన్నాయి. రూ.30 వేల నుంచి రూ.2లక్షల దాకా అద్దె ఉంది. పెళ్లిళ్ల సీజన్ అయితే మఠాలకు పండగే. ఈ మఠాల్లో జరిగే వివాహాలు కాంట్రాక్టర్ల అజమాయిషీలో నడుస్తున్నాయి. అలంకరణ, భోజనాలు, పురోహితులు, పెళ్లికి కావలసిన సకలం వీరే చూసుకుంటారు. ఇక్కడ భోజనాలు కూడా ఖరీదే. మఠంలో పెళ్లి చేసుకోవాలంటే రూ.2 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇలా మఠాలు రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నాయి. గదులకు డిమాండ్ పెరుగుతుండడంతో కొన్ని మఠాలైతే తమ పాత భవనాలను కూల్చి మరీ నూతన కట్టడాలకు పూనుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇవన్నీ జరుగుతున్నా టీటీడీ పట్టించుకోదు. మఠాల జోలికి వెళ్లడం మహా పాపం అన్నట్టుగా ఉండిపోతున్నారు. చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.



శారదాపీఠంవారి దర్జా ఇదీ...

రోడ్డుమీదకి చొచ్చుకువచ్చినట్టుగా నిర్మిస్తున్న ఈ భవనం విశాఖ శారదపీఠం వారిది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి తిరుమల కొండమీద వీరిదే ఇష్టారాజ్యం. ఈ మఠంలో రెండు కల్యాణ మండపాలు, 20 గదులు ఉన్నాయి. మంచి డిమాండ్ ఉన్న మఠం కావడంతో ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. దీంతో మఠం భవనాలను కోరుకున్న రీతిలో విస్తరిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ కాక మరో మూడు ఫ్లోర్‌లకు మించి తిరుమల కొండమీద నిర్మాణాలు సాగరాదన్నది పర్యావరణ నిబంధన. శారదా పీఠం మాత్రం మరొక అంతస్తు అదనంగా కట్టేస్తోంది. వీటిల్లో మరో 38 గదుల నిర్మాణం సాగుతోంది. ఇప్పటికే 70 శాతం పూర్తయింది. ఈ గదులు కూడా అందుబాటులోకి వస్తే దాదాపు 60 గదులతో భారీ వ్యాపారమే సాగుతుంది. ఇక మఠం ముందున్న స్థలాన్నీ దర్జాగా ఆక్రమించుకుని పది కార్లు పట్టేలా నిర్మించుకున్నారు. సీఎం జగన్...పెద్దస్వామికి ప్రియశిష్యుడు కావడంతో నిబంధనలు వీరికి గుర్తుచేసే ధైర్యం ఎవరూ చేయడంలేదు.



జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో పడాల వీరబాబు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

కాకినాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు తమ కుటుంబ సభ్యుల వంటివారని, వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చెప్పారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. స్కిల్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. తొలుత జగ్గంపేట నియోజకవర్గంలోని గుర్రంపాలెంలో పడాల వీరబాబు కుటుంబాన్ని పరామర్శించి చెక్కు అందజేశారు. ఆతర్వాత కాండ్రకోటలో బుద్దాల సుబ్బారావు(70) కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. తేటగుంటలో ఈసరపు నూకరాజు(63) కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. అనంతరం కాకినాడ సిటీలోని 26వ వార్డులో చిక్కాల సత్యవతి(55) కుటుంబ సభ్యులను భువనేశ్వరి కలిశారు. వారిని ఓదార్చిన భువనేశ్వరి అధైర్యపడొద్దని, ఏకష్టం వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామని ధైర్యం చెప్పారు. భువనేశ్వరి పర్యటనకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.

మూడు గంటల్లోపే రూ.300 దర్శన టికెట్ల కోటా పూర్తి

తిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కేవలం 2 గంటల 57 నిమిషాల్లో పూర్తయ్యాయి. ఏప్రిల్ నెలకు సంబంధించిన టికెట్లను టీటీడీ బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. ఈ క్రమంలో 12.57 గంటలకు టికెట్లను భక్తులు బుక్ చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'కంచె'లు–కుట్రలు

మణిపూర్‌లో బుధవారం మీతీ రాడికల్ సంస్థ ఒకటి నిర్వహించిన సమావేశానికి దాని ఆదేశాలమేరకు ఒక కేంద్రమంత్రి, ఓ రాజ్యసభ సభ్యుడు, అన్ని పార్టీలకు చెందిన నలభైమంది మీతీ ఎమ్మెల్యేలు హాజరైనారు. మీతీ ప్రయోజనాల పరిరక్షణనిమిత్తం ఈ సమావేశం కొన్ని తీర్మానాలు చేసింది. కుకీలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించడం, కుకీ తీవ్రవాద గ్రూపులతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దుచేసుకోవడం ఇత్యాది అంశాలతో పాటు, మయన్మార్ సరిహద్దును మూసివేసి, కంచెవేయడం కూడా వాటిలో ఒకటి. ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ స్వయంగా సమావేశానికి రాకపోయినా, కేంద్రప్రభుత్వానికి సమర్పించబోయే ఈ డిమాండ్ల జాబితామీద సంతకాలు చేసిన వారిలో ఆయన, ఉపముఖ్యమంత్రి, స్పీకర్ కూడా ఉన్నారు. ఇంఫాల్ నడిబొడ్డున, గతకాలపు రాజరికపాలనకు ప్రతీక అయిన కాంగ్లా కోటలో ఒక రాడికల్ సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి వందలాదిమంది మీతీలు హాజరైనారు. ముందురోజు ఢిల్లీనుంచి కేంద్రహోంశాఖ తరఫున ముగ్గురు సభ్యుల బృందం తరలివచ్చి అరంబాయ్ తెంగోల్ అనే ఈ సంస్థతో రెండుదఫాలు చర్చలు జరిపింది. భారీ భద్రతా ఏర్పాట్లు, పారామిలటరీ బలగాల మోహరింపు మధ్య సదస్సు కొద్దిగంటల్లోనే ముగిసింది. ఈ డిమాండ్లన్నీ నెరవేరనిపక్షంలో మీతీ ప్రజాప్రతినిధులంతా రాజీనామాలకు సైతం సిద్ధపడతారట.

ఒక రాడికల్ సంస్థ ఇలా ఓ సమావేశం పెట్టి, రావాల్సిందేనని ఆదేశిస్తే, మీతీ నేతలంతా వెళ్ళడం, సామూహిక ప్రమాణాలు చేయడం, ఆ డిమాండ్లమీద సంతకాలు పెట్టడం, ఇదంతా కేంద్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధుల కనుసన్నల్లో జరగడం ఏమిటని చాలామందికి ఆశ్చర్యం కలగవచ్చు. ఒక మిలిటెంట్ సంస్థకు ముఖ్యమంత్రి సహా ఆయన మంత్రివర్గమంతా తలొంచడమేమిటని అనిపించవచ్చు. నిజానికి, కుకీలకు ఉన్న ఎస్టీ హోదాను రద్దుచేసే దిశగా బీరేన్‌సింగ్ ప్రభుత్వం ఇప్పటికే ఓ అడుగు వేసింది. కుకీలు స్థానికులు కారు అన్నవాదనతో వారి ఎస్టీ హోదాను పునఃపరిశీలించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు ఆయన పక్షంరోజుల క్రితమే ప్రకటించారు. కుకీ అన్న సాధారణ పేరుతో ఉన్న చాలా తెగలను, మిజోలతోను, మయన్మార్‌తోనూ మూలాలు పంచుకుంటున్నవాటిని జాబితానుంచి చెరిపివేసే ప్రయత్నం ఇది. మీతీ బీరేన్ కుట్రపూరితంగా మరో మహాయుద్ధానికి తెరదీస్తున్నారని వెంటనే ఈ తెగలకు చెందిన సంఘాలు హెచ్చరించాయి కూడా. ఇక, పాతికకుపైగా కుకీ మిలిటెంట్ సంస్థలతో అమలులో ఉన్న ఒప్పందాలన్నీ రద్దయిన పక్షంలో భద్రతాదళాలు పూర్తిస్థాయి యుద్ధంతో వాటిని సమూలంగా తుడిచిపెట్టవచ్చు.

భారత్–మయన్మార్ మధ్య ఉన్న 1643కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దుగుండా కంచెవేయబోతున్నట్టు, ఉభయదేశాల సరిహద్దు ప్రజలు పొరుగుదేశంలోకి 16కిలోమీటర్ల వరకూ స్వేచ్ఛగా సంచరించేందుకు ఉద్దేశించిన 'ఫ్రీ మూవ్‌మెంట్ రెజీమ్'కు ముగింపు పలకబోతున్నట్టు హోంమంత్రి అమిత్‌షా నాలుగురోజుల క్రితం ప్రకటించారు. మయన్మార్ నుంచి తిరుగుబాటుదారులు చొరబడుతున్నారని, ఆయుధాలు, మాదకద్రవ్యాలు తరలివస్తున్నాయన్న బీరేన్‌సింగ్ ప్రభుత్వం ఆరోపణల నేపథ్యంలో, 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో భాగంగా నాలుగేళ్ళక్రితం తమ ప్రభుత్వమే ప్రవేశపెట్టిన విధానాన్ని అమిత్ షా రద్దుచేయ సంకల్పించారు. ప్రత్యేక అనుమతి అవసరం లేకుండా ఒకరోజు పాటు సరిహద్దులుదాటివచ్చేందుకు, అనుమతిపత్రాలతో డెబ్బయ్‌రెండుగంటలపాటు ఉండేందుకు ఉద్దేశించిన ఈ విధానం ఒకే జాతిమూలాలు పంచుకుంటున్న కుకీ–జోలకు ప్రధానంగా ఉపకరిస్తున్న విషయం తెలిసిందే. కంచె నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను మిజోరామ్ పాలకులు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. మయన్మార్‌లో మిలటరీ ప్రభుత్వం అక్కడి చిన్ తెగవారిని ఊచకోతకోయడం, ముపె[illegible]లమంది శరణార్థులు మిజోరామ్‌లో తలదాచుకోవడం నిజమే. ఇప్పుడు అక్కడ అంతర్యుద్ధం సందర్భంలో తిరుగుబాటుదారులతో పోరాడలేక ఆ దేశ సైనికులే మిజోరామ్ పారిపోయివస్తున్నారు తప్ప, ప్రజలు కొత్తగా పెద్ద ఎత్తున చొరబడిందేమీ లేదు. మణిపూర్ హింసకు మయన్మార్ పరిస్థితులతో ప్రత్యక్షసంబంధం లేదు. మీతీలకు ఎస్టీహోదా కట్టబెట్టేందుకు బీరేన్‌సింగ్ చేసిన ఓ కుట్రతో గత ఏడాది మేనెలలో రేగిన చిచ్చు, ఆయన మీతీ పక్షపాతవైఖరితో మరింత తీవ్రమైంది. కుకీలను కొండలనుంచి కూడా వెళ్ళగొట్టేందుకు, మట్టుబెట్టేందుకు మీతీలు విశేష కృషి చేస్తున్న తరుణంలో ఇప్పుడు సరిహద్దు ప్రజల మధ్య ఉన్న చారిత్రక సంబంధాలను తెంపివేసి, మధ్యలో గోడకట్టాలన్న నిర్ణయించడం మరింత ప్రమాదకరమైన పరిస్థితులను సృష్టి-

ఆర్తనాదాలు, అరెస్టులు, న్యాయస్థానాలు..!

పాలనలో కొత్త మార్పులకు, ప్రజారంజక విధానాలకు ఐదేళ్ళ కాలం చాలా ఎక్కువ. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ళ పరిపాలనా కాలాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారు. రాజధాని లేకుండా విభజింపబడిన అవశేష ఆంధ్రప్రదేశ్‌లో రైతుల భాగస్వామ్యంతో రాజధాని అమరావతి గూడును గత ప్రభుత్వం నిర్మిస్తే, జగన్ దానిని కూల్చేశారు. 2019 డిసెంబర్ 17న రాష్ట్రం ఉలిక్కిపడేలా ఆయన మూడు రాజధానుల మూర్ఖపు ప్రకటన చేశారు. దీంతో రాజధాని కోసం మాత్రమే భూములు ఇచ్చిన రైతులు ఒక్కసారిగా హతాశులయ్యారు. చేసేది లేక వారం తరువాత సమిష్టిగా డిసెంబర్ 25న భూములిచ్చిన రైతులకు చెందిన 29 గ్రామాల్లో ఆకుపచ్చని కండువాలు ధరించి దీక్షా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ దీక్షల పరంపర కొనసాగి ఈ ఏడాది జనవరి 25కి సరిగ్గా 1500 రోజులు. అంటే మొత్తం ఈ ప్రభుత్వ 1825 రోజుల పాలనా పనిదినాల్లో 1500 ఉద్యమ రోజులను మినహాయిస్తే, రైతులు కడుపునిండా తిండి, కంటినిండా నిద్రకు నోచుకున్నది కేవలం 300 రోజులు మాత్రమే. ఇందులో రాబోయే 60 రోజులు మినహాయింపు. ఇలా నాలుగేళ్ళు పైబడి రాజధాని ప్రాంతం అంతటా కన్నీళ్ళు, కడగండ్లు, నినాదాలు, ఆర్తనాదాలు. కేసులు, అరెస్టులు, న్యాయస్థానాలు, పాదయాత్రలు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఆయా సందర్భాలలో సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేస్తారు. అవి వారి హక్కులు. ప్రభుత్వాలు వారితో చర్చలు జరిపి పరిష్కారాల సాధ్యాసాధ్యాలను ఆలోచన చేసి ఆందోళనలను విరమింపచేయటం వాటి కర్తవ్యం. ప్రజాస్వామిక ధర్మం. కానీ జగన్ అలాంటి ఆలోచన చేయనే లేదు. ఏదో పంతం పట్టినట్లు, కక్ష కట్టినట్లు రాజధాని ఉద్యమ శిబిరాల పట్ల వ్యవహరించారు. రాజధాని రైతులతో కానీ, ఉద్యమిస్తున్న నాయకులతో కానీ చర్చల అంశాన్ని తెరపైకి తేలేదు. ఎవరినీ పంపలేదు. అలాంటి ప్రయత్నం కూడా చేయలేదు. ఆయన పంపింది కేవలం పోలీసులను మాత్రమే. బాధ్యత పెట్టింది వారిపైనే. ఏం చేస్తారో, ఎలా చేస్తారో, ఎంతకు తెగిస్తారో నాకు తెలియదు. రాజధాని ప్రాంతంలో రైతులు దీక్షలు చేపట్టకూడదు అన్న ధోరణిలో నియంతలా మౌఖిక ఆదేశాలను జారీ చేశారు. దీంతో పోలీసులు ఏదో దేశ సరిహద్దు ప్రాంతంలోనో, కల్లోలిత ప్రాంతాల్లోనో, అల్లర్లలోనో కవాతు నిర్వహించినట్లు, పచ్చని పల్లెసీమల్లో బల ప్రదర్శన నిర్వహించారు. ఇళ్ళల్లోంచి ఎవ్వరూ శిబిరాల్లోకి వెళ్ళకూడదంటూ శాసించారు. భయపెట్టారు. ఆందోళనలకు గురి చేశారు. కానీ, పీడన ప్రతిఘటనకు దారితీస్తుందన్నట్లు ఉద్యమం సెగలు కక్కిందే తప్ప ఆగలేదు. పైగా స్వాతంత్ర్యం కోసం పోరాడినట్లుగా రాష్ట్ర రాజధాని అమరావతి కోసం మూడు ప్రాంతాల్లోని ఆలోచనాపరులు, మేధావులు, సంఘాలు, రాజకీయ పార్టీలు రైతు ఉద్యమానికి మద్దతు పలికాయి.

ఇంతింతై అన్నట్టుగా అమరావతి ఉద్యమం తెలుగు నేల చరిత్రపుటల్లో సువర్ణ లిఖిత అధ్యాయంగా నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తుగ్లక్‌లా ప్రజా బోనులో నిలబెట్టింది. ఈ ఉద్యమ నేపథ్యంలో వందల మందిపై కేసులు పెట్టారు. 290 మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మరణించారు. ఒక ప్రభుత్వం శాసనాల ద్వారా, చట్టాల ద్వారా రాజధాని నిర్మిస్తే, మరో ప్రభుత్వం ఆ శాసనాలను, చట్టాలను కాలదంతే, ఆ చట్టాలకు అర్థం ఏమిటి? ప్రభుత్వాల పనితీరుకు మనుగడ ఏదీ? అనే ప్రశ్నలు న్యాయస్థానాల ముందుకొచ్చాయి. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వికృత పరిణామాలు జరిగితే, ప్రజలు ఎవరిని నమ్మాలి? ఎందుకు నమ్మాలి? వ్యవస్థలు ఏం చేస్తున్నాయి? అన్నవి అందరి ప్రశ్నలు. 'నిజాలను, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకపోతే, ఆ నిజాలు, వాస్తవాలే ప్రతీకారం తీర్చుకుంటాయి' అన్న విభజన నాటి శ్రీకృష్ణ కమిటీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి కూడా. అభివృద్ధిని రాజకీయాలలోకి లాగిన, రాజకీయాలను అభివృద్ధిగా చూపిన ఫలితం వెనుకబాటుతనమే. అలాంటి విధానాలను, విపరీత ధోరణులను ఆహ్వానించినా మనుగడ కష్టమే.

– పోతుల బాలకోటయ్య, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

1500



అనంతారం కొండా!
అటు నువ్వు -ఇటు మేము
మధ్యలో ఒక మహా మాయ

నిన్ను జూస్తూ నీ నీడలో పెరిగిన రైతులం
కూలీలం, పలు వృత్తుల పొట్టకూటి వాళ్ళం
367 మెట్లెక్కుతూ మెట్టుమెట్టుకీ నీ పైన కొలువైన దైవాన్నీ
ఆపైన పంట దేవతల్నీ తలుచుకున్నాం
విత్తనాలూ వెద గొర్రులో పలుగూ పారలో
వానో వరదో కరువో కాటకమో
ఆరుగాలం నెత్తిపై మిత్తిలా కూకున్న అప్పులో సప్పులో
అట్లా అట్లా కాలం గడిచిపోయింది

అనంతారం కొండా!
పైన ఆకాశం అట్లాగే ఉంది/ కాళ్ళకింద నేలే కదిలిపోయింది
అపరంజి కలల్లో కన్నీరు జారింది/ నేల జారింది, మా గుండె జారింది
నమ్ముకున్న సింహాసనం మా సమర్పణకి కృతజ్ఞతగా
అన్నం పళ్ళెంలో పురుగు మందు కలిపి ఋణం తీర్చుకుంది
ఇదంతా పిచ్చి తుమ్మల చిట్టడవి, కాకపోతే శ్మశానం అంది
నువ్వు చెప్పు, చెప్పు నా తల్లీ! చెప్పు/ ఎవరు మృగాలు? ఏవి పిశాచాలు?
బాలెంతల రొమ్ముల మీద బూటుకాళ్ళ ముద్రలు పడలేదా
అక్క చెల్లెళ్ళ చీరలు లాగి గాల్లో ఆరెయ్యలేదా
ప్రశ్నించిన శిరస్సుల మీద రాక్షస సెక్షనులన్నీ గుమ్మరించలేదా
పదాల్నీ పాదాల్నీ పదిమంది కలయికల్నీ నిషేధించలేదా
ఎన్ని నిద్ర పట్టని కాళరాత్రులు?/ ఎన్నెన్ని ఆగిపోయిన గుండెలు?
ఇనప గిట్టల హింసాసనం హాయిగా నిద్రించింది
సహజ న్యాయసూత్రాలు మౌనవ్రతం పాటించాయి
మేధావులూ మట్టిగడ్డలూ సరసమైన ధరకి అమ్ముడు పోతూ
ఏకైక సత్యానికి వక్ర భాష్యాలు చెప్పారు
కానీ నువ్వు దుఃఖించావు, ఆపైన మమ్మల్ని ఓదార్చావు
నీకు తెలుసు/ చరిత్రలో ఈ అంకె నిలిచిపోతుంది
చరిత్రహీనులం కాదు, మేం చరిత్ర నిర్మాతలం
ఏదో ఒకరోజు మా నేల, కాదు కాదు, మన ఈ నేల కల ఫలిస్తుంది

అనంతారం కొండా!
అటు నువ్వు — ఇటు మేము
ఇక్కడ ఆరని ఆగ్రహ, సత్యాగ్రహ జ్వాల

–డాక్టర్ పాపినేని శివశంకర్ (కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత)

(1500 రోజుకు చేరిన అమరావతి రైతుల ఉద్యమంలో ఒక రైతు బిడ్డగా)

ఆలయం వెలిసింది, ఆ తరువాత ఏమిటి?



న్యాయం గెలుస్తుందన్నది నిజమే కావచ్చు కానీ, గెలిచేదంతా న్యాయం కాదు అన్నాడొక పెద్దమనిషి. ఎట్లా గెలిచినప్పటికీ, న్యాయంగానే గెలిచానని విజేతలు చెప్పుకుంటారు. కథలూ కావ్యాలూ పురాణాలూ రాసుకుంటారు, రాయిస్తారు. గెలిచినవాళ్లు మంచి జోరు మీద ఉంటారు కాబట్టి, వాళ్లు చెప్పేది నిజమే అని చేతులు కట్టుకుని అందరూ బుద్ధిగా నమ్ముతారు. చరిత్రలన్నీ గెలిచినవాళ్లు రాసినవే అంటారు అందుకే.

విజేతల వేడుకలు రంగ రంగ వైభవంగా, మహా ఆర్భాటంగా ఉంటాయి. గెలుపును ఢంకా బజాయించి చాటడమే తప్ప అందులో మరో శబ్దానికి ఆస్కారం ఉండదు. ఆ మిరుమిట్లు చూస్తున్నప్పుడు తక్కినదేదీ కళ్లకు కనిపించదు. ఆ బలప్రదర్శన దెబ్బకు అన్ని సందేహాలను పరిత్యజించి ఇక అధికార సత్యానికే మనసు విధేయం అయిపోవాలి. యుద్ధకాలంలోనూ, యుద్ధానంతర సత్యస్థాపనలోనూ దృశ్యశ్రవణపఠన మీడియా అవసరం అందుకే.

పైన రాసిన నాలుగు వాక్యాలకీ, సోమవారం నాడు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకీ ఏ సంబంధమూ లేదు. కానీ, ఆ వైభవోజ్జ్వల సన్నివేశం చూస్తున్నప్పుడు, చూసిన తరువాత నయము, భయము, విస్మయము మాత్రమే కాదు, తాత్విక భావావేశాలెన్నో ముంచుకువచ్చాయి. ఒక పవిత్ర ఆధ్యాత్మిక క్రతువు ముఖచిత్రం వెనుక లౌకిక, భౌతిక పరమార్థాలేవో ముసురుకున్న స్ఫురణ భయం పుట్టించింది. అంతటి దిగ్భ్రమలోనూ రాముడి మీద ప్రేమతోనే కొన్ని సంశయాలు కలిగాయి. రాముడు నిజంగానే తన గూటికి తిరిగి చేరాడా? ఆ గూడు ఎవరి గుప్పిట్లో అయినా ఉన్నదా? అందులో ఆయన స్వేచ్ఛగా ఉన్నాడా? ఇటువంటి జాబాలి ప్రశ్నలను అపచారం అనుకోకుండా వశిష్ఠుడు అనుమతిస్తాడా?

దేశంలోని ముఖ్యులందరూ అక్కడ ఉన్నారని కాదు కానీ, ఉన్న ఏడు వేల మంది ప్రత్యేక ఆహ్వానితులు మన సమాజంలోని మీగడతరకల శ్రేణి వారే. రకరకాల రంగాల సెలబ్రిటీలే. విశ్వపీఠాలు స్థాపించి భారత ఆధ్యాత్మికతకు ప్రతినిధులైనవారు, త్రిదండిలు ధరించి మంచిచెడ్డలూ హెచ్చుతగ్గులూ నిర్వచించేవారు, శిష్యకోటిని ఆమడదూరాన నిలబెట్టి ఆశీర్వదించేవారు, సమస్త రాజకీయశ్రేణులను తమ పాదస్పర్శతో ధన్యులను చేసేవారు ముఖ్యక్రతువు వేదికకు వెలుపల కూర్చుండిపోయారు. మహానటులు, నటీమణులు, అభినవ కుబేరులు, క్రీడాకారులు, గాయకులు, కవులు అతికొద్దిమంది విశిష్టులలో తాము ఒకరమైనందుకు గర్విస్తూ ఆసీనులయ్యారు. భారత ప్రధానమంత్రి, హిందూత్వ పరివారానికి ప్రధాన సంఘచాలకుడు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ గర్భగుడిలో బాలరాముడికి ప్రాణప్రతిష్ఠ చేసి ఆవిష్కరించారు. ఒకనాడు, మతపెద్దలకు రాజకీయవాదులు శిష్యపరమాణువులుగా ఉండేవారు, ప్రభుత్వ కార్యక్రమాలలో మత తంతులు జరిపించేవారు. రాజకీయాలలో మతప్రమేయం ఏమిటని అభ్యుదయ ప్రాశ్నికులు నిలదీసేవారు. ఇప్పుడు, మతరంగాన్ని రాజకీయవాదులు ఆక్రమించారు. రెండు రంగాలకు మధ్య దూరం చెరిగిపోవడం కాదు, రాజకీయరంగమే మతాధిపత్యస్థానాన్ని తీసుకుంటున్నది. దేవుడికి భక్తుడికి నడుమ ఒకనాడు పూజారి అడ్డం అనుకునేవారు. ఇప్పుడు దేవుడికి పూజారికి మధ్య, దేవుడికి పౌరుడికి నడుమ రాజకీయవాది సర్వశక్తిశాలిగా నిలబడ్డాడు.

ఎందువలన అనగా, రాముడు ఇప్పుడు కేవలం ఆధ్యాత్మిక, దివ్య చిహ్నం మాత్రమే కాదు. జాతీయతావాద ప్రతీక. ఐక్యతకు గుర్తు. రామనామం మహారాజ్యశక్తికి వాహిక. నరేంద్రమోదీ తలపెట్టిన నూతన భారత నిర్మాణానికి అవసరమైన సామాజిక అంతశ్చేతన రాముడు. దేవుడిని రాజకీయవాది స్వాధీనం చేసుకోవడమే కాదు, దేవుడికి రాజకీయ పరమార్థం, కర్తవ్యం కూడా సంక్రమింపజేశారు. దేవుడే రాజకీయవాది అంటే అపచారం అవుతుందేమో కానీ, దేవుడి రాజకీయకర్తవ్యాలను దైవప్రతినిధిగా పాలకుడు నిర్వర్తిస్తారు. విష్ణువు కాని వాడు రాజు కాజాలడు అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. మరీ రాజుకు, దైవానికి నడుమ అద్వైతం ప్రతిపాదించలేము కానీ, అభేదాన్ని అన్వయించగలిగే ప్రతిపత్తిని ఇవ్వగలము. కలియుగంలో దైవం అర్చావతారంలో శిలగా మాత్రమే ఉంటాడు కాబట్టి, మాట్లాడలేడు. ఆ మౌనాన్ని రాజకీయవాది అవకాశంగా తీసుకుని, తన మాటలనే దేవుడి నోట పెడతాడేమో అనిపిస్తుంది.

> ఉత్సవం జరిగిపోయింది. ఒక సుదీర్ఘ పోరాటం, నిరీక్షణ, ఆకాంక్ష అనుకున్నవన్నీ నెరవేరాయి. తరువాత ఏమిటి? జాతినిర్మాణం అన్నారు భాగవత్. మోదీ కూడా అదే అన్నారు. అభివృద్ధికి కావలసిన ఐక్యత ఈ విజయం నుంచి వచ్చిందన్నారిద్దరూ. భారతదేశ సమాజానికి, రాజకీయవ్యవస్థకు వారు ఇవ్వదలచుకున్న రూపానికి రాముడు ఒక సాధనమవుతున్నాడా? రాముడి రూపంలో నవ భారతదేశానికి ఒక చిహ్నం దొరికిందా? దేశ ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలను పరిష్కరించే రామరాజ్యం వస్తుందా? చారిత్రక న్యాయం, ఆధ్యాత్మిక పారవశ్యం సరే, అధిక ధరలు, నిరుద్యోగం, హక్కుల హననం, తిరోగామి అజ్ఞానం ఇవన్నీ సమసిపోతాయా? రైతాంగం బతికి బట్టకడుతుందా? అన్నమో రామచంద్రా అనే ఆర్తనాదాలు వినిపించకుండా పోతాయా? భారతదేశంలో మూలమూలన ప్రజల జ్ఞాపకాలలో, కథల్లో, పాటల్లో ఉన్న రాముడిని కొత్తగా నిర్వచించే ఈ ప్రయత్నం, భారతీయులకు కొత్త అవకాశాలను అందిస్తుందా?

కొంతకాలంగా నిరీక్షిస్తున్న ఉత్సవం కాబట్టి, అక్కడ ఉండిన, దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ టీవీలలో వీక్షించిన భక్తులు ఒక పారవశ్యానికి లోను కావడం సహజం. వారి మనసులో అయోధ్య ఆలయానికి సంబంధించిన నేపథ్యవివాదాలేవీ లేకపోవచ్చు, కొత్త తరానికి ఆ వివరాలే తెలియకపోయి ఉండవచ్చు. వారందరికీ ఆలయనిర్మాణం, ప్రాణప్రతిష్ఠ ఒక ప్రక్రియ తరువాత సమకూరిన విజయంగా, సహజ న్యాయం అందడంగా కనిపించి ఉండవచ్చు. లేదా, గతంలో సమస్యలు ఉన్నప్పటికీ, నిర్మాణం, ప్రతిష్ఠ జరిగాక ఇక వాటికి ప్రాధాన్యం లేదన్న భావన ఉండవచ్చు. ఆ సందర్భంలో సందేశాలు ఇచ్చిన నాయకులు, సామాజిక నేతలు అందరూ, చరిత్రలో జరిగిన ఒక అన్యాయానికి దిద్దుబాటుగా ఆలయనిర్మాణాన్ని చెప్పారు. సుప్రీంకోర్టే తమ విశ్వాసాన్ని ధ్రువపరచిందని మాట్లాడారు. నిజానికి వివాదాన్ని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు తీసుకున్న ప్రాతిపదికలు వేరు. కానీ, అక్కడి సంరంభంలో విజేత వాదం చరిత్రగా స్థిరపడింది. ఇంతకాలం ఒక నమ్మకంగా ఉన్న అంశాన్ని మీడియా కూడా ఈ సందర్భంలో ఒక సత్యంగా కథనీకరించింది. ఆరఎసఎస్ అధినేత మోహన్ భాగవత్ ఈ మధ్య రాసిన ఒక వ్యాసంలోని ఈ వాక్యాలు ఆసక్తికరమైవి. "సత్య న్యాయాల ఉమ్మడి విజయం చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తుంది. కొత్త కథలను సృష్టిస్తుంది. సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుంది." ఒకనాటి చేదుజ్ఞాపకాలను చెరిపివేసే ప్రయత్నం కూడా కొత్తగా కొన్ని చేదుజ్ఞాపకాలను సృష్టించిందని మరచిపోగలమా? అత్యంత క్రూరమైన గత వర్తమానాలను విస్మృతిలోకి విసిరేయగలిగేంత మానవీయమైన, మృదువైన, గౌరవప్రదమైన భవిష్యత్తును మనం నిర్మించుకోగలమా?

పాత వాద వివాదాలను తిరిగి ముందుకు తేవడానికి పరాజిత పక్షం కూడా ఈసారి ఆసక్తి చూపలేదు. మొత్తంగా వివాద పర్యవసానమే వారిని కుంగదీసింది, జరిగేదాన్ని వారు మౌనంగా చూస్తూ ఉండిపోయారు. ప్రతిపక్షం లేకపోవడంతో రామాలయ నిర్మాణ సంరంభంలో సానుకూల అంశాలే వినిపించాయి తప్ప, ఏ ప్రజాశ్రేణినీ కొత్తగా, ప్రత్యేకంగా నొప్పించే విషయాల ప్రస్తావనలకు పెద్దగా ఆస్కారం లేకపోయింది. జాతీయ ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఈ కార్యక్రమానికి చెప్పిన అభ్యంతరం కూడా రాజకీయవివాదాన్ని తీవ్రం చేయడానికి అనుకూలమైంది కాకపోయింది. రామాలయాన్ని వ్యతిరేకించడం కాక, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగే తీరును కాంగ్రెస్ తప్పు పట్టింది. బీజేపీ ఆధ్వర్యంలో జరిగే రాజకీయ కార్యక్రమం అని విమర్శించింది.

రామజన్మభూమి ఉద్యమం సాంస్కృతిక, జాతీయతావాద ఉద్యమం అని దాన్ని నిర్వహించిన సంస్థలు చెప్పాయి. ఆ సంస్థలలో భారతీయ జనతాపార్టీ కూడా ఉన్నది. ఆలయ ఆకాంక్ష నెరవేరే సమయానికి ఆ పార్టీయే అధికారంలో ఉన్నది. కానీ, తక్కిన సంస్థలు తాము మొత్తం హిందువులకు సామాజిక, సాంస్కృతిక ప్రాతినిధ్యం వహిస్తామని చెప్పుకుంటాయి. కార్యక్రమాన్ని మతపెద్దలు, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించి, అన్ని రాజకీయ పార్టీలనూ సమానగౌరవంతో ఆహ్వానించి ఉండవలసింది. ప్రభుత్వ కార్యక్రమం అనిపించేంతగా, ప్రభుత్వ వ్యవస్థలు ఇందులో కల్పించుకోకుండా ఉండవలసింది. నరేంద్రమోదీ ప్రధానిగా ఉండడం వల్లనే ఆలయ నిర్మాణం సాధ్యమైంది అన్నది భావన మాత్రమే కానీ, పూర్తి సత్యం కాదు. అంతిమ తీర్పు ఇచ్చినది అత్యున్నత న్యాయస్థానం. నిర్మించింది ట్రస్టు. వెచ్చించింది ప్రభుత్వ ధనం కాదు. మరి ఇందులో మోదీ ఘనత ఏమున్నది? బీజేపీ కృషి ఉంటే, అది అద్వానీ, జోషి వంటి వారి ద్వారా జరిగింది. మోదీ వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడానికి, ఈ



▪ కె. శ్రీనివాస్

సందర్భం

> ఆలయ నిర్మాణం సాధ్యమైంది అన్నది భావన మాత్రమే కానీ, పూర్తి సత్యం కాదు. అంతిమ తీర్పు ఇచ్చినది అత్యున్నత న్యాయస్థానం. నిర్మించింది ట్రస్టు. వెచ్చించింది ప్రభుత్వ ధనం కాదు. మరి ఇందులో మోదీ ఘనత ఏమున్నది? బీజేపీ కృషి ఉంటే, అది అద్వానీ, జోషి వంటి వారి ద్వారా జరిగింది. ఆలయం పూర్తి కావడానికి ఇంకా ఏడాదికి పైగా పట్టే అవకాశం ఉండగా, ఇప్పుడే ఈ ప్రాణప్రతిష్ఠ ఎందుకు? అద్వానీ లేకుండా ప్రధాని మాత్రమే గర్భగుడిలో ఎందుకు?

ఏడాది ఎన్నికలలో ఈ అంశాన్ని ఉపయోగించుకుంటారని రామభక్తులు, మోదీ అభిమానులు కూడా అంగీకరిస్తారు. లేకపోతే, ఆలయం పూర్తి కావడానికి ఇంకా ఏడాదికి పైగా పట్టే అవకాశం ఉండగా, ఇప్పుడే ఈ ప్రాణ ప్రతిష్ఠ ఎందుకు? అద్వానీ లేకుండా ప్రధాని మాత్రమే గర్భగుడిలో ఎందుకు?

ఉత్సవం జరిగిపోయింది. ఒక సుదీర్ఘ పోరాటం, నిరీక్షణ, ఆకాంక్ష అనుకున్నవన్నీ నెరవేరాయి. తరువాత ఏమిటి? జాతినిర్మాణం అన్నారు భాగవత్. మోదీ కూడా అదే అన్నారు. అభివృద్ధికి కావలసిన ఐక్యత ఈ విజయం నుంచి వచ్చిందన్నారిద్దరూ. భారతదేశ సమాజానికి, రాజకీయవ్యవస్థకు వారు ఇవ్వదలచుకున్న రూపానికి రాముడు ఒక సాధనమవుతున్నాడా? రాముడి రూపంలో నవ భారతదేశానికి ఒక చిహ్నం దొరికిందా? దేశ ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలను పరిష్కరించే రామరాజ్యం వస్తుందా? చారిత్రక న్యాయం, ఆధ్యాత్మిక పారవశ్యం సరే, అధిక ధరలు, నిరుద్యోగం, హక్కుల హననం, తిరోగామి అజ్ఞానం ఇవన్నీ సమసిపోతాయా? రైతాంగం బతికి బట్టకడుతుందా? అన్నమో రామచంద్రా అనే ఆర్తనాదాలు వినిపించకుండా పోతాయా? భారతదేశంలో మూలమూలన ప్రజల జ్ఞాపకాలలో, కథల్లో, పాటల్లో ఉన్న రాముడిని కొత్తగా నిర్వచించే ఈ ప్రయత్నం, భారతీయులకు కొత్త అవకాశాలను అందిస్తుందా?

ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేర్చేవే ఎన్నికలు

భారత ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవం (జనవరి 25)ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకొంటున్నాం. 2011 నుంచి ఈ ఆచారం మొదలయ్యింది. ఓటర్లుగా తమ హక్కులు, బాధ్యతల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఎంత ప్రయత్నించినా పోలయిన ఓట్ల సంఖ్య సగటున 60–65 శాతం మధ్యే ఉంటోందంటే, 40 శాతం మంది ప్రజలకు ఎన్నికల పట్ల ఆసక్తి లేదని అర్థం. గ్రామాంతర నివాసం లాంటి ఇతర కారణాలు కొన్ని ఉన్నప్పటికీ నిరాసక్తతకి ఎన్నికల కమిషనే బాధ్యత వహించాల్సి ఉంది. ప్రజల్లో ఎన్నికల నిర్వహణ పట్ల మరింత నమ్మకం కలిగించటం చాలా అవసరం. ఎన్నికల కమిషనర్ నియామకాల వెనుక అధికారంలో ఉన్న పార్టీల ప్రయోజనాలు ముఖ్యసూత్రాలుగా బయటకే కనిపించటం ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అవుతుంది. కొత్తగా నమోదైన ఓటర్లలో 18 ఏళ్ల దాటినవారి సంఖ్య చాలా తక్కువగా ఉండటం రేపటి 'యువ భారత్'కు యువత సన్నద్ధంగా లేదని అర్థం.



ప్రజల కోసం మాత్రమే ఎన్నికల కమిషన్ పనిచేస్తుందన్న నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత ఆ సంస్థదే! ఎన్నికల కమిషన్ అనగానే ఈ దేశంలో టీఎన్ శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న రోజులు ఎవరికైనా గుర్తుకొస్తాయి. ఎన్నికల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘిస్తే ఎలాంటి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో ఆ సమయంలో అందరికీ తెలిసొచ్చింది. ఎవరికీ తలవంచని ధీరతని ఎన్నికల కమిషన్ నుంచి ప్రతి ఒక్కరూ ఆశించటం తప్పుకాదు!

తమ ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకునే ప్రక్రియలో పాలుపంచుకునే హక్కు ప్రజలందరికీ ఉంది. ప్రజలకున్న ఈ హక్కుని ఎన్నికల అధికారులు కాపాడాలి. ఎన్నికల్లో డబ్బు పాత్ర తన పరిధిలోని అంశం కాదని ఎన్నికల కమిషన్ తప్పించుకోలేదు. గెలుపు కోసం కోట్లు ఖర్చు చేసే వ్యక్తి అంతకంత రాబట్టుకోవాలనుకుంటే, అది ప్రజాస్వామానికే చేటు తెస్తుంది! భారతదేశంలో గడచిన పదేళ్ళ కాలంలో ప్రజాస్వామ్యం 50 శాతానికి పడిపోయిందని సర్వే సంస్థలు చెప్తున్నాయి. ఇందుకు ఎన్నికల సంస్థతోపాటు ప్రజలు కూడా సమాన బాధ్యులే!

గారడీ చేసి సృష్టించే మామిడి మొక్క లాంటిది ప్రజాస్వామ్యం. మామిడి మొక్క నిజం. కానీ, జనం అది తన సృష్టి అనుకోవాలని గారడీ చేసేవాడు భావిస్తాడు. గారడీ వినోద సాధనం అయినట్టే, ప్రజాస్వామ్యం కూడా వినోదం కాకూడదు. ప్రజాస్వామ్యం కేవలం ప్రభువులకే పరిమితం అయితే ఎన్నికల యంత్రాంగం అంతా పెద్ద బూటకమే అవుతుంది.

'మా ఓట్లు మేమే వేసుకుంటాం' అనేది ఆధునిక రాజనీతి. మీకెక్కడివి ఓట్లంటే, ఒకప్పుడు కొనుక్కొంటాం అనేవాళ్లు. ఇప్పుడు మేమే ఓట్లను సృష్టిస్తాం, జనంతో మాకు పని లేదంటున్నారు. ఒక కలెక్టరు తన అధికార పరిధిలోని ప్రభుత్వ రహస్యాన్ని మాఫియాలకు అప్పగిస్తే, వాళ్ల అనేక వేల ఓట్లను తారుమారు చేస్తే, ఆ అధికారికి సస్పెన్షన్ విధించారు. కానీ ఆ ఎన్నికల్ని రద్దు చెయ్యలేదు. ఓటర్ల పట్టికలోంచి ఒకరి ఓటుని తొలగించటం అంటే అతని పౌరసత్వాన్ని రద్దు చేయటంతో సమానం. అంతటి హననానికి పాల్పడ్డవారి మీద ఎలాంటి చర్యలూ లేవు. ఎన్నికల పట్ల నిరాసక్తతకు ఇలాంటి కారణాలు చాలా ఉన్నాయి. స్వేచ్ఛగా భావ ప్రకటన చేయడానికి హామీతో కూడిన హక్కులు లేని ప్రజాస్వామ్యం బూటకమే! రాజకీయ పార్టీలేవీ ఈ రోజు ప్రజల భావప్రకటనా స్వేచ్ఛని కాపాడతామని, ఈ స్వేచ్ఛని హరించే చట్టాలను రద్దు చేస్తామని, ఇలాంటివి మళ్ళీ చేయబోమని హామీ ఇవ్వటం లేదు.

అధికారంలోకి వచ్చిన వ్యక్తి ముందు వరుసలో నిలిచే సైనికుల్ని నడిపించే సేనాధిపతి లాంటివాడు. ఆయన ప్రజాబలగంతో 'మీరు అలా చూస్తూ ఉండండి, యుద్ధం నేను చేస్తాను, నేనే మిమ్మల్ని గెలిపిస్తాను' అంటున్నాడు. దాంతో ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజల ఊసు, ఉనికి లేకుండా పోయాయి. దీన్ని ప్రజల నైతిక పతనస్థితిగా భావించకూడదు. పాలనావ్యవస్థ, న్యాయవ్యవస్థ, ప్రజావ్యవస్థ ఈ మూడింటిపైనా విశ్వాసం ఇంకా అంతరించలేదు. హేమాహేమీలే ఎన్నికల్లో ఓడారంటే సామాన్యుడు తన ఆయుధాన్ని పారేయలేదని అర్థం. పాలనలో విశిష్టత ముఖ్యం. నోటిదురుసునో, చేతిదురుసునో చూసి మెచ్చి ప్రజలు ఓట్లు వేస్తారంటే ఆశ్చర్యమే! మా ఓట్లు మేమే వేసుకుంటాం అనే ధైర్యమే ఈ 'దురుసు'లకు కారణం. ఎన్నికల కమిషన్ శ్రద్ధ పెట్టవలసింది ఇక్కడే!

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చేదెవరో ఎంచుకుని ఓటు వేసే తెలివి, కలిమి, బలిమి తమకున్నాయని ఎలుగెత్తి చాటాలని ఓటర్ల దినోత్సవం నాడు ప్రజలే ఒక నిర్ణయం తీసుకోవాలి. నియంతృత్వపు పెను తుఫాను ధాటికి రెపరెపలాడుతున్న ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవలసిన సమయం ఆసన్నమైంది!

▪ **మండలి బుద్ధప్రసాద్**
పూర్వ ఉపసభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ

రాజధాని ఉద్యమం... ధీరత్వానికి నిదర్శనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రాజధాని అమరావతి విధ్వంసానికి శ్రీకారం చుట్టి జనవరి 25 నాటికి 1500 రోజులు పూర్తవుతుంది. రాష్ట్ర భవిష్యత్ కోసం నిర్మించ తలపెట్టిన అమరావతిని పూర్తి చేయలేని పాలకులు మూడు రాజధానులంటూ రాష్ట్రం పరువు తీశారు. ఏపీకి రాజధాని ఏది? అనే ప్రశ్నకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. నాలుగున్నరేళ్లలో ఉద్యమాన్ని అణగదొక్కేందుకు, రైతుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం చేయని అరాచకాలు లేవు. అమరావతి ఉద్యమాన్ని అణిచివేసేందుకు వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి ప్రయత్నం చేస్తూనే ఉంది. దానిలో భాగంగానే 144 సెక్షన్, పోలీసు చట్టంలో సెక్షన్ 30 వంటివి ప్రయోగించి గ్రామాల్నీ తన గుప్పిట్లో పెట్టుకుంది. పోరాటంలో భాగంగా రైతులు పాదయాత్ర చేపడితే ఏపీ ప్రభుత్వం దానిని విధ్వంసం చేసేందుకు యత్నించింది. పోలీసుల లాఠీదెబ్బల్నీ, హింసాకాండను తట్టుకుని, మహిళలు, రైతులు ముందు వరుసలో ఉండి అమరావతి ఉద్యమాన్ని నడిపించడం వారి ధీరత్వానికి నిదర్శనం. న్యాయ దేవతని నమ్ముకున్న రైతులు హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్ళి వరుస విజయాలు సాధిస్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కనువిప్పు కలగడం లేదు.



నాలుగేళ్ల క్రితం శాసనసభలో జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. దక్షిణాఫ్రికాకు మూడు రాజధానులు ఉన్నప్పుడు ఏపీకి ఉంటే తప్పేంటనే వితండవాదాన్ని తెరపైకి తీసుకొచ్చి ప్రజల్ని మోసం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో అమరావతికి మద్దతు తెలిపి తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి, మడమ తిప్పారు. రాజధానిలో టీడీపీ నాయకులు ఇన్‌సైడ్ ట్రేడింగ్ పేరుతో లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ తప్పుడు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు అయిదేళ్లయినా ఒక్క రూపాయి అవినీతిని నిరూపించలేకపోయారు. అమరావతిలో ఇన్‌సైడింగ్ ట్రేడింగ్ జరగలేదని హైకోర్టు తెలిపినా, అధికారపక్షం నాయకులు కావాలనే అబద్ధపు ప్రచారం చేశారు. మన రాష్ట్రానికి విభజన చట్టం ద్వారా ఒకే రాజధాని ఏర్పాటుకు అవకాశం ఉందని హైకోర్టు చారిత్రాత్మకమైన తీర్పుని కూడా ఇచ్చింది.

సిఆర్‌డిఏ చట్టం ప్రకారం గత రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రైతులతో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం రాజధానిలో ఏ మార్పు చేయాలన్నా మూడింతలు పరిహారం చెల్లించాలి. ఇది సాధ్యమా? రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా ఎటువంటి చర్యలూ లేవు. ఆర్–5 జోన్‌లోని స్థలాలు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలు నెలకొల్పేందుకు కేటాయించారు. అవి వస్తే రాష్ట్రంలోని యువతకు సుమారు 3.80 లక్షల ఉద్యోగాలు వస్తాయి. కానీ యువత నోట్లో మట్టికొట్టే విధంగా, పరిశ్రమలు రాకుండా చేసేందుకు పరిశ్రమలకు అనుకూలమైన స్థలాలను పేదలకు ఇంటి పట్టా పేరుతో అక్కడ కేటాయిస్తున్నారు.


రాజధానిలోని పేదల కోసం ఆర్–3 జోన్‌లో 2,500 ఎకరాల భూముల్ని మాస్టర్ ప్లాన్‌లో కేటాయించారు. కానీ సీఎం అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ఆర్–5లో కేటాయించారు. దానికి కారణం మాస్టర్ ప్లాన్‌ను చెడగొట్టే ప్రయత్నం. రాజధాని అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది. రైతులకు సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు వస్తే.. ఈ ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు కూడా రద్దు అవుతాయి. అప్పుడు మేము మీకు స్థలాలు ఇవ్వదలచుకుంటే రైతులు అడ్డుకున్నారని లబ్ధిదారులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజధానిలో పేదలు ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. మరి, జగన్ ఇంటి పక్కన ఉన్న పేదల ఇళ్లు కూల్చి, ఎక్కడో 40 కి.మీ దూరంలో ఇళ్ల స్థలాలు ఎందుకు ఇచ్చారు?

ఎలక్ట్రానిక్ సిటీ కోసం రిజర్వు చేసిన భూమిలో జగన్మోహన్ రెడ్డి కక్షపూరితంగా పేదవారికి ఇళ్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎలక్ట్రానిక్ సిటీ కోసం కేటాయించిన భూమిలో ఎన్టీఆర్ జిల్లాకు 583.93 ఎకరాలు, గుంటూరు జిల్లాకు 550.65 ఎకరాలు... మొత్తం 1,134 ఎకరాలు కేటాయిస్తున్నట్లు జీఓలో పేర్కొన్నారు. పేదవారికి, అమరావతి రైతులకు మధ్య చిచ్చు పెట్టి ఆ మంటల్లో చలికాచుకోవాలని చూస్తున్నారు.

రాజధాని అమరావతి భూములిచ్చిన వారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. రాష్ట్రం కోసం భూమిని ఇచ్చిన పాపానికి నేడు ఏలికల చేతుల్లో వారు అవమానాలకు గురి అవుతున్నారు. త్యాగాలు చేస్తున్న రైతులను నీచ బుద్ధి గల కొందరు పెయిడ్ ఆర్టిస్టులని, బురదల్లో తిరిగే వాళ్లంటూ రైతులను అవమానాలపాలు చేసి అవహేళన చేశారు. రైతులను ఇళ్ల నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు, వచ్చిన వారిని హింసించారు. ప్రార్థనా మందిరాలు, దేవాలయాలకు వెళ్లే మహిళలను సైతం అడ్డగించి, లాఠీచార్జ్ చేయించారు. నాలుగున్నరేళ్ల ఉద్యమ క్రమంలో 2,000 మందిపై 750కి పైగా కేసులు పెట్టారు. మరోవైపు అమరావతిపై బెంగతో గడిచిన నాలుగేళ్లలో 275 మంది రైతులు చనిపోయారు. ఇవన్నీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్యలే.

రాష్ట్రానికి రాజకీయ చీడపీడలు సోకి వ్యవస్థలు గుల్లబారిపోకుండా కాచుకోవడం ప్రజాతంత్ర బాధ్యత. సామాన్య జనావళి మాత్రం ప్రస్తుత పరిణామాలను నిష్క్రియగా గమనిస్తున్నారు. ఏది ఏమైనా రాజధానిపై లక్ష్యశుద్ధి చూపకపోతే, ప్రజలు సహించే రోజులు నెమ్మనెమ్మదిగా సన్నగిల్లుతున్నాయి. 151 సీట్లు వచ్చాయని విర్రవీగుతున్న అధికారపక్షం ఒక్క అమరావతి అంశంతోనే మట్టికరుస్తుంది.

• **ఆలపాటి రాజేంద్రప్రసాద్**
మాజీ మంత్రివర్యులు



పచ్చని కుటుంబాలపై మద్యం కాటు!

కాటేస్తున్న జె-బ్రాండ్ మద్యం

గుడివాడలో వరుస మరణాలు

రాష్ట్రంలో జె-బ్రాండ్ పిచ్చ మద్యం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఈ మద్యంతో వచ్చే ధనదాహంతో ప్రభుత్వం పచ్చని కుటుంబాల్లో చిచ్చులు రేపుతోంది. ఈ మద్యానికి అలవాటు పడినవారు మానసిక రోగులుగా మారుతున్నారు. రహదారుల వెంబడి, ఎక్కడపడితే అక్కడ పడిపోయి ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా లివర్, గుండె, నరాల సంబంధిత వ్యాధులపాలై మృత్యువాత పడుతున్నారు.

- గత ఎన్నికల హామీలో మద్యపాన నిషేధం
- అధికారంలోకొచ్చాక ప్రభుత్వం ఆధ్వర్యంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు
- వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలు
- మానసిక రోగులుగా కల్తీ మద్యం బాధితులు
- గుడివాడలో బాధితులు కోకొల్లలు

గుడివాడ : సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం జాతీయ, రాష్ట్రీయ రహదారుల వెంబడి మద్యం అమ్మకాలను నిషేధించారు. రాష్ట్రంలో మాత్రం ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదు. ఈ మద్యంపై వచ్చే ఆదాయం కోసం ప్రభుత్వం ఏకంగా జాతీయ, రాష్ట్రీయ రహదారులను జిల్లా రహదారులుగా మార్చేసి విచ్చలవిడిగా అమ్మకాలకు తెరలేపింది. వేళ కాని వేళ కూడా మద్యం అందుబాటులో ఉండటంతో

- మిగతా 6లో

దంపతుల మధ్య చిచ్చురేపి..

గుడివాడలోని వాసవీనగర్‌కు చెందిన కొలుసు రాంబాబు (45) ప్రైవేట్ ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనకు ఫోన్‌పే లేకపోవడంతో తనకు వచ్చిన కూలి డబ్బును భార్య కనకదుర్గకు పంపే ఏర్పాటు చేసుకున్నాడు. ఈనెల 20వ తేదీన డ్యూటీ దిగి మద్యం తాగడానికి రూ.500ను తన భార్య సెల్ నుంచి దుకాణంలోని నెంబరు పంపమని కోరాడు. తాగి ఇంటికెళ్లి పడుకున్నాడు. మధ్యాహ్నం మళ్లీ వెళ్లి ఇంకో రూ.500 అదే నెంబరుకు పంపమని అడిగాడు. మళ్లీ మద్యం సేవించి ఇంటికొచ్చాక డబ్బులు దుబారా చేస్తున్నావెందుకు అని భార్య అడిగిందని మనస్తాపంతో ఉరేసుకుని చనిపోయాడు. ఆ బాధతో ఆయన భార్య కూడా ఉరేసుకుని అదేరోజు చనిపోయింది. ఒక్కగానొక్క కొడుకు ఒంటరైపోయాడు.

తండ్రిని పోగొట్టుకుని కూలికెళుతున్న మైనర్

మద్యానికి బానిసై జె-బ్రాండ్ మద్యాన్ని సేవించి మల్లాయిపాలేనికి చెందిన దినసరి కూలీ (45) ఇటీవల లివర్ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు కావడంతో మైనర్ అయిన కుమారుడు చదువు మానేసి కూలి పనికి వెళుతూ తల్లిని పోషించుకుంటున్నాడు.

ద్వీపంలో దోపిడీ

ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రహస్య ఒప్పందాలు

- ఆదాయం రూ.12 కోట్లయితే, లీజుకిచ్చింది రూ.4.20 కోట్లకే..
- ప్రీ బిడ్‌కు ముందే సంస్థలతో ఏపీటీడీసీ ఉన్నతాధికారుల మిలాఖత్
- బయటవారెవరూ రాకుండా రెండు రోజుల్లోనే ప్రీ బిడ్ మీటింగ్
- బిడ్ల దాఖలకు సమయం వారమే.. అదేరోజు ఓపెన్
- సొంత ప్రయోజనాల కోసం హడావుడిగా టెండర్ ప్రక్రియ



నగరంలోని భవానీ ద్వీపం, హరిత బర్మ్‌పార్క్, బాపట్లలోని సూర్యలంక బీచ్, నాగార్జున సాగర్.. రాష్ట్రంలోనే కీలకమైన ఈ పర్యాటక ప్రాంతాల ఏడాది ఆదాయం రూ.12 కోట్లు. అంతటి ఆదాయం ఇచ్చే ప్రాంతాలను ఎవరైనా ఏడాదికి రూ.4.20 కోట్లకు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తారా? ఘనత వహించిన ఏపీటీడీసీ అధికారులు అంతటి 'ధన'కార్యం చేస్తున్నారు. పర్యాటకులు ఎక్కువగా వచ్చే ఈ ప్రాంతాలను తమ అనుయాయులకు తక్కువకే అప్పగించేందుకు హడావుడిగా టెండర్లు పిలవడం, రహస్యంగా ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించేయడం, వారంలోనే బిడ్ల దాఖలుకు సమయం ఇవ్వడం, అదేరోజు బిడ్లు తెరిచేస్తామని చెప్పేయడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు జరిగాయన్న అనుమానాలు కలుగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ద్వీపం లీజుల వెనుక కొందరు ఏపీటీడీసీ ఉన్నతాధికారుల లోపాయికారీ ఒప్పందాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వీపంతో పాటు హరిత బెర్మ్ పార్క్ నిర్వహణను ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టే పేరుతో ఆదాయాన్ని ప్రైవేట్‌గా పంచుకునే ఒప్పందాలు జరిగినట్టు తెలుస్తోంది. వాస్తవానికి ఆయా యూనిట్లకు వస్తున్న ప్రస్తుత ఆదాయం కంటే కూడా సగం తక్కువగా కట్టబెట్టేస్తున్నారు. మిగిలిన సగం ఆదాయాన్ని లీజుదారుడు, అవినీతి అధికారులు కలిసి పంచుకునేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. దీనికోసం టెండర్లు పిలవటానికి ముందే బడా వ్యక్తులతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నట్టుగా తెలుస్తోంది. టెండర్లలో ప్రైవేట్ ఒప్పందాలు చేసుకున్నవారు మాత్రమే పాల్గొనేలా, మిగిలినవారు పాల్గొనకుండా ఉండేలా తెలివిగా ప్రీ బిడ్ మీటింగ్, బిడ్ల సబ్‌మిషన్ అనే వాటిని కేవలం రోజుల్లోనే పూర్తిచేసేలా గడువు ఇచ్చారు. ఎవరికీ పెద్దగా తెలియకుండా ఉండేలా ఈనెల 20వ తేదీన టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ విషయం ఏపీటీడీసీలో కూడా 23వ తేదీ అంటే.. ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహించిన రోజు వరకు ఎవరికీ తెలియదు. 20వ తేదీన టెండర్లు పిలిస్తే, ప్రీ బిడ్ మీటింగ్‌ను 23న నిర్వహించటం గమనార్హం. ముందుగా ప్రైవేట్ ఒప్పందాలు చేసుకున్న వారినే ఈ సమావేశానికి పిలిచినట్టు తెలిసింది. ప్రీ బిడ్ జవాబులకు కూడా కేవలం రెండే రెండు రోజుల సమయాన్ని ఇచ్చారు. 25వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు ప్రీ బిడ్ రిప్లైస్ ఇవ్వాలని నిర్దేశించారు. ఫిబ్రవరి 5న బిడ్లను అప్‌లోడ్ చేయాలని, అదేరోజు తెరుస్తామని స్పష్టం చేశారు.

రూ.వేల కోట్ల ఆస్తులు ప్రైవేట్ చేతుల్లోకి..

భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్క్‌ల నికర విలువ దాదాపు రూ.5 వేల కోట్లపైనే. ఇంతటి విలువైన ఆస్తులను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేటప్పుడు ఆచీతూచి వ్యవహరించాలి. రెండు వారాల్లోనే పని ముగించేలా టెండర్లు ఎవరూ పిలవరు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచేటపుడు ఎక్కడ, ఈ విధమైన హడావుడి చేయరు. ఇంత హడావుడిగా టెండర్లు పిలవటం వెనుక మరెవరూ ఇందులోకి రాకుండా, జోక్యం చేసుకోకుండా ఉండాలనేదే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

తక్కువ ఆదాయానికే..

భవానీ ద్వీపం, హరిత బెర్మ్‌పార్క్‌తో పాటు సూర్యలంక, నాగార్జున సాగర్‌ను కూడా కలిపి ఏడాదికి రూ.4.20 కోట్ల లీజుకు ఇచ్చేందుకు ఏపీటీడీసీ అధికారులు టెండర్లు పిలిచారు. ద్వీపం ద్వారా నెలకు రూ.25 లక్షలు, హరిత బెర్మ్‌పార్క్ ద్వారా నెలకు రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. సీజన్‌లో అయితే రూ.80 లక్షల వరకు ఉంటుంది. కార్తీక మాసం అయితే ఆదాయం రూ.కోటి కూడా దాటుతుంది. సాధారణ రోజుల్లో వచ్చే ఆదాయాన్ని లెక్కించుకున్నా.. ఏడాదికి రూ.7.20 కోట్ల ఆదాయం వస్తుంది. మరి సూర్యలంక బీచ్ ద్వారా ఏడాదికి రూ.3 కోట్లు, నాగార్జున సాగర్ ద్వారా ఏడాదికి రూ.కోటి కలిపి రూ.11.20 కోట్ల మేర ఆదాయం వస్తుంది. వీటన్నింటినీ రూ.4.20 కోట్లకే కట్టబెట్టడం వెనుక మర్మమేమిటో అర్థంకాని పరిస్థితి.

ఎవరికీ తెలియకుండా..

ఈ విషయంపై ఉద్యోగ సంఘాల నేతలు.. చైర్మన్ వద్ద పంచాయితీ పెట్టినట్టు తెలుస్తోంది. ఆయన కూడా.. నోటిఫికేషన్ గొడవే తనకు తెలియదని, తనకెవరూ సమాచారం కూడా ఇవ్వలేదని, ఉన్నతాధికారులను కనుక్కుని ఉద్యోగ సంఘాల నేతలతో చర్చిస్తానని సముదాయించి పంపినట్టు తెలుస్తోంది.

- సెంట్రల్‌లో మల్లాది వర్సెస్ వెలంపల్లి
- నేడు వెలంపల్లి కార్యాలయం ప్రారంభం
- మల్లాదికి ఆహ్వానం.. అయినా ముభావంగానే..
- పెనమలూరులో జోగికి గ్రూపుల సెగ
- ఆయన ఎదుటే బూతులు తిట్టుకున్న ఇరువర్గాలు

తనకు రావాల్సిన సీటు కొట్టేశాడనే అక్కసుతో ఒకరు... తనను ఓడిస్తాడేమోననే భయంతో మరొకరు... వెన్నుపోటుదారుడిని ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో ఒకరు... అందరి ఓట్లూ లాగేసుకునేదాకా భరించి ఆ తరువాత లెక్క సరిచేయాలనే ధోరణితో మరొకరు.. ఇలా ఒకరిపై ఒకరు లోలోపల కత్తులు దూస్తున్నారు. పైకి మాత్రం ఏ సమస్యా లేనట్టు.. అంతా కలిసిమెలిసి ఉన్నట్టు.. నవ్వులు విరజిమ్ముతూ.. ఐక్యత నటిస్తూ.. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వైసీపీలో కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుత పరిస్థితి ఇదీ. విజయవాడ సెంట్రల్, పెనమలూరు నియోజకవర్గాల్లో ఇది తీవ్రస్థాయికి చేరింది. నేతలతోపాటు వారి గ్రూపులకూ పాకింది. తమ నేతల ఎదుటే మాటల కత్తులు దూసేదాకా వెళ్లింది.



పైకి నవ్వులు.. లోన కత్తులు!

సెంట్రల్, పెనమలూరులలో వైసీపీ దుస్థితిదీ..

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) 'శత్రువునైనా నమ్మవచ్చు కానీ మిత్రుడు రూపంలో ఉన్న శత్రువును నమ్మకూడదు. వెలంపల్లి అలాంటి వ్యక్తే. అన్నా.. అన్నా అంటూనే ద్రోహం చేశాడు. అన్నా అంటుంటే తమ్ముడని నమ్మాను. కానీ నమ్మక ద్రోహం చేసి వెన్నుపోటు పొడుస్తాడనుకోలేదు. నేను కూడా అతనిలాగే రాజకీయం చేసి ఉంటే అతను అసలు రాజకీయాల్లోనే ఉండేవాడు కాదు' అని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన సన్నిహితుల వద్ద ఇటీవల వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ నుంచి సెంట్రల్ వైసీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు విషయంలో విష్ణు, ఆయన అనుచరులు అవమానభారంతో రగిలిపోతున్నారు. పార్టీ పెద్దలను పక్కదారి పట్టించి వెలంపల్లి టికెట్ తెచ్చుకున్నారని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందు చేతులు కలుపుతున్నా వెనుక మాత్రం కత్తులు దువ్వుతున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో వెలంపల్లి శ్రీనివాసరావు సెంట్రల్ నియోజకవర్గంలో తన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించనున్నారు. కార్యాలయ ప్రారంభానికి ఆహ్వానించేందుకు వెలంపల్లి బుధవారం మల్లాది విష్ణుని కలిశారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా విష్ణుని ఆహ్వానించారు. దీనిపై మల్లాది విష్ణు వస్తానని కానీ రానని కానీ చెప్పకుండా ముభావంగా ఉండిపోయినట్లు సమాచారం. వెలంపల్లితో భేటీ అనంతరం విష్ణు తన అనుచరులతో గాయత్రి కల్యాణమండపంలో ఆత్మీయసమావేశం పేరుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో మల్లాది విష్ణు కీలక నిర్ణయం తీసుకోనున్నారని ఎదురుచూసిన అనుచరులను నిరాశపరుస్తూ.. పార్టీ నిర్ణయాన్ని అందరూ శిరసావహించాలని, వెలంపల్లికి సహకరించాలని విష్ణు చెప్పడం గమనార్హం. అయితే ఈ భేటీలో ఆయన ముభావంగా ఉండటం ద్వారా ఇది బలవంతపు ఆత్మీయ సమావేశం అన్న విషయం అర్థమవుతోందని విష్ణు అనుచరుడు ఒకరు వ్యాఖ్యానించారు.

మరోవైపు సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ లోటస్‌పాండ్‌లోని కొండపల్లి బుజ్జి నివాసంలో సెంట్రల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో వెలంపల్లి బుధవారం భేటీ అయ్యారు. దీనికి కార్పొరేటర్లు

- మిగతా 6లో

హనుమంతు కారణంగానే సారథికి చెక్

తాడిగడప మున్సిపాలిటీలో విలీనమైన పంచాయతీల్లో కానూరు పెద్దది. మున్సిపాలిటీ కాకముందు కానూరు పంచాయతీపై అన్నే చిట్టిబాబుదే ఆధిపత్యంగా ఉండేది. దీనికి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో హనుమంతు పట్టుబట్టి మున్సిపాలిటీగా చేయించారు. కేవలం రాజకీయ ఆధిపత్యంలో భాగంగా మున్సిపాలిటీని ఏర్పాటు చేయించినా అభివృద్ధిని గాలికొదిలేసి వసూళ్లకు తెరలేపారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ఎడాపెడా వసూళ్లకు తెగబడటంతో ఆ ప్రభావం సారథిపై పడింది. దాని ప్రభావం కారణంగానే వైసీపీ సర్వేల్లో సారథికి ప్రతికూలంగా రావడం ఆయనకు టికెట్ నిరాకరించడం జరిగిందని వైసీపీ శ్రేణుల మాట. సారథిపై అవినీతి ముద్రకు ప్రధాన కారణమైన హనుమంతుపై వైసీపీ శ్రేణుల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. అలాంటి వ్యక్తికి జోగి రమేశ్ ప్రాధాన్యం ఇచ్చి పార్టీ కోసం కష్టపడే వారిని పక్కన పెడుతుండటాన్ని జీర్ణించుకోలేక మంగళవారం వారు మంత్రి సమక్షంలోనే హనుమంతుపై బూతులతో తిరుగుబాటు చేశారు. ఈ పరిస్థితుల్లో జోగి ఎంత వరకు పెనమలూరులో నెగ్గుకు రాగలడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మచిలీపట్నం ఎంపీపై మల్లగుల్లాలు

మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి ఎవరిని బరిలోకి దింపాలన్న అంశంపై వైసీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. సిటింగ్ ఎంపీ బాలశౌరి అనూహ్యరీతిలో వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో ఇక్కడి నుంచి పలువురి పేర్లను పార్టీ పరిశీలిస్తోంది. మచిలీపట్నంతో అనుబంధం ఉన్న చలమలశెట్టి సునీల్‌ను బరిలో దింపాలని వైసీపీ అధిష్ఠానం భావించినా ఆయన విముఖత చూపుతున్నట్టు సమాచారం. దీంతో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ఎంపీగా నిలబెడితే ఎలా ఉంటుందని వైసీపీ పెద్దలు యోచిస్తున్నారు. ఈ మేరకు ఆయనను సీఎంవోకి పిలిపించి చర్చలు కూడా జరిపారు.

బందరు నుంచి టీడీపీ, జనసేన ఎంపీ అభ్యర్థిగా బాలశౌరి బరిలో దిగుతున్నట్టు సమాచారం. ఆయన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో వైసీపీ కూడా అదే సామాజికవర్గం వ్యక్తిని బరిలో నిలపాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

పక్కా ప్లాన్

నగరంలో దోచుకుతింటున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు

- ప్లాన్ పెట్టుకో.. కాసులిచ్చుకో.. ఇష్టమొచ్చినట్టు కట్టుకో..
- కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి
- ఏరియాకో రేటు పెట్టి ఇష్టానుసారంగా దోపిడీ

కట్టల మాటున అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్‌లోని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు లంచాల్లో మునిగితేలుతున్నారు. నిబంధనల మేరకు జరిమానాలు విధించకుండా, అక్రమంగా దోచుకుని జేబులో వేసుకుంటున్నారు. నగరవ్యాప్తంగా ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉండగా, కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



రాజీవ్‌శర్మనగర్‌లో అక్రమ నిర్మాణం

చిట్టినగర్ : నగరపాలక సంస్థలోని పశ్చిమ టౌన్‌ప్లానింగ్‌లో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. నిబంధనలతో పనిలేకుండా ఆన్‌లైన్ ప్లాన్లకు అనుమతినిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో పెట్టగానే అనుమతినిస్తారు. నిబంధనల ప్రకారం లేదని, రోడ్డు విస్తరణ, చుట్టూ సెట్ బ్యాక్‌లు లేవని, మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణకు సంబంధించి నగరపాలక సంస్థకు గిఫ్ట్ డీడ్ చేయాలని మెలిక పెడతారు. ఇంతలో ప్లానింగ్ సెక్రటరీ ఎంట్రీ ఇస్తాడు. బేరం కుదుర్చుకుని, భవన యజమాని నుంచి అండర్ టేకింగ్ లెటర్ తీసుకుంటారు. ఆ తర్వాతే నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు.

అనధికారికంగా అనుమతులు

46వ డివిజన్ కేటీ రోడ్డులో కరుణమయి వీధి ఎదురుగా ఉన్న భవనాన్ని ఎటువంటి సెట్ బ్యాక్‌లు వదలకుండా నిర్మించారు. రోడ్డు విస్తరణ ఉన్నప్పటికీ నిబంధనలకు నీళ్లొదిలేశారు. రాజీవ్ శర్మ నగర్‌లో రోడ్డు విస్తరణకు సంబంధించి సుమారు 20 అడుగులు వదిలి నిర్మించాలి. ప్లాన్‌లో అలాగే ఉన్నా.. నిర్మాణం మాత్రం ఒక్క అడుగు వదలకుండా చూపించారు. సిండికేట్ బ్యాంక్ కాలనీలోని పార్కు రోడ్డు కుటీర్ అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డు లేకుండా భవనానికి అనుమతి ఇచ్చారు. ఈ ప్లాన్లకు సంబంధించి రూ.లక్షల్లో చేతులు మారాయని తెలుస్తోంది.

ఏరియా కో రేటు

నగరంలోని వ్యాపార కూడళ్లలో అక్రమ నిర్మాణాలకు ఒక రేటు, శివారు ప్రాంతాల్లో మరో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్ల బేరాలు కుదిరిన తరువాత సెక్రటరీలు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు తెలియజేస్తారు. వారు చెప్పిన ప్రకారం భవన యజమాని ఒప్పుకొంటే నిర్మాణం సాగుతుంది. లేకుంటే మధ్యలోనే ఆగిపోతుంది. అంతా ముడుపులను బట్టే ఉంటుంది. పలువురు వైసీపీ నేతలు, కార్పొరేటర్లు అనధికార కట్టడాలకు వత్తాసు పులుకుతూ భవన యజమానుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా నగరపాలక సంస్థ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. వైసీపీ నేతల అనధికార కట్టడాల వైపు కన్నెత్తి చూసినా టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలు, అధికారులపై దాడులు చేయిస్తున్నారు. వీటిపై టౌన్‌ప్లానింగ్ విభాగాధికారి, కమిషనర్ స్పందించకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి.

పార్కింగ్ పేరిట దోపిడీ

టౌన్‌ప్లానింగ్ అధికారులకు పార్కింగ్‌లు కూడా కాసులు కురిపిస్తున్నాయి. ఓ భవనం 130 చదరపు గజాలు ఉండి, రోడ్డు 30 అడుగులకు పైబడి ఉంటే ఆ భవనానికి పార్కింగ్‌తో పాటు జీ ప్లస్ టూకు అనుమతి ఇస్తారు. అయితే, ఇటీవల ప్లాన్లన్నీ ఆన్‌లైన్ కావడంతో ఇంజనీర్లు ఇష్టానుసారంగా కాగితాల్లో రోడ్లు చూపించి, అదనపు అంతస్తు కోసం అధికారికంగా అనుమతి తీసుకుని భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు కాసుల పంట పండుతోంది. 130 గజాల్లో బాండ్లతో నిర్మించుకుంటే, సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు కట్టాల్సి ఉంటే, ఇన్‌స్పెక్టర్లు రూ.5, 6 లక్షలు తీసుకుని అధికారికంగా అనుమతులిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేఎల్ రావు పార్కు రోడ్డులో మొదట జీ ప్లస్ టూకి అనుమతినిచ్చి, వెంటనే దానిని పార్కింగ్ ప్లస్ జీ ప్లస్ టూగా అనుమతినివ్వడం వంటివి ఇన్‌స్పెక్టర్ల ఇష్టానుసార ప్లాన్లకు నిదర్శనం.

నగరమంతా ఇదే పరిస్థితి

నగరవ్యాప్తంగా అక్రమ కట్టడాలు నిర్మితమవుతూనే ఉన్నాయి. పాతబస్టాండ్, బీసెంట్‌రోడ్డు, జైహింద్ కాంప్లెక్స్, కొత్త పేట, చిట్టినగర్, బ్రైజర్‌పేట, బందరురోడ్డు, గాంధీనగర్, సత్యనారాయణపురం, సింగ్‌నగర్, పటమట, సొరంగం, గట్టువెనుక, భవానీపురం, కబేళా ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. కార్పొరేటర్లతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది రూ.లక్షలు దండుకుంటున్నారని ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. భవన యాజమానులు, స్థానిక కార్పొరేటర్లతో పాటు ఇన్‌స్పెక్టర్లను ప్రసన్నం చేసుకుంటే సరే, లేకపోతే మరుసటి రోజు ఆ భవనాన్ని కూల్చివేస్తున్నారని చెబుతున్నారు.

ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బదిలీలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల స్థానాలు కదులుతున్నాయి. జిల్లాలో మూడేళ్లు పనిచేసిన వారిని ఈనెలాఖరులోపు బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. వీరిని ఏలూరు రేంజ్‌కు పంపుతున్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి బదిలీలపై వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్ ఇవ్వనున్నారు. దఫదఫాలుగా ఈ జాబితాను అధికారులు విడుదల చేస్తున్నారు. ఎన్నికల సమయానికి అంతా కొత్తవారే అయితే ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాలు, రౌడీషీటర్లు, వారి కార్యకలాపాలపై అవగాహన ఉన్న కొద్దిమందిని మాత్రం అందుబాటులో ఉంచుతున్నారు. మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీపై పంపుతున్నారు.

విడతలవారీగా పోస్టింగ్‌లు

కమిషనరేట్ పరిధి నుంచి బదిలీపై వెళ్తున్న వారి లెక్కలను తేల్చిన అధికారులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని రేంజ్ నుంచి వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. రేంజ్ నుంచి కొద్దినెలల క్రితం వచ్చిన ముత్యాల సత్యనారాయణకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. పటమటలో ఉన్న డి.కాశీవిశ్వనాథ్ స్థానంలో మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న మోహన్‌రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. కాశీవిశ్వనాథ్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. నున్న ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.దుర్గాప్రసాద్‌ను నియమించారు. వీఆర్‌లో ఉన్న కె.కిశోర్‌బాబుకు మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో పాటు ఆయా డివిజన్లలో మూడేళ్లు సర్వీసు పూర్తయిన హెచ్‌సీలు, పీసీలను మరో డివిజన్‌కు బదిలీ చేస్తున్నారు. మరో రెండు రోజులు ఈ బదిలీలు జరగనున్నాయి. ఏసీఆర్‌తో పాటు సామాజికవర్గాలను బేరీజు వేసుకుని పోస్టింగ్ ఇస్తున్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆర్.సురేష్‌రెడ్డికి పటమట అటాచ్‌మెంట్ ఇచ్చి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. వన్‌టౌన్‌కు వీఆర్‌లో ఉన్న డి.దుర్గాశేఖర్‌రెడ్డిని నియమించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చిన ఆకుల మురళీకృష్ణకు కృష్ణలంకలో పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఎస్ఎస్‌వీ నాగరాజును టాస్క్‌ఫోర్స్‌లో నియమించారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌కే అబ్దుల్ నబీకి తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీగా ఉన్న పి.చెంచిరెడ్డి రాజమహేంద్రవరంలోని సీఏఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రసాదరావు నియమితులయ్యారు.

వేమవరంలో తహసీల్దార్ సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మైనింగ్ మాఫియా తవ్విన పట్టాభూమి పరిశీలన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వేమవరంలో మైనింగ్ మాఫియా అక్రమ తవ్వకాలపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. బాధితుడైన రైతు నాగరాజు పొలాన్ని ఎంతమేర మైనింగ్ మాఫియా తవ్విందో సర్వే చేసేందుకు విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ బుధవారం వెళ్లారు. బాధిత రైతు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా కనికరించని తహసీల్దార్ 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలారు. దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు, టూటౌన్ పోలీసులకు పంపనున్నారు. బాధిత నాగరాజు పొలాన్ని సర్వే చేసే క్రమంలో పలువురు రైతులు వచ్చి తమ భూముల్లో కూడా తవ్వకాలు జరిపారని, సర్వే చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఇప్పుడు తనకు సమయం లేదని చెప్పి ఆమె వెళ్లిపోయారు.

నితీశ్ మళ్లీ యూ టర్న్?

- కర్పూరీ ఠాకూర్‌కు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు భారతరత్న ఇవ్వలేదు
- కర్పూరీ శతజయంతి సభలో నితీశ్.. తిరిగి ఎన్డీఏలో చేరటానికేనా?

పట్నా, జనవరి 24: జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ మరోసారి స్నేహితులను మార్చనున్నారా?.. బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు చూస్తుంటే ఈ అనుమానం కలుగుతోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత వెనకబడిన వర్గాల కోసం జీవితాంతం కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని తమపార్టీ ఎంతోకాలంగా కేంద్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిందని, గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను కూడా డిమాండ్ చేశామని నితీశ్ చెప్పారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేస్తే, ఇప్పటికి పురస్కారం ఇచ్చారని తెలిపారు. కర్పూరీ ఠాకూర్ శతజయంతి నేపథ్యంలో, బుధవారం జేడీయూ నిర్వహించిన సమావేశంలో నితీశ్ చేసిన వ్యాఖ్యలతో రాజకీయ చర్చలు మొదలయ్యాయి. ఆయన ఇండియా కూటమిని వదిలి తిరిగి ఎన్డీఏ గూటికి చేరుతారా అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

చైనా అగ్నిప్రమాదంలో 39 మంది మృతి

బీజింగ్/నాన్‌చంగ్, జనవరి24: తూర్పు చైనాలోని జియాంగ్జి ప్రావిన్సులో బుధవారం ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 39మంది మృతిచెందారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో వీధి దుకాణంలో మంటలు అంటుకోవడంతో ఈ ఘటన జరిగిందని, సహాయక చర్యలు పూర్తయ్యాయని చైనా అధికారిక వార్తా సంస్థ 'జిన్హువా' వెల్లడించింది.

లోక్‌సభ ఎన్నికలయ్యాక రాహుల్ అరెస్టు: హిమంత

గువాహటి, జనవరి 24: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీ అరెస్టు అవుతారని అసోం సీఎం హిమంతబిశ్వశర్మ అన్నారు. సిబ్‌సాగర్ జిల్లాలోని నజిరాలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో హిమంత మాట్లాడారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో హింసాత్మక ఘటనపై కేసుకు సంబంధించి లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్ అరెస్టు అవుతారని చెప్పారు. దర్యాప్తు కోసం ఈ కేసును అసోం సీఐడీకి బదిలీ చేసినట్లు డీజీపీ జీపీసింగ్ తెలిపారు.

మోదీ నిజంగా ఉపవాసం చేశారా?: మొయిలీ

బెంగళూరు, జనవరి 24: అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠకు ముందు ప్రధాని మోదీ 11 రోజుల పాటు చేసిన అనుష్ఠానంపై కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ అనుమానాలు వ్యక్తం చేశారు. తాను ఓ డాక్టర్‌తో మాట్లాడానని. కొబ్బరి నీళ్ల మాత్రమే తీసుకొని 11 రోజుల పాటు బతకడం అసాధ్యమని ఆయన చెప్పారని తెలిపారు. "ఆయన బతికి ఉన్నారంటే అద్భుతమే. ఆయన ఉపవాసం చేశారంటే అనుమానంగానే ఉంది" అని మొయిలీ ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ లహర్‌సింగ్ సిరోయా ఖండించారు. ఆయన (మొయిలీ)లాగా ప్రతి ఒక్కరూ నకిలీలు కాదన్నారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయండి: రామకృష్ణ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జైళ్లలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు.

ఫిబ్రవరి 1 నుంచి సమ్మె..!

- ఎండీయూ ఆపరేటర్ల సంఘం హెచ్చరిక

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 1నుంచి వాహనాలను నిలిపివేసి సమ్మెబాట పడతామని ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రైతు సూర్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎండీయూ ఆపరేటర్లకు రూ.5 వేలు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్వోలు, జేసీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు.


ప్రధాని మోదీకి ప్రదర్శనను వివరిస్తున్న కృత్తివెంటి శ్రీనివాసరావు

కేంద్ర సాహిత్య అకాడమీ పుస్తక ప్రదర్శనలో మోదీ

- కార్యదర్శి శ్రీనివాసరావుతో ప్రధాని మాటా మంతీ

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్వహించిన ప్రదర్శనలో భాగంగా సాహిత్య అకాడమీ నేతాజీపై వివిధ భాషల్లో ప్రచురించిన పుస్తకాలను ప్రదర్శించింది. పుస్తకాలనుంచి 24 ప్యానెల్స్‌ను కూడా అకాడమీ రూపొందించింది. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు ప్రధాని మోదీకి ఈ పుస్తకాలు, ప్యానెల్స్ గురించి వివరించారు. ఎర్రకోట వద్ద నిర్వహించిన ఈ ప్రదర్శన జనవరి 31 వరకు కొనసాగుతుంది. శ్రీనివాసరావు కృష్ణా జిల్లా పెదప్రోలు గ్రామానికి చెందిన వారు కావడం విశేషం.

ఉన్నత స్థితికి చేరేలా.. బాలికల్లో ధృడ సంకల్పం నింపుదాం


విద్యార్థినికి జ్ఞాపిక ఇస్తున్న కలెక్టర్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 24 : లింగ వివక్షతను రూపుమాపి బాలికలు ధృడ సంకల్పం, ధైర్యంతో ఆకాశమే హద్దుగా ఉన్నత స్థాయిని చేరేలా ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బిషప్ అజరయ్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఢిల్లీరావు మాట్లాడుతూ, బాలికల్లో ధృడసంకల్పాన్ని, ధైర్యాన్ని నింపి స్వతంత్రంగా ఉన్నత స్థితికి చేరుకొనేలా ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారుల పాత్ర కీలకమన్నారు. బాలికలు విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు అన్నిరంగాల్లో ముందుండేలా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు కృషి చేద్దామన్నారు. మార్పు ట్రస్ట్ సహకారంతో విద్య, సాంస్కృతిక, క్రీడారంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు కలెక్టర్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరక్టర్ కె.శ్రీనివాసరావు, బిషప్ అజరయ్య కళాశాల ప్రిన్సిపల్ సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లను మోసం చేసిన జగన్

- ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు లీలా మాధవరావు

గవర్నర్‌పేట : వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల సంక్షేమాన్ని పట్టించుకోకుండా మోసం చేసిందని ఏపీ రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు అన్నారు. బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ డీలర్లకు సమాంతరంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను తెచ్చిందని, ఆహార భద్రత చట్టానికి విరుద్ధంగా వారి నియామకం జరిగిందన్నారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డీలర్ల సమస్యలను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకువెళ్లి మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరతామన్నారు. తెలంగాణాలో వలె ఏపీలోనూ గౌరవ వేతనం, కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి పోస్టు ద్వారా పంపుతున్నట్టు చెప్పారు.

సమైక్యత ఉట్టిపడేలా గణతంత్ర ఏర్పాట్లు

- శాఖల సమన్వయంతో పరేడ్‌కు సిద్ధం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 24 : జాతీయ సమైక్యత ఉట్టిపడే విధంగా గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేసి ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 75వ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ సమైక్యత ఉట్టిపడేలా వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసి పరేడ్‌కు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పతాకావిష్కరణ చేస్తారని, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనే వేడుకలకు తగిన విధంగా ఏర్పాట్లను సిద్ధంచేసి వేడుకలను వీక్షించేందుకు విచ్చేసే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొనే కంటింజెంట్ విభాగాల ప్రదర్శనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటేలా వివిధ శాఖల శకటాలను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా జనరేటర్లను అందుబాటులో వుంచాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో మెడికల్ క్యాంపు, అంబులెన్సులను సిద్ధంగా వుంచాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న వేడుకలను విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ 90 శాతం ఖాళీ..

- పదవులున్నా, లేకున్నా బాబుతోనే పయనం
- ప్రత్యర్థులు భయపడేలా విజయం సాధిస్తాం.. : కేశినేని చిన్ని


జగ్గయ్యపేటలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కేశినేని చిన్ని

జగ్గయ్యపేట, జనవరి 24 : జిల్లాలో 60 శాతం టీడీపీ ఖాళీ చేస్తానన్న వ్యక్తి వైసీపీలోకి వెళ్లాక ఆ పార్టీ 90 శాతం ఖాళీ అయిందని టీడీపీ నేత, కేసినేని శివనాథ్(చిన్ని) అన్నారు. నేడు వైసీపీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. ఐక్యంగా ఉండి రాష్ట్రానికి పట్టిన శని వదిలిద్దామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం జగ్గయ్యపేటలో మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో కేసినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ కుటుంబానికి ఇంత గుర్తింపు వచ్చిందంటే దానికి టీడీపీ, చంద్రబాబే కారణమని, పదవులున్నా.. లేకున్నా జీవితాంతం చంద్రబాబుతోనే పయనిస్తానని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ కోసం చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని, అదే లక్ష్యంగా పనిచేద్దామన్నారు.

జగ్గయ్యపేటలో టీడీపీ గెలుపు ఖాయమైంది..

ఇదేం ఖర్మ కార్యక్రమానికి చంద్రబాబు వచ్చిన రోజునే జగ్గయ్యపేటలో టీడీపీ గెలుపు ఖాయమైందని కేసినేని చిన్ని అన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మెజార్టీని చూసి ప్రత్యర్థులు భయపడి పోవాలన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లో గెలిచి అధినేతకు కానుకగా ఇద్దామన్నారు. జగ్గయ్యపేటలో కేసినేని చిన్నికి మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తొలుత విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో శ్రీరాం తాతయ్య, శ్రీరాం సుబ్బారావు, రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొనగా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

కేశినేని ఫౌండేషన్‌తో అండగా నిలిచారు : నెట్టెం

కేసినేని ఫౌండేషన్‌తో తెలుగుదేశం పార్టీకి కేసినేని చిన్ని అండగా నిలిచారని నెట్టెం రఘురాం ప్రశంసించారు. లక్షలు వెచ్చించి అన్న క్యాంటీన్‌లు, మెడికల్ క్యాంప్ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఎన్టీఆర్ శత జయంతికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పార్టీపై అభిమానాన్ని చాటారన్నారు. జనసేన జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి ఈమని కిశోర్ తదితరులు పాల్గొన్నారు. వత్సవాయి మండలంలో పెదమోదుగపల్లికి చెందిన పలువురు వైసీపీ నేతలు కేసినేని చిన్ని సమక్షంలో పార్టీలో చేరారు.

ఆసరా కాదు.. అక్కా చెల్లెళ్లకు టోకరా : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే కేవలం 79 లక్షల మందికి ఆసరా సాయం చేశాననడం వట్టి దగా అని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ విమర్శించారు. మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి మహిళలకు వేసింది ఆసరా కాదని, టోకరా అని ఎద్దేవా చేశారు. కల్లబొల్లి కబుర్లతో జగన్‌రెడ్డి మహిళలను నిలువునా ముంచేస్తున్నారన్నారు. జీతాలు పెంచమన్నందుకు అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపి బెదిరించి ఉద్యోగాల్లోకి పంపారన్నారు. మహిళలు దాచుకున్న రూ. 2118 కోట్ల అభయహస్తం నిధులను దారి మళ్లించారన్నారు. ఎస్సీ ఎస్టీ మహిళలకు చంద్రబాబు సబ్సిడీ పథకాల ద్వారా రూ. 800 కోట్లు ఇస్తే జగన్‌రెడ్డి పథకాలను రద్దు చేశారన్నారు.

తాడేపల్లి సీఎంకు ప్రజల బాధలు తెలియవు : ఉమా

రెడ్డిగూడెం : రాష్ట్రంలో ఉపాధి లేక నిరుద్యోగుల గగ్గోలు.. ఉన్న ఎకరం అమ్ముకొని టీచర్ శిక్షణ పూర్తి చేసిన వారి బాధలు.. పేద, మధ్య తరగతి కుటుంబాల గోష.. తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సీఎం జగన్‌కు అర్థం కావడం లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం రెడ్డిగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పబ్జీ ఆడుకుంటూ, ఎమ్మెల్యేలు, మంత్రుల బదిలీలు చేస్తూ కాలం గడుపుతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చివేశాడన్నారు. రైతుల ధాన్యం కొనే నాథుడు లేడన్నారు. తెలుగుజాతి కీర్తిని నలుదిశలా వ్యాప్తింప చేసిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముప్పిడి నాగేశ్వర రెడ్డి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలోనే బీఈడీ ప్రశ్నాపత్రాలు

- 3వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో ఏఎన్‌యూ నిర్లక్ష్యం
- సోషల్, గణితం, బయాలజీ పేపర్లు ఇంగ్లీషులో ముద్రణ
- వేలాది మంది తెలుగు మీడియం విద్యార్థులతో చెలగాటం

గుంటూరు(విద్య), జనవరి 24: బీఈడీ పరీక్షల నిర్వహణలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్యంతో తెలుగు మీడియం విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. బుధవారం నుంచి ప్రారంభమైన 2022-24 బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో సోషల్, గణితం, బయాలజీ ప్రశ్నాపత్రాలను కేవలం ఇంగ్లీషు మీడియంలోనే ముద్రించి పంపిణీ చేశారు. దీనిపై వర్సిటీ పరిధిలోని 170 కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది తెలుగు మీడియం విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో సెమిస్టర్ వరకు వర్సిటీ అధికారులు రెండు మాధ్యమాల్లో ప్రశ్నాపత్రాలు ముద్రించారు. అయితే మూడో సెమిస్టర్‌లో పేపర్లు కేవలం ఆంగ్లంలోనే వచ్చాయి. అధికారుల నిర్వాకంతో మెథడాలజీ పేపర్‌లో ఇచ్చిన ప్రశ్నలు, పదాలు అర్థంకాక తెలుగు మీడియం విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. గతంలో నాలుగో సెమిస్టర్ ప్రశ్నాపత్రం లీకవడంతో ప్రయోగ పరీక్షలు నిర్వహించకుండానే రూ.లక్షలు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న పీజీ విభాగం అధికారులు మరోసారి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, బీఈడీ పరీక్షల్లో సర్వం తానే అన్నట్లుగా ఓ అధ్యాపకుడు వ్యవహరిస్తున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని ఓ కళాశాల అధ్యాపకుడు రెండేళ్లుగా వర్సిటీలోని ఒక అధికారికి అనుంగు అనుచరుడిగా అవతారమెత్తారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు తనిఖీ విధులు కేటాయిస్తానంటూ అధ్యాపకుల నుంచి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరికి పరిశీలకులుగా(అబ్జర్వర్స్) విధులు కేటాయిస్తానని చెప్పి, కొన్ని కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ భారీగా వసూళ్లు చేశారు.

మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనా రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు మాత్రం ఇంకా విడుదల కాలేదు. గతేడాది అక్టోబరు 26న ఈ పరీక్షలు నిర్వహించగా, నవంబరు 14 నుంచి మూల్యాంకనం ప్రారంభించి, ముగించారు.


కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

కృష్ణలంక, జనవరి 24 : ఎన్నికల విధులపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని, ప్రతి దశలోను అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్వో, ఏఆర్వో, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్ఎంటీ)లకు శిక్షణ కార్యక్రమాన్ని జేసీ పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులపై అధికారులు స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవడం ద్వారా బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించవచ్చన్నారు. పోలింగ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ వేదికలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరళమైన భాషలో అత్యంత నాణ్యమైన శిక్షణను పీవోలు, ఏపీవోలు తదితరులకు అందించాలని ఏఎల్ఎంటీలకు కలెక్టర్ సూచించారు. జేసీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల నిర్వహణకు నిబద్ధత, అవగాహన తప్పనిసరన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ బాలకృష్ణారెడ్డి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు పి.సాయిబాబు, కె.మాధవి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పైకి నవ్వులు.. లోన కత్తులు!

(5వ పేజీ తరువాయి)

శర్వాణిమూర్తి, లక్ష్మీపతి గైర్హాజరయ్యారు. ఇద్దరు డివిజన్ ఇన్‌చార్జులు కూడా గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. తనకు సహకరించాలని, ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నట్లు తెలిసింది.

జోగికి గ్రూపుల సెగ

పెనమలూరు నియోజకవర్గంలో జోగి రమేశ్‌కు గ్రూపుల సెగ తగులుతోంది. సారథి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఓ వెలుగు వెలిగిన 'హనుమంతు' ఇప్పుడు జోగి రమేశ్ వెనకాల చేరారు. సారథిపై అవినీతి ముద్ర పడటంలో హనుమంతుడే ప్రధాన పాత్ర. తన, మన లేకుండా సారథి హయాంలో ఎడాపెడా వసూళ్లకు తెగబడి, వైసీపీలో మిగిలిన వారందరినీ పక్కకు నెట్టేసి ఆధిపత్యం చెలాయించిన హనుమంతుడు తాజాగా జోగి దగ్గర కూడా అదే తరహా రాజకీయం చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇప్పటికే విసిగిపోయిన వైసీపీ శ్రేణులు మంగళవారం సాక్షాత్తూ మంత్రి జోగి ఎదుటే హనుమంతుపై తిరగబడ్డారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో మంగళవారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాడిగడప మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌ను ఆహ్వానించలేదు. హనుమంతు ఉద్దేశపూర్వకంగానే శ్రావణ్‌ను పిలవలేదంటూ మంత్రి ఎదుటే పోరంకికి చెందిన వైసీపీ నాయకులు హనుమంతును ప్రశ్నించారు. ఈ వివాదం చినికిచినికి గాలివానగా మారి ఇరువర్గాలు బూతులు తిట్టుకునే దాకా వెళ్లింది. దీంతో జోగి అర్ధంతరంగా కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు.

పచ్చని కుటుంబాలపై మద్యం కాటు!

(5వ పేజీ తరువాయి)

ఫుల్‌గా మద్యం సేవించి లారీ, ప్రైవేటు బస్సు డ్రైవర్లు అనేక ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

మానసిక రోగులవుతున్న మద్యం బాధితులు

నాణ్యతా ప్రమాణాలు లేని జె-బ్రాండ్ కల్తీ మద్యంతో మందుబాబులు మానసిక రోగులుగా మారుతున్నారు. మద్యం తాగకుంటే ఉండలేకపోతున్నారు. బానిసలుగా మారి మానవ సంబంధాలకు సైతం విలువ ఇవ్వడం లేదు. మద్యం తాగేందుకు డబ్బుల కోసం కన్న తల్లిదండ్రులపై దాడులు చేసిన సంఘటనలు కోకొల్లలు. భార్యాభర్తలు గొడవలు పడి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. కల్తీ మద్యంతో సేవించి మతిభ్రమించి రహదారులు వెంబడి పడిపోతున్నారు.

లివర్, గుండె, నరాల రోగాలతో మృతి

జె-బ్రాండ్ మద్యంతో మందుబాబులు అనేక రోగాల బారినపడి మృతి చెందిన సంఘటనలు ఇటీవల నియోజకవర్గంలో పదుల సంఖ్యలో చోటుచేసుకున్నాయి. అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ముఖ్యంగా లివర్, గుండె సంబంధిత వ్యాధులతోనే ఎక్కువగా మరణాలు చోటుచేసుకుంటున్నాయని వైద్యులు తెలుపుతున్నారు. నరాల బలహీనత వచ్చి కనీసం నడవలేని స్థితిలోకి నెట్టబడుతున్నారు.

ఈ దారుణాలకు కారకులెవరు?

- ఏడాది క్రితం అత్తారింటికి పండుగకు ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వచ్చిన అల్లుడు ప్రభుత్వ మద్యం దుకాణంలో ఫుల్‌గా మద్యం సేవించి గుండె ఆగి ప్రాణాలు విడిచిన సంఘటన గుడివాడ మండలం పాత మల్లాయిపాలెం వద్ద గల బస్టాప్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆ కుటుంబం రోడ్డున పడింది.
- ఈ నెల 16వ తేదీన కనుమ రోజున జె-బ్రాండ్ మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మల్లాయిపాలేనికి చెందిన యువకుడు ఆకస్మిక మృతి చెందిన ఘటన ఆ కుటుంబాన్ని కలవరపాటుకు గురి చేసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులకు బాసటగా ఉన్న కుమారుడిని కోల్పోవడంతో కన్నీటిపర్యాంతం అవుతున్నారు.
- తల్లిదండ్రులు మద్యానికి బానిసైన యువకునికి వివాహం చేయలేదనే నెపంతో మద్యం మత్తులో యువకుడు పీక కోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుడివాడలో సంచలనం రేకెత్తించింది.
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఫుల్‌గా మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి ఫైన్ వేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కాకర్ల వీధిలో చోటుచేసుకుంది. దీంతో కుటుంబం రోడ్డున పడి ఆర్థికంగా చితికిపోయారు.
- 25 ఏళ్లు కూడా నిండని యువకుడు మద్యానికి బానిసై గుండెపోటుతో మృతి చెందిన ఘటన పట్టణ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ చేతికందిన కొడుకు మరణం వారిని కలిచివేసింది. తీవ్ర మనస్తాపానికి గురైన తల్లిదండ్రులు కుమారుని జ్ఞాపకాలతో సతమతమవుతూ ఇక్కడ ఉండలేక విజయవాడ వలస వెళ్లిపోయారు. ఇలా వెలుగులోకొచ్చిన ఘటనలు కొన్నే. జె-బ్రాండ్ మద్యానికి బానిసలై రోడ్డు కుటుంబాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతూ బతుకీడుస్తున్నాయి. విచ్చలవిడిగా మద్యాన్ని ధారబోస్తున్న ప్రభుత్వం ఈ దారుణాలకు కారణం కాదా? ఇప్పటికైనా గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మద్యపాన నిషేధం అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదమ్ముల అనుబంధం

- ఇరువురికీ నగరంలో పోస్టింగ్
- చర్చనీయాంశంగా ఎన్టీఆర్‌జిల్లా పోలీసు శాఖలో బదిలీలు

విజయవాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డి.దుర్గాశేఖర్‌రెడ్డి.. డీకేఎన్ మోహన్‌రెడ్డి పేర్లు చూస్తుంటే చాలా దగ్గర సంబంధం ఉన్నట్టు కనిపిస్తాయి. పేర్లలోనే కాదు అనుబంధంలోనూ సంబంధం ఉంది. దుర్గాశేఖర్‌రెడ్డికి తాజాగా జరిగిన బదిలీల్లో వన్‌టౌన్ పోస్టింగ్ ఇచ్చారు. మోహన్‌రెడ్డిని పటమటలో కూర్చోబెట్టారు. దుర్గాశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి సొంత అన్నదమ్ములు. శేఖర్‌రెడ్డి.. మోహన్‌రెడ్డికి పెద్ద అన్నయ్య. ఆయన ఏలూరు రేంజ్ నుంచి పోలీసు కమిషనరేట్‌కు కొద్దిరోజుల క్రితం వచ్చారు. మోహన్‌రెడ్డి మాత్రం కొన్ని సంవత్సరాలుగా పోలీసు కమిషనరేట్‌లోనే పనిచేస్తున్నారు. సొంత అన్నదమ్ములు ఇద్దరికీ విజయవాడలో శాంతిభద్రతల స్టేషన్లు కేటాయించడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది. మోహన్‌రెడ్డి సర్వీసు దాదాపుగా పోలీసు కమిషనరేట్‌లోనే సాగింది. ఆయన ఇంతకుముందు భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. తర్వాత కొన్నాళ్లు స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి, డీజీపీ కార్యాలయానికి వెళ్లిపోయారు. గడచిన ఏడాది డీజీపీ కార్యాలయం నుంచి తిరిగి కమిషనరేట్‌కు వచ్చారు. ఆయన నేరుగా డీజీపీ కార్యాలయం నుంచి సిఫార్సు చేయించుకుని మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లారు. ప్రస్తుతం అక్కడి నుంచి పటమటకు బదిలీ అయ్యారు. ఆయన సోదరుడు దుర్గాశేఖర్‌రెడ్డి ఏలూరు రేంజ్ నుంచి కమిషనరేట్‌కు కొద్దిరోజుల క్రితం వచ్చారు. సోదరుడికి శాంతిభద్రతల స్టేషన్ ఇస్తున్నందున తనకూ అదేవిధంగా పోస్టింగ్ కావాలని పట్టుబట్టారు. దీనికి కమిషనరేట్ అధికారులు అంగీకరించలేదు. తనకు ఇక శాంతిభద్రతల స్టేషన్ దక్కదని భావించిన దుర్గాశేఖర్‌రెడ్డి సోదరుడు మోహన్‌రెడ్డితో చక్రం తిప్పించారు. ఈ పంచాయితీని నేరుగా డీజీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఓ ఉన్నతాధికారి సిఫార్సులతో అన్నదమ్ములు ఇద్దరూ శాంతిభద్రతల స్టేషన్లలో కూర్చోవడానికి సిద్ధమయ్యారు. ఈ విషయం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

విజయవాడలో ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ ప్రదర్శన

విజయవాడ, జనవరి 24 : దక్షిణ భారతదేశ సంప్రదాయ నగల తయారీ సంస్థ 'ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్' విజయవాడలో నగల ప్రదర్శన ఏర్పాటు చేసింది. లెమన్ ట్రీ ప్రీమియర్‌లోని టాంగెరైన్ హాల్స్ 1, 2లలో బుధవారం ప్రదర్శనను ప్రారంభించారు. గురువారం కూడా ప్రదర్శన కొనసాగుతుందని సంస్థ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఉమ్మిడి తెలిపారు. ఆభరణాల రంగంలో తమ సంస్థకు 123 ఏళ్ల ఘన వారసత్వం ఉందని చెప్పారు. ప్రత్యేకంగా రూపొందించిన బంగారు ఆభరణాలు, శోభాయమానమైన వెండి వస్తువులు, అందరి దృష్టినీ ఆకర్షించే ట్రెండీ జ్యువెలరీ ఈ ప్రదర్శనలో ఉంచినట్టు వివరించారు. ఆభరణాలను చెన్నైలోని తమ క్రియేటివ్ సెంటర్‌లో ప్రత్యేక డిజైన్లలో, ప్రత్యేక శ్రద్ధ, సాంప్రదాయక మెళకువలు, గరిష్ఠ ప్రామాణికత, అత్యధిక నాణ్యతతో తీర్చిదిద్దినట్టు తెలిపారు. లక్ష్మీ హారాలు, నెమలి హారాలు సహా వైవిధ్యభరితమైన వివాహ ఆభరణాలు, పెళ్లికూతురి కోసం వజ్రాలు పొదిగిన బంగారు ఆభరణాలను శోభాయమానంగా, అత్యాధునికంగా తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. విభిన్న మోడళ్లలో రూపొందించిన నక్లెస్‌లు, చెవి రింగులు, దుద్దులు, ముక్కు పుడకల ప్రత్యేకతలను సందర్శకులకు తమ సిబ్బంది వివరిస్తారని తెలిపారు.

టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కమిటీలో సభ్యుల నియామకం

మచిలీపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్రకమిటీలో కృష్ణాజిల్లాకు చెందిన ఇద్దరికి స్థానం కల్పిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కర్రా సుధాకర్‌ను అఫిషియల్ స్పోక్స్ పర్సన్‌గా, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఊసా వెంకటేశ్వరరావును ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు.

మార్చి 9న లోక్‌అదాలత్

మచిలీపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీ పడదగిన అన్ని రకాల కేసులను ఈ కార్యక్రమంలో పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, న్యాయవాదులు సహకరించి లోక్‌అదాలత్‌లో అధికంగా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ టికెట్‌కు డీవై దాస్ దరఖాస్తు


పామర్రు : పామర్రు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశం కల్పించాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డీవైదాస్ నేతలకు దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఏపీ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మాణిక్యఠాగూర్, కేవీపీ రామచంద్రరావులకు దరఖాస్తును అందజేశారు. ఈసందర్భంగా విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, పామర్రు ప్రజల అభీష్టం మేరకు తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 24 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అయోధ్యనగర్ ప్రాంతానికి చెందిన ఘనిశెట్టి సునీత ఇంట్లో చీరల వ్యాపారం చేస్తుంటుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పరిచయస్తుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చింది. ఇంటికి వేసిన తాళం పగులకొట్టడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో తన ఇంట్లో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూ. 10 వేలు నగదు, ఏడు గ్రాముల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాలో లోపం లేకుండా చూడండి

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్



నీటి శుద్ధిని పరిశీలిస్తున్న నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

విద్యాధరపురం, జనవరి 24: ప్రజలకు తాగునీరు అందించే విషయంలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని విజయవాడ నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా బుధవారం కమిషనర్ 38వ డివిజన్ విద్యాధరపురంలోని కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌లో జరుగుతున్న నీటి శుద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కృష్ణానది నుంచి వచ్చే నీటిలో ఆల్గే ఎక్కువగా ఉండడం వలన, నీటిని శుభ్రపరిచే ఫిల్టర్ బెడ్స్‌ను తరచూ పరిశుభ్రపరచి శుద్ధి చేయవల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఫిల్టరేషన్ బెడ్స్‌ను శుభ్రపరిచే క్రమంలో అవసరమైతే లేబర్ని పెంచాలని ఆయన ఆదేశించారు. నగర పౌరులకు తాగునీరు అందించే క్రమంలో ఎటువంటి లోపం లేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, ఎస్ఈ (ప్రాజెక్ట్) రామ్‌మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ మూర్తి తదితరులు ఉన్నారు.

కండ్రిక జంక్షన్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

పాయకాపురం: పాయకాపురం శివారుల్లోని కండ్రిక జంక్షన్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కమిషనర్ వివిధ శాఖల అధికారులతో కలిసి కండ్రిక జంక్షన్‌ను పరిశీలించారు. జంక్షన్ సుందరంగా తీర్చిదిద్దేందుకు అంచనాలు రూపొందించి త్వరితగతిన నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బొప్పన పుట్టినరోజు వేడుకలు



భవకుమార్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న గద్దె రామ్మోహన్, కేశినేని చిన్ని తదితరులు

పటమట, జనవరి 24 : త్వరలో టీడీపీలో చేరనున్న బొప్పన భవకుమార్ పుట్టినరోజు వేడుకలు బెంజిసర్కిల్ వద్ద ఆయన కార్యాలయంలో ఆయన అభిమానులు, టీడీపీ జనసేన శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్,టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్, గన్నే వెంకట నారాయణ, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, రావి సౌజన్య, గాదిరెడ్డి అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

బొప్పన భవకుమార్ రాజకీయ జీవితం జయప్రదంగా ముందుకు సాగాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు భవిష్యత్తులో మరిన్ని జరుపుకోవాలని ముఖ్య అతిథులు ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజీవ్‌నగర్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

పాయకాపురం, జనవరి 24 : పాయకాపురం రాజీవ్‌నగర్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు మాట్లాడుతూ అజిత్‌సింగ్‌నగర్ మంచినీటి విభాగం అధికారులు మంచినీటి సరఫరాను పూర్తిగా గాలికి వదిలేశారని అన్నారు. రోజూ ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర సమయం మంచినీటి సరఫరా చేయాల్సి ఉండగా పట్టుమని పది నిమిషాలు కూడా సరఫరా అయ్యే పరిస్థితి లేదన్నారు. మంచినీరు ఇవ్వలేని పరిస్థితిలో కనీసం మంచినీటి ట్యాంకర్లనైనా పంపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆ దిశగా కూడా చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సీట్ల కేటాయింపుపై దృష్టి పెట్టిందన్నారు. నేతలు కె. దుర్గారావు, రమణారావు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏఈ అరుణ్‌కుమార్‌ను నిలదీస్తున్న స్థానిక మహిళలు

● ఏఈ అరుణ్‌కుమార్‌ను నిలదీసిన మహిళలు

స్థానికంగా మంచినీటి సమస్యపై సీపీఎం నేతల సమాచారంతో రాజీవ్‌నగర్ వచ్చిన మంచినీటి విభాగం ఏఈ అరుణ్‌కుమార్‌ను సిబ్బందిని స్థానికులు నిలదీశారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మరమ్మతులు జరుగుతున్నాయని ఏఈ నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా మరి ప్రత్యామ్నాయం ఎందుకు చూడలేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఏఈ, సిబ్బంది అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు.

ఘనంగా కర్పూరీ ఠాగూర్ జయంతి వేడుకలు



కర్పూరీ ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

విద్యాధరపురం, జనవరి 24: బీసీ జన నాయక్, బిహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాగూర్ 100వ జయంతి వేడుకలు టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ కర్పూరీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బీసీల పక్షపాతి అని, పార్టీ పరంగా బీసీలందరూ ఠాగూర్‌కు నివాళులర్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు సింహాద్రి కనకాచారి, పి. కిషోర్‌బాబు, బి.వెంకటేశ్వరరావు, బత్తుల దుర్గారావు, పి.దుర్గాప్రసాద్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

పరిటాల రవికి ఘన నివాళి

టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మాజీ మంత్రి పరిటాల రవి 19వ వర్ధంతి కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతలపాటి నాగభూషణం పాల్గొని పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బాజీ షరీఫ్, ముఖేష్, ప్రవీణ్, ఖాజా, బాజీ, ఖాసీం పాల్గొన్నారు.



ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న చిన్నసుబ్బయ్య

27న మెగా మెడికల్ క్యాంప్

విద్యాధరపురం, జనవరి 24: కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ కేశినేని శివనాథ్ (చిన్ని) సారథ్యంలో ఈ నెల 27న భవానీపురం షాదీఖానాలో ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి చిన్నసుబ్బయ్య తెలిపారు. మెడికల్ క్యాంపు కరపత్రాలను బుధవారం ఆయన డివిజన్ నాయకులతో కలిసి స్థానికులకు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు బాలభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 24 : ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అయోధ్యనగర్, బసవతారక్ నగర్‌కు చెందిన కోమరోబత్తిన విజయలాల్(43) బలాపురం వద్ద మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి మెడికల్ షాపు నుంచి ఇంటికి వచ్చాడు. ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. తెల్లవారుజామున భార్య లేచి చూసేసరికి విజయలాల్ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే మృతుడు మెడికల్ షాపు నిర్వహణలో అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రికానాయుడును అభినందిస్తున్న డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు తదితరులు

చంద్రికానాయుడుకు అభినందనలు

మొగల్రాజపురం, జనవరి 24: పుమ్‌సే విభాగంలో జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో కాంస్యపతకం సాధించిన విద్యార్థిని వై. చంద్రికానాయుడు మరింత ప్రతిభతో మరిన్ని పతకాలు సాధించాలని శ్రీ చైతన్య కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ క్యాంపస్ డీన్ హరిబాబు అన్నారు. చుట్టుగుంటలో ఉన్న పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యత సాధించాలని చెప్పారు. చంద్రికా నాయుడు, ఆమె తల్లిదండ్రులు, కోచ్‌ల బృందాన్ని అభినందించారు. ప్రిన్సిపాల్ గోకర్ణేశ్వరరావు, కోచ్‌లు అంకమ్మరావు, గౌరీ శంకర్, వైస్‌ప్రిన్సిపాల్ నీలిమ, అధ్యాపకులు పాల్గొన్నారు.



సీవీఆర్ స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

గవర్నర్‌పేట, జనవరి 24: సివిల్ కోర్టుల సమీపంలోని సీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి బుధవారం 8వ తరగతి చదువుతున్న 31 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్యాబ్‌లను అందజేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు చింతా దుర్గారావు, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు నెహ్రూ, ఇంతిరాజు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

పాయకాపురం, జనవరి 24: అనుమతి లేకుండా అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని నున్న పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నున్న పోలీస్ స్టేషన్ సీఐ సమాచారం మేరకు ఎస్సై గోవింద్ బృందం న్యూరాజీవ్ నగర్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ దగ్గర, ఉడా కాలనీ కట్ట చేరుకుంది. సింగ్‌నగర్‌కు చెందిన కొనా గిరీష్ బాబు మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. గిరీష్ బాబును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 192 ఆఫ్ బాటిళ్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యాన్ని తరలిస్తున్న గిరీష్ బాబుపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గవర్నరుపేట-1 డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్

బస్టేషన్, జనవరి 24: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, భద్రతా ప్రమాణాలు పాటించే దిశగా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించడానికి డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గవర్నరుపేట-1 డిపో మేనేజర్ కే.బసవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం గవర్నరుపేట-1 డిపో పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య జరుగుతుందని చెప్పారు. వినియోగదారులు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను 9959225455 నెంబర్‌కు డయల్ చేసి తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమలో మద్దతు కోరుతూ ఆత్మీయ సమ్మేళనం నేడు

భవానీపురం, జనవరి 24 : పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల మద్దతు కోరుతూ గురువారం విద్యాధరపురం ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంకు హాజరు కావాలని వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పార్టీ శ్రేణులను కోరారు. స్థానికంగా ఎన్ కన్వెన్షన్‌లో మేయర్ భాగ్యలక్ష్మి, ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నియోజకవర్గాల్లో వైసీపీని అధిక మెజార్టీతో గెలిపిస్తామని మేయర్ భాగ్యలక్ష్మి అన్నారు.

గవర్నరుపేట సీఐగా రమణ బాధ్యతల స్వీకరణ



రమణకు మొక్క బహూకరిస్తున్న సోమయ్య

వన్‌టౌన్, జనవరి 24: గవర్నరుపేట సీఐగా డి.వి రమణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు సోమయ్య, స్టేషన్ సిబ్బంది సీఐని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహూకరించి అభినందించారు. త్రీ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు నిర్వహించిన డి.వి రమణ గవర్నరుపేట స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా పనిచేసిన అడపా నాగమురళీ తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

వన్‌టౌన్ సీఐగా శేఖర్‌రెడ్డి

వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఏలూరు రేంజ్ నుంచి బదిలీ అయిన శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్‌రెడ్డిని నగర పోలీసుకమిషనర్ కాంతి రాణా విజయవాడ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్లు తెలిసింది. ఏలూరు రేంజ్ నుంచి బదిలీ అయిన శేఖర్‌రెడ్డి వన్‌టౌన్ సీఐగా రెండ్రోజులలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.



నున్న సీఐగా ఎన్. దుర్గాప్రసాద్

పాయకాపురం : నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐగా ఎన్. దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్‌కు వచ్చి విధులకు హాజరైన నూతన సీఐ సిబ్బందితో మాట్లాడి స్టేషన్ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఏలూరు రేంజ్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై నున్న పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో నేతలు విఫలం : పోతిన మహేశ్

చిట్టినగర్, జనవరి 24: చిట్టినగర్ టేనర్‌పేట కొండ ప్రాంతంలో స్థానికులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని ఆ సమస్యను పరిష్కరించడంలో అధికార పార్టీ నాయకులు, అధికారులు విఫలమయ్యారని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. ఇంటింటికి రాబోయే మన జనసేన- టీడీపీ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోతిన మహేశ్ డివిజన్ సమన్వయకర్తలతో కలిసి బుధవారం 47వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్టీ నాయకులు మల్లెపు విజయలక్ష్మి, కే.వెంకటేశ్వరరావు, వ్యాపార వాసు, విశ్వ, బి.రాంబాబు, పి.శ్రీనివాసరావు, ఎస్.గోవింద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో అందజేత



కృష్ణలంక, జనవరి 24 : మైలవరం మండలం, వెల్వడం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రోడ్డుప్రమాదంలో మృతిచెందిన మందలపు సరితా రాణి కుటుంబసభ్యులకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియోను అందించారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ కలయికను స్వాగతిస్తున్న ప్రజలు : బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 24: టీడీపీ, జనసేన పార్టీల కలయికను రాష్ట్ర ప్రజానీకం స్వాగతిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా బాడిత శంకర్ నియమితు డ య్యాడు. ఈ సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం ఆయన బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సమస్యలు తక్షణం పరిష్కారమయ్యేలా చూస్తా

కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి



లీకేజీలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

సత్యనారాయణపురం, జనవరి 24: డివిజన్‌లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే తక్షణం పరిష్కారం అయ్యేలా చూస్తానని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి అన్నారు. 30 డివిజన్ రామకృష్ణాపురంలో బుధవారం ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్ధం రాజు వీధిలో యూజీడీ లీకులతో ఇబ్బందులు పడుతున్నామని, దోమలు అధికంగా ఉన్నాయని వాటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే లీకులను సరిచేయించారు. స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాల పంపిణీ

భవానీపురం, జనవరి 24 : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాత్రి 43వ డివిజన్ ఊర్మిళానగర్ పార్కు సెంటర్ వద్ద డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. యువ నాయకుల కె.రవీంద్ర, రాయన్ కిషోర్, శాలిల పాపారావు, బొప్పరాజు చెన్నయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం 11కేవీ కళానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. నాంగేంద్ర నగర్, 10ఎంజీడీ రోడ్, కళానగర్, ఎలినమ్మ హోటల్ ప్రాంతం, పూర్ణచంద్రనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 25 జనవరి 2024
cinema@andhrajyothy.com

రాజ్‌తరుణ్ పురుషోత్తముడు



రాజ్‌తరుణ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకుడు. డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మాతలు. హాసినీ సుధీర్ కథానాయికగా పరిచయం అవుతోంది. ఇటీవల ఈ చిత్రం టైటిల్ రివీల్ పోస్టర్‌ని చిత్ర బృందం విడుదల చేశారు. భారీ తారాగణంతో భారీ ఎత్తున నిర్మిస్తున్న సినిమా ఇదని, సంగీతదర్శకుడు గోపీసుందర్ స్వరపరిచిన పాటలు శ్రోతల్ని ఉర్రూతలూగిస్తాయని నిర్మాతలు చెప్పారు. తన కెరీర్‌లోనే 'పురుషోత్తముడు' గొప్ప సినిమా అవుతుందని డీవోపీ పి.జి.విందా నమ్మకం వ్యక్తం చేశారు. అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇదని దర్శకుడు అన్నారు. ప్రస్తుతం డబ్బింగ్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని మేకర్స్ చెబుతున్నారు. మురళీశర్మ, కౌసల్య, ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణన్, బ్రహ్మానందం తదితరులు ఇందులో ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళం ఇవ్వనున్న రామ్



దేశభక్తి కథాంశంతో రూపొందిన 'రామ్' (ర్యాపిడ్ యాక్షన్ మిషన్) చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్య అయ్యలసోమయాజుల హీరోగా, ధన్య బాలకృష్ణ హీరోయిన్‌గా నటించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో వస్తున్న సినిమా ఇది. నేను కొంత రషెస్ చూశా. ఎన్నో ఇబ్బందులు పడి చిత్రాన్ని తీశారు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. అలాగే ఈ సినిమా కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'దేశభక్తిని చాటి చెప్పే ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది' అన్నారు. 'బోర్డర్‌లో ఉన్న సైనికుల గురించే కాకుండా టెర్రరిస్టుల నుంచి మనల్ని కాపాడే అన్‌సంగ్ హీరోల గురించి కూడా ఈ సినిమాలో చూపించాం. మాకు థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. అయినా మా పంపిణీదారుడు గణేశ్ మంచి థియేటర్ల కోసం ప్రయత్నిస్తున్నారు' అన్నారు దర్శకుడు మిహిరామ్. ఈ సినిమాకు తెగే ప్రతి టికెట్‌లో ఐదు రూపాయలను నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తామని నిర్మాత దీపికాంజలి చెప్పారు.



థగ్‌లైఫ్ షూటింగ్ మొదలైంది..

కమల్‌హాసన్ ఎంత గొప్ప నటుడో అంత స్టార్ కూడా. స్టార్‌గా ఆయన స్టామినాకు 'విక్రమ్' విజయమే నిదర్శనం. 120 కోట్ల నిర్మాణ వ్యయంతో రూపొందిన 'విక్రమ్' దాదాపు 500కోట్ల వసూళ్లను రాబట్టింది. త్వరలో 'భారతీయుడు2'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు కమల్. ఇక ఆయన రీసెంట్‌గా ఓకే చేసిన క్రేజీ ప్రాజెక్ట్ 'థగ్‌లైఫ్'. మణిరత్నం ఈ సినిమాకు దర్శకుడు. 36ఏళ్ల క్రితం కమల్, మణిరత్నం కలయికలో వచ్చిన 'నాయకుడు' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. సదరన్ టాప్ 10 కల్ట్‌మూవీస్‌లో అగ్రస్థానంలో 'నాయకుడు' ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కమల్, మణిరత్నం చేతులు కలిపారు. అనౌన్స్‌మెంట్‌తోనే దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్ చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. బుధవారం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ ఓ వీడియోను విడుదల చేశారు. దుల్కర్‌సల్మాన్, జయంరవి, గౌతం కార్తీక్, జోజు జార్జ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి ఇందులో ప్రధాన పాత్రలు పోషించనున్నట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అంచనాలున్న ఈ చిత్రాన్ని మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్‌తో కలిసి కమల్‌హాసన్ నిర్మిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ సమర్పకుడు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు



మొన్న జరిగిన అయోధ్య సంబరంలో కంగనా రనౌత్ చేసిన హడావిడీ అంతా ఇంతా కాదు. 'జై శ్రీరామ్.. జై శ్రీరామ్' అంటూ గొంతు పోయేలా నినాదాలు చేశారు కంగనా. తద్వారా రామచంద్ర మూర్తిపై తనకున్న భక్తివిశ్వాసాలను తెలియజేశారు. అంతాబాగానే ఉంది. ఈ వేడుకకు కంగనాతోపాటు 'ఈజ్ మై ట్రిప్' వ్యవస్థాపకుల్లో ఒకరైన నిషాంత్ పిట్టి కూడా హాజరయ్యారు. ఇద్దరూ కలిసి అయోధ్య రామమందిరం ఎదురుగా ఫొటోలకు ఫోజులు కూడా ఇచ్చారు. అక్కడే అసలు చిక్కు వచ్చి పడింది. ఈ ఫొటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవ్వడంతోపాటు.. నిషాంత్, కంగనా రిలేషన్‌లో ఉన్నారంటూ వదంతులు కూడా సాంఘిక మాధ్యమంలో వ్యాపించాయి. దాంతో ఖంగు తిన్న కంగనా... ఆలస్యం చేయకుండా వివరణ ఇచ్చేశారు. 'దయచేసి ఇలాంటి అసత్య ప్రచారాలను నమ్మొద్దు. కలిసి ఫొటోలు దిగితే రిలేషన్‌లో ఉన్నట్టేనా? బుద్ధిలేకుండా ఎందుకు ఇలాంటి ప్రచారాలు చేస్తారు? నిషాంత్‌కి పెళ్లయింది. అతనికి ఓ కుటుంబం ఉంది. అతని వైవాహిక జీవితం చాలా ఆనందంగా ఉంది. నేను ఇప్పటికే ఓ వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నాను. అతనెవరో, అతని వివరాలేంటో త్వరలోనే చెబుతాను. మంచి వార్త కోసం వెయిట్ చేయండి. ఇలాంటి పిచ్చి వార్తలు రాసి మమ్మల్ని విసిగించకండి' అంటూ మండిపడ్డారు.



నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ

సుహాస్

సుహాస్ హీరోగా రూపొందిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'కొన్ని రియలిస్టిక్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ సినిమాను రూపొందించాం. లవ్ స్టోరీతో పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. ఊరిలో జరిగే కథ కనుక కులాల ప్రస్తావన ఉంటుంది. అయితే ఎవరినీ కించేపరిచే అంశాలు ఇందులో ఉండవు. సినిమాను మీరే సూపర్ హిట్ చేయాలి. సినిమా మేకింగ్‌లో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అన్నారు. 'నేను నిర్మాతగా మీ ముందు నిలబడడానికి అల్లు అరవింద్, బన్నీ వాస్‌గార్లు కారణం. సినిమా కనుక తీస్తే హిట్ మూవీనే తీయాలని అనుకున్నాను. ఈ చిత్రకథ వినగానే బన్నీ వాసుగారు చాలా ఎగ్జైట్ అయ్యారు. సుహాస్ కూడా చాలా ఇన్వాల్వ్ అయ్యాడు. ఈ సినిమా కోసం రెండు సార్లు గుండు చేయించుకున్నాడు. హీరోయిన్ శివానీ, శరణ్య ప్రదీప్ తదితరులు అద్భుతంగా నటించారు. మా ఛాయాగ్రాహకుడు వాజిద్ అమలాపురం ప్రాంతాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మంచి ట్యూన్స్ ఇచ్చారు. సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. మా సంస్థ ద్వారా చాలా చిత్రాలు రానున్నాయి. అరవింద్‌గారి పేరు నిలబెట్టాలా ప్రతి సినిమాకూ కష్టపడతాం' అన్నారు నిర్మాత ధీరజ్. చివరిగా హీరో సుహాస్ మాట్లాడుతూ 'నిన్ననే నాకు బాబు పుట్టాడు. ఆ హ్యాపీలో ఉన్నా. అలాగే ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నా. నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ. కథ మీద నమ్మకంతో చాలా కనెక్ట్ అయి వర్క్ చేశా. సినిమా చూస్తున్నప్పుడు మీ జీవితంలో జరిగిన సందర్భాలను గుర్తు చేసుకుంటారు' అన్నారు.

కాన్సెప్ట్ నచ్చి సినిమా తీశా


బొమ్మకు శివ



హన్సిక హీరోయిన్‌గా రూపుదిద్దుకున్న '105 మినిట్స్' చిత్రం ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత బొమ్మకు శివ బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'సినిమాలంటే నాకు ప్యాషన్. ఎప్పటినుంచో సినిమా తీయాలనే కోరిక ఉంది. అది ఈ సినిమాతో తీరింది. దర్శకుడు రాజు ఏడాది నుంచి నాతో ట్రావెల్ అవుతున్నాడు. అతను ఈ కథ గురించి చెప్పగానే అదే సినిమా తీయాలనుకున్నాను' అన్నారు. మొదట హీరోయిన్‌గా వేరొకరిని అనుకున్నామనీ, అయితే ఈ కథ హన్సికకు సూట్ అవుతుందని ఆమెను ఎప్రోచ్ అయ్యామనీ, తను కూడా పాజిటివ్‌గా రియాక్ట్ అయ్యారని నిర్మాత శివ చెప్పారు. 'సింగిల్ ఆర్టిస్ట్, సింగిల్ టేక్ అనే కాన్సెప్ట్ చాలా కొత్తగా అనిపించింది. నార్మల్‌గా షూట్‌కి 20 రోజులు పడితే, దాన్ని ప్రాక్టీసు చేసుకుని చిత్రీకరించడానికి 45 రోజులు పట్టింది. సినిమా మొత్తం ఒకే పాత్ర కనిపిస్తుంది. కానీ ఇంకో వాయిస్ వినిపిస్తుంది. ఆ వాయిస్ కూడా ఓ పాన్ ఇండియా నటుడిది, ఈ సినిమాకు రూ 3 కోట్లు బడ్జెట్ అనుకున్నాం. కానీ మూడున్నర కోట్లు అయింది' అని తెలిపారు శివ.

జాలీ రైడ్‌కు వెళ్లిన అనుభూతి కలుగుతుంది

శివ కార్తికేయన్



శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా రూపొందిన 'అయలాన్' చిత్రం ఈ నెల 12న సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో విడుదలై విజయం సాధించింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 26న గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా మహేశ్వర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో బుధవారం కార్తికేయన్ ముచ్చటించారు

- దర్శకుడు రవికుమార్ విజన్ 'అయలాన్'. సినిమాలో 4500 వి.ఎఫ్.ఎక్స్ షాట్స్ ఉన్నాయి. పరిమిత నిర్మాణ వ్యయంతో సినిమా తీయగలిగితే మరింత పెద్ద కలలు కనవచ్చు.. అనిపించింది. అందుకే ఎక్కువ రోజులు పట్టినా ఈ సినిమానే చేయాలని నిర్ణయించుకున్నా.
- యూనివర్సల్ కాన్సెప్ట్ ఉన్న చిత్రమిది. హ్యూమన్, ఏలియన్ మధ్య ఇంటరాక్షన్ అన్ని ప్రాంతాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఇది సినిమాలా ఉండదు. థీమ్ పార్క్‌లోకి వెళ్లి జాలీ రైడ్ చేసిన అనుభూతి కలిగిస్తుంది. మా సినిమా తమిళనాడులో భారీ విజయం సాధించింది. తెలుగులో కూడా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది.
- రూ. 200, 300 కోట్ల బడ్జెట్ ఉంటే తప్ప ఇటువంటి సినిమా చేయలేమని చెబుతారు. అయితే సరైన టీమ్, ప్లానింగ్ ఉంటే తక్కువ బడ్జెట్‌లో కూడా తీయవచ్చు. ఇది హిట్ అయితే ఎక్కువ బడ్జెట్ ఇవ్వడానికి నిర్మాతలు ముందుకు వస్తారు. మమ్మల్ని మోటివేట్ చేసిన అంశం ఇదే.
- అయలాన్‌లో 90 శాతం సన్నివేశాల్లో గ్రాఫిక్స్ ఉన్నాయి. 70 శాతం సినిమాలో ఏలియన్ ఉంది. సో మెజారిటీ సినిమా అంతా విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయి.
- ఈ సినిమాకు సీక్వెల్ ఐడియా ఉంది. ఏలియన్‌ను క్రియేట్ చేయడానికి మేం చాలా రిసెర్చ్ చేశాం. ఎక్కువ టైమ్ స్పెండ్ చేశాం. సీక్వెల్‌ను ఇంతకంటే బిగ్గర్ స్కేల్‌లో చేస్తాం.
- కమల్‌హాసన్ గారి చిత్రం 80 శాతం పూర్తయింది. ఇందులో నేను, సాయిపల్లవి కలసి నటిస్తున్నాం. ఏ తరహా చిత్రం అనేది ఇప్పుడు చెప్పను. వేసవిలో విడుదల కావచ్చు.

ఫిబ్రవరిలో ముఖ్యగమనిక

విరాన్ ముత్తంశెట్టి హీరోగా నటిస్తున్న చిత్రం 'ముఖ్యగమనిక'. లావణ్య ఇందులో కథానాయిక. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడు. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. నిర్మాతలు మాట్లాడుతూ 'ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్‌కి, టీజర్‌కీ మంచి స్పందన వస్తోంది. సినిమా అంతకు మించి ఉంటుంది. ఫిబ్రవరి మొదటివారంలో ట్రైలర్‌ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నాం. ప్రముఖ సెలబ్రిటీ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే నెల మూడోవారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కిరణ్ వెన్న.



నవ్య
కుటుంబ కదంబం
గురువారం
25 జనవరి 2024



ఆరోగ్యం ఆహారంలోనే...

80 శాతం ఆరోగ్యం, మనం తినే ఆహారం మీదే ఆధారపడి ఉంటుంది కాబట్టి పొలం నుంచి ప్లేట్లోకి ఆహారాన్ని చేర్చే బృహత్తర ప్రయత్నానికి పూనుకుంది హైదరాబాద్‌కు చెందిన మాధవి చలసాని. అందుకోసం హెల్త్ కెఫె, మైక్రో బేకరీ, ఫార్మసీలతో కూడిన ఎల్లోలైఫ్ వెల్‌నెస్ సెంటర్‌ను స్థాపించిన మాధవి, నవ్యతో పంచుకున్న విశేషాలు...

ఆరోగ్యంగా ఉండాలనీ, అందుకు ఆరోగ్యంగా తినాలని అనుకుంటాం. కానీ ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం? అనే వాటి మీద దృష్టి పెట్టేవాళ్లు ఎంతో అరుదు. బరువు తగ్గాలని డైటింగ్‌లు చేసేవాళ్లూ, మితంగా తినేవాళ్లూ, ఆ ప్రయత్నాలన్నీ చేసి చివరకు బరువు తగ్గడం లేదనీ, ఇంచ్ లాస్ కావడం లేదనీ దిగాలు పడిపోతూ ఉంటారు. ఉదయాన్నే పరగడుపున గోరువెచ్చని నీళ్లలో తేనె, నిమ్మరసం కలుపుకుని తాగేసి, చక్కెర ఎందుకు విపరీతంగా పెరిగిపోతోందని తలబద్దలు కొట్టుకునే మధుమేహులూ ఉంటారు. కానీ ఇలాంటి జీవనశైలి సమస్యల మూలాలన్నీ మనం తినే ఆహారంలో ఉంటాయనే విషయాన్ని గ్రహించేవాళ్లు తక్కువ. తేనెతో చక్కెర పెరుగుతోందంటే అది కచ్చితంగా కల్తీదై ఉంటుంది. మితంగా తింటున్నా బరువు పెరుగుతున్నామంటే, తినే పదార్థాలు సేంద్రీయమైనవి అయి ఉండకపోవచ్చు. నిజానికి ఇలా పదార్థాల్లోని పోషకాలను విశ్లేషించే తత్వం నాకు అమ్మ నుంచే అలవడిందని చెప్పాలి. చిన్నప్పటి నుంచీ అమ్మ పోషకాలు నష్టపోకుండా కూరలు వండేది. బీరకాయ రసం లాంటివి చేసి ఇస్తూ ఉండేది. చివరకు స్నానం కోసం సున్నిపిండి కూడా స్వయంగా తయారుచేసేది. దాంతో చిన్నతనం నుంచే పోషకాహారం పట్ల ఆసక్తి ఏర్పడింది. అది కాస్తా చెన్నైలో న్యూట్రిషన్‌లో మాస్టర్స్ చేయడానికి ప్రోద్బలంగా మారింది.

కొవిడ్ కాలంలో బీజాలు పడి....

ప్రతి మహిళ జీవితంలో పెళ్లి, పిల్లలు దశలనేవి సహజం. ఆ బాధ్యతలను పూర్తి చేసుకున్న తర్వాతే, చేతి నిండా తీరిక దొరుకుతుంది. అలా నాక్కూడా కాస్త ఆలస్యంగా తీరిక చిక్కింది. కొవిడ్ సమయంలో ఆ తీరికను నాకెంతో ఇష్టమైన పోషకాహారం కోసం కేటాయించాను. ఇమ్యూనిటీని పెంచుకుని, ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం లేని దీర్ఘాయుష్షు కోసం వెంపర్లాట కొవిడ్ సమయంలో మొదలవడం నేను గమనించాను. మునుపెన్నడూ లేని విధంగా ఆరోగ్యాన్ని పెంచుకోవడం కోసం జింక్ మాత్రలు, విటమిన్ సప్లిమెంట్ల మీద ఆపేక్ష పెరిగిపోవడం కూడా గమనించాను. కానీ నిజానికి వీటితో పని లేకుండా ఆహారం ద్వారానే ఆరోగ్యాన్ని పెంపొందించుకునే సౌలభ్యం ఉందని తెలిసిన నాకు, ఆ దిశగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలనే ఆలోచన వచ్చింది. అలాగే పదార్థాలను ఎంచుకోవడంలో మెలకువలను పాటించడం ద్వారా బరువును అదుపులో పెట్టుకోవడానికి సంబంధించి స్నేహితులకు నేనిచ్చిన సలహాలు ఫలించడం కూడా నా ఆలోచనకు దన్నుగా మారింది. అలా అప్పటి నుంచి రెండున్నరేళ్ల పాటు దినుసులూ, అవి ప్రకృతిసిద్ధంగా పండే ప్రాంతాల గురించి మరింత లోతుగా పరిశోధన చేశాను. వాటి గురించి పూర్తి అవగాహన ఏర్పడిన తర్వాత, ఎలాంటి ఎరువులూ ఉపయోగించకుండా పండించిన పంటలను నేరుగా అందరికీ అందించడంతో పాటు, పోషక నష్టానికి ఆస్కారం లేకుండా పదార్థాలను వండి వడ్డించాలని నిర్ణయించుకున్నాను. అలా గత ఏడాది ఏప్రిల్‌లో ఫంక్షనల్ న్యూట్రిషన్‌ను అందించే 'ఎల్లోలైఫ్'ను స్థాపించాను.



మాది కాకినాడ దగ్గరున్న సామర్లకోట. మా వారు భాస్కర్ చలసాని, సెకండ్ జనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్. నాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద బాబు వెంకట్, హార్వర్డ్ యూనివర్శిటీలో మాస్టర్స్ చేశాడు. ఇప్పుడు ఇక్కడే పని చేస్తున్నాడు. చిన్న బాబు అవినాష్ బోస్టన్ యూనివర్శిటీలో చదివి, న్యూయార్క్‌లో మాస్టర్స్ చేస్తున్నాడు.

పసుపుతో మొదలై...

నా పరిశోధనలో భాగంగా శ్రీకాకుళం ప్రాంతంలోని సౌర తెగను కలుసుకున్నప్పుడు, ఎలాంటి ఎరువులూ ఉపయోగించకుండా వాళ్లు పండిస్తున్న పసుపు పంట నా కంట పడింది. అంత మంచి వాసన వేస్తున్న పసుపు పంటను ఏ ఎరువులు వేసి పండిస్తున్నారని అడిగినప్పుడు, 'తినడానికే తిండి లేని మాకు ఎరువులకు డబ్బెక్కడి నుంచి వస్తుంది?' అని వాళ్లు నన్ను ఎదురు ప్రశ్నించారు. ఇక అంతకంటే స్వచ్ఛమైన పసుపు మరెక్కడా దొరకదని గ్రహించి, నా మొట్టమొదటి ఉత్పత్తిగా పసుపుని ఎంచుకున్నాను. అలా పసుపు పదం స్ఫురించేలా బ్రాండ్ నేమ్‌గా ఎల్లోలైఫ్‌ను ఎంచుకున్నాను. అలా పసుపుతో మొదలుపెట్టి, దేశవ్యాప్తంగా ఉన్న 739 జిల్లాలకు చెందిన వేర్వేరు రైతుల నుంచి వేర్వేరు స్వచ్ఛమైన ఉత్పత్తులను సేకరించడం మొదలుపెట్టాను. ఈ ఉత్పత్తులను ఎంచుకునే ముందు, ఆయా పంటలను పండించే నేల ఆరోగ్యాన్ని కూడా పరీక్షించాను. కెఫెలో వడ్డించే ప్రతి పదార్థంలోని ప్రతి దినుసు కల్తీలేనిదీ, ప్రాసెస్ కానిదే! వాటిలోని దినుసులు ఎక్కడి నుంచి ఎలా వచ్చాయో నాకు పూర్తి అవగాహన ఉంటుంది. మైక్రో బేకరీలో మేం అందించే బ్రెడ్‌లో మైదాకు బదులుగా పంజాబ్‌లోని ఒక ప్రాంతం నుంచి సేకరించిన గోధుమలనే ఉపయోగిస్తాం. మోపురాన్ని కలిగి ఉండి, స్వేచ్ఛగా పచ్చికబయళ్లలోని పచ్చికను తినే ఆవుల నుంచే పాలను సేకరించి అందిస్తాం. సాధారణంగా ఆవులకు అదనపు పోషకాలు దక్కడం కోసం సోయా ఉత్పత్తులను మేతగా తినిపిస్తూ ఉంటారు. వీటి పాల ఉత్పత్తులను తీసుకున్న వాళ్లలో హార్మోన్ల హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ఈ సమస్యను నివారించడం కోసమే మేం పాల ఉత్పత్తులపరంగా జాగ్రత్తలు పాటిస్తూ ఉంటాం. మేం అందించే ఆవు నెయ్యి చిక్‌మంగుళూరు నుంచి వస్తుంది. వెస్టర్న్ ఘాట్స్‌లోని అడవుల్లో దొరికే వైల్డ్ హనీ, శ్రీకాకుళం అడవుల నుంచి సేకరించిన కేవ్ హనీలను మా ఫార్మసీలో విక్రయిస్తూ ఉంటాం.

> షికాగోకు చెందిన నావిపాయింట్ అనే కంపెనీతో టైఅప్ అయి, పేగుల్లోని బ్యాక్టీరియాను కొలిచే ఒక కిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. దీన్ని ఉపయోగించడం ఎంతో సులువు. దీని ద్వారా సేకరించిన నమూనాల ఫలితాల ఆధారంగా, మా న్యూట్రిషనిస్ట్ ప్యానెల్ సూచనల మేరకు, గట్ మైక్రోబియంను పెంచే వ్యక్తిగత డైట్‌ను రూపొందించి, అందిస్తాం.

పులిస్తేనే పోషకం

పేగుల్లో జీవించే మంచి బ్యాక్టీరియా (మైక్రోబయాం) మీదే మన ఆరోగ్యమంతా ఆధారపడి ఉంటుంది. వాటిలోని ఒక బ్యాక్టీరియా మోతాదు తగ్గితే, అది డిప్రెషన్‌కు దారి తీస్తుందని మనలో ఎంతమందికి తెలుసు? కాబట్టి ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను పెంచే పులిసిన ఆహారాన్ని తింటూ ఉండాలి. పూర్వీకులు చద్దన్నం తినడానికీ, పుల్లనీళ్లు తాగడానికీ వెనకున్న కారణం ఇదే! కాబట్టే మేం ఫంక్షనల్ కుకింగ్ పద్ధతిని ఎంచుకున్నాం. మా దగ్గర తయారయ్యే బ్రెడ్ కూడా పులియబెట్టిన పిండితోనే తయారవుతుంది. గ్లూటెన్ అలర్జీలు రాకుండా ఉండాలంటే ఇలాంటి ఫర్మెంటెడ్ పదార్థాలనే తినాలి. అలాగే వాటిని సరైన తాపమానాల్లో, సరైన పద్ధతుల్లో, సరైన మేళవింపులో వండుకుని తినాలి. పదార్థాల సమ్మేళనం కూడా కీలకమే! ఉదాహరణకు పసుపును శరీరం సంపూర్తిగా శోషించుకోవాలంటే, దాన్ని మిరియాలతో కలిపి తినాలి. ఎల్లోలైఫ్ కెఫెలోని ప్రతి పదార్థం ఈ ప్రక్రియలోనే తయారవుతుంది. నిజానికి వంటగదిలోని ప్రతి దినుసూ మన ఆరోగ్యానికి తోడ్పడేదే! వాటిని ఎంచుకుని, ఉపయోగించుకునే విధానం తెలిసి ఉండాలి. మా టీమ్‌లో పిహెచ్‌డి న్యూట్రిషనిస్టులు, ఫుడ్ టెక్నాలజిస్టులు, నేషనల్ ఇండియన్ న్యూట్రిషన్ నిపుణులు, ప్రపంచస్థాయి చెఫ్‌లు ఉన్నారు. కెఫెలో తయారుచేసే ప్రతి వంటకంలో వీళ్లందరి ప్రమేయం ఉంటుంది.

• గోగుమళ్ల కవిత
ఫొటోలు: అశోకుడు

70 ఏళ్లు... 80 దేశాలు

వయస్సు 70... వెళ్లింది 80 దేశాలు... పైగా ఒంటరిగా..
ఎవరీ సాహసి అనుకుంటున్నారా?
అయితే మీరు నీరూ సలూజా గురించి తెలుసుకోవాల్సిందే!



నీరూ సలూజా జైపూర్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. 2010లో ఆమె భర్త మరణించారు. అప్పటి దాకా నీరూ, ఆమె భర్త అనేక ప్రాంతాలు పర్యటిస్తూ ఉండేవారు. ప్రపంచంలో అనేక ప్రాంతాలు పర్యటించాలనే కోరికకు ఆమెలో చిన్నప్పుడే బీజం పడింది. "చిన్నప్పుడు స్కూలుకు వెళ్తుంటే సైకిల్ మీద నుంచి పడిపోయా. కాలికి దెబ్బ తగిలింది. రెండునెలల పాటు ఎక్కడికి కదలలేకపోయా. ఆ సమయంలో టీవీలు కూడా లేవు. ఏవైనా పుస్తకాలు చదువుకోవటం. లేదా కిటికీ నుంచి బయటకు చూడటం మాత్రమే నాకున్న హాబీలు. జైపూర్ చాలా వేడి ఉంటుంది. ఎక్కువ వానలు పడవు. కాబట్టి మేఘాలు కూడా తక్కువే. కిటికీలో నుంచి చూసినప్పుడు అప్పుడప్పుడు మేఘాలు కనిపించేవి. ఆ మేఘాలు ఎక్కడికి వెళ్తాయనే ఆలోచనే చాలా ఆసక్తిగా ఉండేది. అది తెలుసుకోవడానికి అట్లాస్ చూస్తూ ఉండేదాన్ని. అప్పుడే అట్లాస్‌లో ఉన్న దేశాలన్నిటికీ వెళ్లాలనే కోరికకు బీజం పడింది" అంటారామె.. పెళ్లి అయిన తర్వాత ఆమె భర్తకు కూడా కొత్త ప్రదేశాలకు వెళ్లటంపై ఆసక్తి ఉండటంతో... ఇద్దరూ పర్యటలను మొదలుపెట్టారు. "మాకు ఒక వెస్పా స్కూటర్ ఉండేది. దానిమీద ఢిల్లీ, సిమ్లా, చండీగఢ్ లాంటి ప్రదేశాలకు వెళ్లేవాళ్లం. అయితే ఆ సమయంలో ఇతర దేశాలకు వెళ్లింది తక్కువే" అంటారు నీరూ. 2010లో ఆమె భర్త మరణించారు. పిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడటం, తను ఒంటరిగా ఉండాల్సి రావటంతో... ఆమె మళ్లీ ప్రయాణాలు మొదలుపెట్టారు.



ఒంటరిగా తొలిసారి...

మొదట్లో తనతో పాటు బంధువులను, స్నేహితులను రమ్మని అడుగుతూ ఉండేవారు. కానీ వారికి రకరకాల సమస్యలు ఎదురు అవుతూ ఉండేవి. దీనితో తానే ఒంటరిగా ఇతర దేశాలకు వెళ్లాలని నీరూ నిర్ణయించుకున్నారు. 2012లో యూరప్‌లో క్రిస్టమస్ సమయంలో ఒక క్రూయిజ్ ప్రయాణాన్ని ఒక్కరే చేశారు. "ఆ ప్రయాణం నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఒంటరిగా ప్రయాణించటంలో ఉన్న మజాను నాకు పరిచయం చేసింది. చాలా మంది ఒంటరిగా ప్రయాణించటం కష్టమనుకుంటారు. కానీ ముందుగా ప్లాన్ చేసుకుంటే ఒంటరి ప్రయాణాలు అంత కష్టమేమి కావు. మనతో పాటు స్నేహితులు ఎవరు రాకపోవచ్చు. కానీ చాలా సార్లు ప్రయాణాల్లోనే స్నేహితులు ఏర్పడతారు..." అంటారు నీరూ. ఆ యూరప్ యాత్ర ఆమెకు ప్రయాణాన్ని కొత్త కోణం నుంచి చూడటం కూడా నేర్పింది.
"ఒంటరి ప్రయాణంలో స్వేచ్ఛ ఉంటుంది. మనం ఏం చేయాలో మనమే నిర్ణయించుకోవచ్చు. స్నేహితులతో కానీ కుటుంబ సభ్యులతో కానీ వెళ్తే- మిగిలిన వారు ఏం చేస్తే- మనం కూడా అదే చేయాల్సి ఉంటుంది. సాధారణంగా నేను పెద్ద గ్రూపులతో వెళ్తా. అటువంటప్పుడు మనకు స్వేచ్ఛ ఉంటుంది. అదే సమయంలో భద్రత కూడా ఉంటుంది" అంటారు నీరూ.

ప్రతి ప్రయాణం ఒక కొత్త అనుభవం

తాను చేసిన ప్రతీ ప్రయాణం ఒక కొత్త అనుభవాన్ని నేర్పుతుందంటారు నీరూ. "నేను ఇప్పటి దాకా 80 దేశాలు ప్రయాణించాను. ఒక్కొక్క చోట ఒక్కొక్క అనుభవం ఎదురయింది. ఇవన్నీ నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. ప్రతి ప్రాంతానికీ తనదైన సంస్కృతి ఉంటుంది. దాన్ని తెలుసుకుంటే- అనేక కొత్త కోణాలు ఆవిష్కృతమవుతాయి" అని చెబుతారు నీరూ. 60 ఏళ్లు దాటిన వాళ్లందరూ తప్పనిసరిగా ప్రపంచాన్ని చుట్టి రావాలంటారామె. "చాలామంది 'వయసైపోయింది' అంటూ ఉంటారు. కానీ వయస్సు మీద పడిపోతోందని ఎందుకు బాధపడాలి? ఎప్పుడో ఒకప్పుడు ఈ ప్రపంచం నుంచి వెళ్లిపోవాలని మన అందరికీ తెలుసు. ఈ లోపున ఆనందంగా ఎందుకు ఉండకూడదు.. జీవితాన్ని ఎందుకు ఆస్వాదించకూడదు?" అంటారు నీరూ.

కౌన్సెలింగ్



మహిళలకు ప్రత్యేక పోషకాలు అవసరమే!

ప్రశ్న: డాక్టర్! పురుషులతో పోలిస్తే మహిళల పోషక అవసరాలు ఎక్కువంటారు? ఇది ఎంత వరకూ నిజం? మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే ఎలాంటి పోషకాలు తీసుకోవాలి?

- ఓ సోదరి, గుంటూరు.

జవాబు: మహిళలకు ప్రత్యేక పోషకాలు అవసరమే! వారి శరీర జీవక్రియలకు తగ్గట్టు అవసరమైన పోషకాలను తీసుకుంటూ ఉండాలి. అవేంటంటే...

- **విటమిన్ బి6:** నిద్ర, ఆకలి సక్రమంగా ఉండాలంటే ఆహారంలో విటమిన్ బి6 ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం రోజుకో అరటిపండు తినాలి.
- **విటమిన్ బి12:** అలసటను తొలగించి, అలర్ట్‌నెస్‌ను పెంచుతుంది. కాబట్టి ఈ విటమిన్ ఉండే గుడ్డును రోజూ తినాలి.
- **ఫోలేట్:** గర్భిణిగా ఉన్న మొదటి కొన్ని వారాల్లో బిడ్డలో నాడీమండల సమస్యలు రాకుండా ఉండాలన్నా, పెద్ద పేగు, రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉండాలన్నా ఫోలేట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందుకోసం ఆకు కూరలు తినాలి.
- **విటమిన్ డి3:** ఎముకలు, దంతాలు, కండరాలకు పటుత్వాన్నిస్తుంది. ఈ విటమిన్ ఉండే గుడ్డు ఆహారంలో చేర్చుకోవాలి.
- **క్యాల్షియం:** రుతు సమయంలో సమస్యలు అదుపులో ఉండాలన్నా, రక్తపోటు నియంత్రణలో ఉండాలన్నా క్యాల్షియం తీసుకోవటం తప్పనిసరి. ఇందుకోసం పాల ఉత్పత్తులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.
- **ఐరన్:** మహిళల్లో నెలసరిలో జరిగే రక్తస్రావం మూలంగా రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఆకుకూరలు, నట్స్, మాంసాహారం తరచూ తీసుకుంటూ ఉండాలి.

డాక్టర్ రమణ,
జనరల్ ఫిజీషియన్, హైదరాబాద్

మృదువైన చర్మానికి గులాబీల ఫేస్‌ప్యాక్!

ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల ఫేస్‌ప్యాక్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిలో సమర్థంగా పనిచేసేవి కొన్నే! అందుకే మన ఇళ్లలో లభించే పదార్థాలతో శక్తిమంతమైన ఫేస్‌ప్యాక్‌లను చేసుకోవచ్చునంటున్నారు ప్రముఖ సౌందర్య నిపుణురాలు షెహనాజ్ హుస్సేన్. ఆ ఫేస్‌ప్యాక్‌లు ఏమిటో చూద్దాం.



గులాబీ పూల ఫేస్‌ప్యాక్

- తాజా రోజా రేకులను తీసుకోవాలి. వాటిని శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ ముద్దలో ఒక టేబుల్ స్పూన్ పెరుగు, ఒక టేబుల్ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల ఎండపెట్టిన నారింజ తొక్కల పొడిని వేయాలి.
- కొద్దిగా నీళ్లు వేసి మొహానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత మామూలు నీటితో కడిగివేయాలి.



గుమ్మడికాయ ఫేస్‌ప్యాక్

- గుమ్మడికాయ ముక్కలను చిన్నగా తరిగి నీళ్లలో ఉడకపెట్టాలి.
- ముక్కలను వేరు చేసి చల్లార్చి ముద్దగా చేయాలి.
- ఈ ముద్దలో ఒక టేబుల్ స్పూను కొబ్బరి నూనె, ఒక టేబుల్ స్పూన్ పెరుగు వేయాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి.. 20 నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత కడిగివేయాలి.

గుమ్మడికాయ- బ్రౌన్ షుగర్ ఫేస్‌ప్యాక్

- గుమ్మడికాయ ముక్కలతో గుజ్జు చేయాలి. దీనిలో రెండు టేబుల్ స్పూన్ల బ్రౌన్ షుగర్, ఒక టేబుల్ స్పూన్ తేనె, ఒక అరకప్పు పెరుగు వేయాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి.. 20 నిమిషాల తర్వాత కడిగివేయాలి. ఈ ఫేస్‌ప్యాక్‌తో చర్మంపై ఉన్న మృతకణాలన్నీ పోతాయి.

యాపిల్- తేనె ఫేస్‌ప్యాక్

- ఒక యాపిల్‌ను తీసుకొని దానిని ముక్కలు చేసి.. మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఈ ముద్దలో ఒక టేబుల్‌స్పూన్ తేనెను కలపాలి.
- ఈ మిశ్రమాన్ని పట్టించి 15 నిమిషాలు ఆరబెట్టాలి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో కడిగివేయాలి.





మూడో స్పిన్నర్‌గా అక్షర్, కుల్దీప్‌ల్లో ఎవరిని తీసుకోవాలనేది కష్టంగా మారింది. అయితే, అక్షర్ ఆల్‌రౌండ్ ప్రతిభ జట్టుకు మరింత ఉపయోగకరం. ప్రత్యర్థి అనుసరిస్తున్న దూకుడైన ఆట 'బజ్ బాల్' గురించి ఎటువంటి ఆందోళన లేదు. మా బలాలకు తగ్గట్టుగా స్పష్టమైన వ్యూహంతో బరిలోకి దిగుతాం. ఈ సిరీస్‌లో కూడా విజయం సాధిస్తామనే ఆత్మవిశ్వాసంతో ఉన్నాం.

- రోహిత్

పిచ్‌ను పరిశీలించిన తర్వాతనే ముగ్గురు స్పిన్నర్లతో ఆడాలనుకొన్నాం. హార్ట్‌లీ అరంగేట్రం చేయనున్నాడు. యూఏఈలో అతడు అద్భుతంగా బౌలింగ్ చేశాడు. సిరీస్‌లో శుభారంభం చేయాలన్న పట్టుదలతో ఉన్నాం. మార్క్ ఉడ్ తన వేగంతో ప్రభావితం చేయగలడు.

- స్టోక్స్, ఇంగ్లండ్ కెప్టెన్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, అయ్యర్, రాహుల్, జడేజా, భరత్ (వికెట్ కీపర్), అక్షర్, అశ్విన్, బుమ్రా, సిరాజ్.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్ (వికెట్ కీపర్), రెహాన్ అహ్మద్, మార్క్ ఉడ్, టామ్ హార్ట్‌లీ, లీచ్.

పిచ్

వికెట్ పొడిగా ఉంది. తొలి రోజు నుంచే స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. క్రీజులో పాతుకొంటే బ్యాటర్లు భారీ స్కోర్లు సాధించవచ్చు. ఉదయం సమయంలో పిచ్‌పై తేమ ఉంటే పేసర్లకు లాభించే చాన్సులున్నాయి. వాతావరణం సాధారణంగా ఉండనుంది.

భారత స్పిన్ X బజ్‌బాల్



ఉదయం 9.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో..

ఉప్పల్‌లో ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్ నేటి నుంచి

అశ్విన్, జడేజాపైనే భారం

స్పెషలిస్ట్ బ్యాటర్‌గా రాహుల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): గత పన్నెండేళ్లుగా సొంతగడ్డపై జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత్‌కు తొలిసారి కఠిన పరీక్ష ఎదురుకానుంది. 'బజ్‌బాల్ (దూకుడైన బ్యాటింగ్)'తో టెస్టుల్లో నూతన ఒరవడికి నాందిపలికిన ఇంగ్లండ్ నుంచి రోహిత్ సేనకు అసలుసిసలు పరీక్ష తప్పదనిపిస్తోంది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్టులో విజయమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగనుంది. కాగా, ఇంగ్లిష్ టీమ్ ధనాధన్ బ్యాటింగ్‌కు.. టీమిండియా స్పిన్నర్లకు మధ్యే ప్రధాన పోటీ ఉండే అవకాశం ఉంది. 2012లో అలిస్టర్ కుక్ సారథ్యంలో ఇంగ్లండ్ చేతిలో 1-2తో సిరీస్ ఓటమి తర్వాత స్వదేశంలో భారత్‌కు ఎదురే లేకుండా పోయింది. ఆసియాలో వరుసగా 16 సిరీస్‌లు నెగ్గిన టీమిండియా.. వాటిల్లో ఏడింటిని క్లీన్‌స్వీప్ చేయడం విశేషం. ఈ పుష్కర కాలంలో దేశంలో ఆడిన 44 టెస్టుల్లో కేవలం మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే భారత్ పరాజయాన్ని చవిచూసింది. టీమిండియా జోరు చూస్తుంటే 80వ దశకంలో వెస్టిండీస్, ఆ తర్వాత ఆస్ట్రేలియా ఆధిపత్యాన్ని గుర్తొస్తోంది. టెస్టుల్లో మన స్పిన్ భారాన్ని అశ్విన్, జడేజా తమ భుజాలపై మోస్తున్నారు. తొలి రోజు నుంచే స్పిన్నర్లకు సహకరించే పిచ్ అని భావిస్తున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌లోనూ వీరిద్దరూ కీలకం కానున్నారు. భారత పిచ్‌లపై అశ్విన్ ఎంత ప్రమాదకారో ఇంగ్లండ్‌కు అనుభవమే. కోహ్లీ గైర్హాజరీలో వన్‌డౌన్‌లో శుభ్‌మన్ గిల్ ఆ లోటును భర్తీ చేయాలి. అయితే, ఇటీవలి కాలంలో గిల్ ఫామ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురి చేస్తోంది. రోహిత్‌తో కలసి జైస్వాల్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉండగా.. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్, రాహుల్ ఆడనున్నారు. వికెట్ కీపర్‌గా కేఎస్ భరత్‌కు చోటు ఖాయమని తెలుస్తోంది. మూడో స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌కు బదులు బ్యాట్‌తోనూ రాణించే అక్షర్‌కు తుది జట్టులో చోటు కల్పించే అవకాశాలున్నాయి. బుమ్రా, సిరాజ్ పేస్ విభాగాన్ని నడిపించనున్నారు.

10 500 వికెట్ల మైలురాయికి అశ్విన్‌కు కావాల్సిన వికెట్లు.

1 కోహ్లీ, పుజార, రహానె లేకుండా భారత్ టెస్ట్ మ్యాచ్ ఆడడం 2011, నవంబరు తర్వాత ఇదే తొలిసారి.

ముగ్గురు స్పిన్నర్లతో..

పర్యాటక జట్లకు ఇన్నేళ్లుగా సాధ్యంకాని రికార్డును నెలకొల్పాలని ఇంగ్లండ్ కూడా పట్టుదలతో ఉంది. అందుకు తగ్గట్టుగా యూఏఈలో కొద్ది రోజులు ప్రాక్టీస్ కూడా చేసింది. ఉపఖండ పిచ్‌లకు తగ్గట్టుగా ముగ్గురు స్పిన్నర్లు జాక్ లీచ్, రెహాన్ అహ్మద్‌తోపాటు టామ్ హార్ట్‌లీకి తొలిసారి తుది జట్టులో చోటు కల్పించింది. బ్యాటింగ్‌లో రూట్, కెప్టెన్ బెన్ స్టోక్స్, బెయిర్‌స్టో కీలకం. ఫోక్స్‌కు కీపింగ్ బాధ్యతలు అప్పజెప్పనున్నారు. ఇంగ్లిష్ బౌలింగ్‌లో అనుభవలేమి కనిపిస్తున్నా.. అద్భుతం చేయగలమని స్టోక్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. మరి టీమిండియా అడ్డా అయిన ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లండ్ ఎంతమేర పోటీ ఇస్తుందో చూడాలి.



స్టోక్స్



టెన్నిస్‌లో బోపన్న కొత్త చరిత్ర

డబుల్స్‌లో టాప్ ర్యాంకుతో అరుదైన ఘనత

వయసు 43.. ర్యాంకు 1

మెల్‌బోర్న్: వయసు పెరుగుతున్నా, వన్నె తరగని ఆటతో అదరగొడుతున్న భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ప్రపంచ టెన్నిస్‌లో సరికొత్త చరిత్ర లిఖించాడు. వచ్చే సోమవారం ప్రకటించే తాజా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో బోపన్న పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ ఆటగాడిగా అవతరించనున్నాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న సెమీఫైనల్ చేరాడు. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో రెండోసీడ్ బోపన్న జోడీ 6-4, 7-6(5)తో ఆరోసీడ్, అర్జెంటీనా జంట మాగ్జిమో గోంజాలెజ్-ఆండ్రెస్ మోల్టెనిపై గెలుపొందింది. తద్వారా రెండు స్థానాలు మెరుగుపరచుకున్న 43 ఏళ్ల బోపన్న.. కెరీర్‌లో తొలిసారి అగ్రస్థానాన్ని అందుకోనున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు ప్రపంచ మూడో ర్యాంకులోవున్న బోపన్న.. తాజా ప్రదర్శనతో కెరీర్‌లోనే అత్యుత్తమ స్థానంలో నిలవనున్నాడు. అంతేకాదు.. అత్యంత పెద్ద వయసులో నెంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన డబుల్స్ ఆటగాడిగా బోపన్న అరుదైన రికార్డు సాధించాడు. రెండేళ్ల క్రితం అమెరికాకు చెందిన రాజీవ్ రామ్ 38 ఏళ్ల వయసులో డబుల్స్ టాప్ ర్యాంకర్‌గా రికార్డులకెక్కాడు. ఇప్పుడు రాజీవ్‌ను బోపన్న అధిగమించాడు. బోపన్న 2013లో కెరీర్‌లో అత్యుత్తమంగా 3వ ర్యాంక్ అందుకున్నాడు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా తర్వాత టెన్నిస్ డబుల్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్న భారత ఆటగాడిగా బోపన్న ఖ్యాతికెక్కాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో అన్‌సీడెడ్ ద్వయం టొమాస్-జెయిసన్‌తో బోపన్న జంట అమీతుమీ తేల్చుకోనుంది.

కొత్తతరానికి స్ఫూర్తి..

'ఈ ఘనత (నెం.1 సాధించడం) నాకొక్కడిదే కాదు, భారత టెన్నిస్‌ది కూడా. ఈ వయసులో అగ్రపీఠం దక్కించుకోవడమన్నది దేశంలో కొత్తతరం టెన్నిస్ ఆటగాళ్లకు కచ్చితంగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు'

- రోహన్ బోపన్న

అల్కారజ్‌కు జ్వెరెవ్ షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జొకోవిచ్‌కు గట్టిపోటీదారనుకున్న మాజీ వరల్డ్ నెంబర్‌వన్, రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్)కు చుక్కెదురైంది. క్వార్టర్‌ఫైనల్లో ఆరోసీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-3, 6-7(2), 6-4తో రెండోసీడ్ అల్కారజ్‌కు షాకిచ్చాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్-5 ఆటగాడిపై తొలిసారి విజయాన్ని అందుకున్న జ్వెరెవ్.. మెల్‌బోర్న్ పార్క్‌లో రెండోసారి సెమీస్‌లో ప్రవేశించాడు. మరో క్వార్టర్స్‌లో మూడోసీడ్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా) 7-6(4), 2-6, 6-3, 5-7, 6-4తో 9వ సీడ్ హర్బర్ట్ హర్కాజ్ (పోలెండ్)ను ఓడించాడు. ఈ వేదికపై రెండుసార్లు ఫైనలిస్టుగా నిలిచిన మెద్వెదేవ్ ఫైనల్ బెర్త్ కోసం జ్వెరెవ్‌తో తలపడనున్నాడు. మరో సెమీస్‌లో జొకోవిచ్, సిన్నర్ ఆడనున్నారు.



జ్వెరెవ్



మెద్వెదేవ్

మహిళల సెమీస్‌లో జెంగ్ X డయానా

మహిళల సింగిల్స్‌లో చైనాకు చెందిన 12వ సీడ్ జెంగ్ కిన్వెన్, ఉక్రెయిన్ క్వాలిఫయర్ డయానా యాస్ట్రెమ్‌స్కా సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్లో జెంగ్ 6-7(4), 6-3, 6-1తో అన్నా కలిన్‌స్కయా (రష్యా)పై, డయానా 6-3, 6-3తో లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచారు. గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్ చేరడం ఇద్దరికీ ఇదే మొదటిసారి మరో సెమీఫైనల్లో సబలెంకా, కొకొ గాఫ్ పోటీపడనున్న సంగతి తెలిసిందే.

బషీర్‌కు వీసా మంజూరు



లండన్/హైదరాబాద్: ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ వీసా వ్యవహారం కొంత చికాకు కలిగించినా.. ఎట్టకేలకు సుఖాంతమైంది. పాకిస్థాన్ మూలాలున్న 20 ఏళ్ల బషీర్‌కు వీసా ఆలస్యం కావడంతో అబుధాబి నుంచి మళ్లీ స్వదేశానికి తిరిగి వెళ్లాడు. దీనిపై స్టోక్స్ కూడా తీవ్రంగా స్పందించాడు. తన జట్టు సభ్యుడికి ఇలా జరగడంపై అసహనం వ్యక్తం చేశాడు. అయితే, బషీర్‌కు బుధవారం వీసా మంజూరైందని ఇంగ్లండ్ బోర్డు పోస్టు చేసింది. ఈ వారంతానికల్లా అతడు జట్టుతో కలుస్తాడని తెలిపింది.

శ్రీకాంత్, ప్రణయ్ ఇంటి దారి


జకార్త: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలిరౌండ్లోనే ఇంటిబాట పట్టారు. బుధవారం మొదలైన ఈ టోర్నీలో శ్రీకాంత్ 21-19, 14-21, 11-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో, ప్రణయ్ 18-21, 21-19, 10-21తో లో కీన్ యే (సింగపూర్) చేతిలో ఓటమిపాలయ్యారు. ఇతర భారత షట్లరలో లక్ష్యసేన్, కిరణ్ జార్జ్ రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

సూర్యనే టీ20 హీరో

రెండోసారి ఐసీసీ అవార్డుతో రికార్డు

దుబాయ్: టీమిండియా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఐసీసీ టీ20 అవార్డుల్లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. 2023కు గాను ప్రకటించిన అవార్డుల్లో 'టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా సూర్య నిలిచాడు. 2022లో కూడా సూర్యనే ఈ అవార్డు వరించింది. దీంతో వరుసగా రెండుసార్లు ఈ అవార్డును అందుకున్న ఆటగాడిగా సూర్య రికార్డులకెక్కాడు.

చిత్తుగా ఓడిన టైటాన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ ముగింపు దశకు చేరుతున్నా తెలుగు టైటాన్స్ ఆట తీరులో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. బుధవారం గచ్చిబౌలిలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-54తో తమిళ్ తలైవాస్ చేతిలో భారీ తేడాతో ఓడింది. అజింక్యా పవార్ (11 పాయింట్లు), నరేందర్ (10 పాయింట్లు) చెలరేగడంతో తలైవాస్ అలవోకగా గెలిచింది. టైటాన్స్ స్టార్ ప్లేయర్ పవన్ (10 పాయింట్లు) ఒంటరి పోరాటం ఎప్పట్లానే వృథా అయింది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ-హరియాణా స్టీలర్స్‌పై 35-32తో గెలిచింది.

అండర్-19 వరల్డ్ కప్‌లో నేడు భారత్ X ఐర్లాండ్ (మ.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో)

కెనరా బ్యాంక్ లాభం 3,659 కోట్లు

రూ.9,417 కోట్లకు పెరిగిన వడ్డీ ఆదాయం.. గణనీయంగా తగ్గిన మొండి బకాయిలు



ముంబై: వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి కెనరా బ్యాంక్ నికర లాభం 27 శాతం వృద్ధితో రూ.3,659 కోట్లకు చేరుకుంది. రుణ వ్యయాలు తగ్గడంతోపాటు వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9.50 శాతం వృద్ధితో రూ.9,417 కోట్లకు ఎగబాకింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 0.09 శాతం పెరిగి 3.02 శాతంగా నమోదైంది. కాగా, రుణ వ్యయం 0.24 శాతం తగ్గి 0.97 శాతానికి పరిమితమైందని కెనరా బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే సత్యనారాయణ రాజు తెలిపారు. బ్యాంక్ ఆస్తుల నాణ్యత మెరుగుపడటంతోపాటు మొండిబకాయిలు గణనీయంగా తగ్గడం లాభంలో బలమైన వృద్ధికి దోహదపడిందన్నారు. మరిన్ని విషయాలు..

డిసెంబరు చివరినాటికి మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.50 శాతం తగ్గి 3.39 శాతానికి జారుకున్నాయి. నికర ఎన్‌పీఏలు 0.64 శాతం తగ్గి 1.32 శాతానికి తగ్గాయి.

బ్యాంక్ ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 2.69 శాతం పెరిగి 89.01 శాతానికి పుంజుకుంది. దాంతో కీలక మూలధన నిష్పత్తి 15.78 శాతానికి మెరుగుపడింది.

గడిచిన త్రైమాసికానికి బ్యాంక్ రుణ వృద్ధి 9.7 శాతంగా, డిపాజిట్లలో వృద్ధి 12.5 శాతంగా నమోదైంది.

రిటైల్ రుణాలు 12.14 శాతం, పంట రుణాలు 19.26 శాతం, ఎంఎస్ఎంఈ రుణాలు 10 శాతం, గృహ రుణాలు 12.07 శాతం, వాహన రుణాలు 13.2 శాతం పెరిగాయి.

బ్యాంక్ వ్యక్తిగత రుణాల మంజూరు రూ.9,100 కోట్లుగా నమోదైంది. అందులో మొండిబాకీల వాటా 1.2 శాతం ఉందని బ్యాంక్ తెలిపింది. హోమ్ లోన్లు రూ.91,800 కోట్లు, వాహన రుణాలు రూ.16,960 కోట్లకు పెరిగాయి.

ఉద్యోగుల వేతనాలు, రిటైర్మెంట్, ఇతర ప్రయోజనాల కోసం రూ.7,000 కోట్లు పక్కన పెట్టడం జరిగిందన్నారు.

క్యూ3 చివరినాటికి ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంక్ రుణాలు రూ.1,35,000 కోట్లుగా నమోదయ్యాయి.

గడిచిన మూడు నెలల్లో కొత్తగా రూ.3,000 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి చేరాయి. అందులో చాలావరకు ఖాతాలు రిటైల్, అగ్రి, ఎంఎస్ఎంఈ రుణాలకు చెందినవే. కాగా, గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.16,051 కోట్ల మొండి బాకీలను తిరిగి రాబట్టుకోగలిగింది.

బ్యాంక్ అంతర్జాతీయ వ్యాపారం 9.87 శాతం వృద్ధితో రూ.22,13,360 కోట్లకు చేరుకుంది. అందులో రుణాలు 11.69 శాతం వృద్ధితో రూ.9,50,430 కోట్లుగా, డిపాజిట్లు రూ.12,62,930 కోట్లుగా నమోదయ్యాయి.

దేశీయంగా డిపాజిట్లు 8.07 శాతం పెరుగుదలతో రూ.11,66,848 కోట్లుగా, రుణాలు 12.56 శాతం వృద్ధితో రూ.9,01,465 కోట్లుగా నమోదైనట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఐఓసీ లాభం జూమ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వ రంగానికి చెందిన ఇంధన విక్రయ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) మూడో త్రైమాసికంలో బంపర్ లాభాలను ప్రకటించింది. స్టాండ్ అలోన్ నికర లాభం రూ.8,063.39 కోట్లుగా నమోదైంది. 2022 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నమోదైన రూ.448 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా పుంజుకున్నప్పటికీ, గత ఏడాది సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో ఆర్జించిన రూ.12,967.32 కోట్ల లాభంతో పోలిస్తే బాగా తగ్గింది. ఈ క్యూ3లో కంపెనీ రాబడి రూ.2.23 లక్షల కోట్లుగా, పెట్రోలియం ఉత్పత్తుల విక్రయం ద్వారా లభించిన స్థూల లాభం రూ.11,428.88 కోట్లుగా నమోదైంది.

టెక్ మహీంద్రాకు మార్జిన్ల సెగ

ముంబై: టెక్ మహీంద్రా క్యూ3 నికర లాభం వార్షిక ప్రాతిపదికన 60% తగ్గి రూ.510.4 కోట్లకు జారుకుంది. లాభాల మార్జిన్లు 12 శాతం నుంచి ఏకంగా 5.4 శాతానికి తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ రూ.1,296 కోట్ల లాభం గడించింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఆదాయం సైతం 4.6% తగ్గి రూ.13,101 కోట్లకు పరిమితమైంది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా 38.1 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను దక్కించుకున్నట్లు తెలిపింది.

యూకో బ్యాంక్ లాభం రూ.505 కోట్లు

కోల్‌కతా: యూకో బ్యాంక్ మూడో త్రైమాసికంలో రూ.505 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఉద్యోగుల వేతన పెంపునకు అధిక కేటాయింపులు జరపాల్సి రావడంతో లాభం 23 శాతం తగ్గినప్పటికీ, సమీక్షా కాలానికి మంచి పనితీరు కనబర్చినట్లు బ్యాంక్ పేర్కొంది. వేతనాల పెంపునకు బ్యాంక్ రూ.277 కోట్ల కేటాయింపులు జరిపినట్లు యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు. గడిచిన మూడు నెలల్లో కొత్తగా మొండిపద్దుల్లోకి జారిన రుణాల విలువను రూ.481 కోట్లకు తగ్గించుకోగలిగామన్నారు. డిసెంబరు చివరినాటికి మొండి బకాయిలు 1.78 శాతం తగ్గి 3.85 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.68 శాతం తగ్గుదలతో 0.98 శాతానికి జారుకున్నాయి. ఈ క్యూ3లో బ్యాంక్ మొత్తం వ్యాపారం 10.46 శాతం వృద్ధితో రూ.4,35,456 కోట్లకు చేరుకుంది. అందులో స్థూల రుణాలు 18.63 శాతం వృద్ధితో రూ.1,79,195 కోట్లుగా, డిపాజిట్లు 5.38 శాతం పెరుగుదలతో రూ.2,56,261 కోట్లుగా నమోదయ్యాయి. సాంకేతిక లోపం కారణంగా ఈమధ్యన కస్టమర్ల ఖాతాల్లోకి తప్పుగా జమ అయిన రూ.820 కోట్లలో ఇప్పటికే 88 శాతం (రూ.715 కోట్లు) రికవరీ చేసుకోవడం జరిగిందని, మరో రూ.105 కోట్లు తిరిగి రాబట్టుకోవాల్సి ఉందని అశ్వనీ కుమార్ స్పష్టం చేశారు.



బడ్జెట్ రూపకల్పనకు శ్రీకారం చుడుతూ జరిగే హల్వా కార్యక్రమంలో పాల్గొని ఆర్థిక శాఖ ఉద్యోగులకు హల్వా పంచుతున్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

రిటైల్ స్పేస్ లీజింగ్‌లో రికార్డు

న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ స్థలాల లీజింగ్ మంచి జోరుమీదుంది. దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 2023 సంవత్సరంలో షాపింగ్ మాల్స్‌లోను, ఇతర ప్రఖ్యాత ప్రదేశాల్లోను లీజింగ్ 48 శాతం పెరిగి 71 లక్షల చదరపు అడుగులుగా నమోదయిందని సీబీఆర్ఈ తాజా నివేదికలో తెలిపింది. రిటైల్ రంగం లీజింగ్‌లో ఇది చారిత్రక గరిష్ఠ స్థాయి అని సీబీఆర్ఈ పేర్కొంది. 2022లో లీజింగ్‌కు తీసుకున్న ప్రదేశాల పరిమాణం 48 లక్షల చదరపు అడుగులుంది. భారతదేశం మంచి అవకాశాలున్న వినియోగ మార్కెట్‌గా మారిందని, ఈ కారణంగా రిటైలర్లు కొత్త స్టోర్లు ఏర్పాటు చేయడానికి, విస్తరణకు, ప్రస్తుతం ఉన్న స్టోర్లను అప్‌గ్రేడ్ చేయడానికి వ్యాపారులు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపింది. అందులోనూ కొత్తగా ప్రారంభించిన మాల్స్‌లో స్థలాలు తీసుకోవడానికి వారు అధికంగా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి మాల్స్‌లో రిటైల్ స్పేస్ లీజింగ్ వాటా 30 శాతం ఉందని తెలిపింది. ఫ్యాషన్, అపారెల్ విభాగం 32 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా హోమ్‌వేర్, డిపార్ట్‌మెంట్ స్టోర్ల వాటా 17 శాతం; ఆహారం, పానీయాల విభాగం వాటా 12 శాతం, లగ్జరీ వస్తువుల విభాగం వాటా 9 శాతం, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వాటా 6 శాతం ఉంది.

సోనీపై ఎన్‌సీఎల్‌టీకి జీ ఎంటర్‌టైన్‌మెంట్

న్యూఢిల్లీ: సోనీ గ్రూప్ విలీనం ఒప్పందాన్ని రద్దు చేసుకోవడాన్ని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎన్‌సీఎల్‌టీలో సవాలు చేసింది. విలీనం పథకం అమలుపరచాలని సోనీని ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. అలాగే సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్‌లో (సియాక్) సోనీ గ్రూప్ దాఖలు చేసిన రూ.748.5 కోట్ల క్లెయిమ్‌లపై అభ్యంతరం ప్రకటిస్తూ తగు చట్టపరమైన చర్యలు చేపట్టింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ (జీఈఈఎల్) ఒక రెగ్యులేటరీ సందేశంలో ఈ విషయం తెలిపింది.

రేపటి నుంచి ఈ-లూనా బుకింగ్‌లు ప్రారంభం

న్యూఢిల్లీ: కైనెటిక్ గ్రీన్ సంస్థ కొత్తగా మార్కెట్లోకి తెస్తున్న విద్యుత్ లూనా బుకింగ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెలలో ఇది లాంఛనంగా మార్కెట్లోకి రానుంది. కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకురాలు సులజ్జా ఫిరోదియా మోత్వానీ ఈ విషయం ప్రకటించారు.

లారస్ ల్యాబ్స్ లాభంలో క్షీణత

హైదరాబాద్: ఫార్మా కంపెనీ లారస్ ల్యాబ్స్ లాభం క్యూ3లో గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే భారీగా 89 శాతం క్షీణించింది. గత ఏడాది ఆర్జించిన లాభం రూ.203 కోట్లు కాగా ఈ ఏడాది క్యూ3లో రూ.23 కోట్లకు పడిపోయింది. ఆదాయం సైతం వార్షిక ప్రాతిపదికన 22.6 శాతం తగ్గి రూ.1,544.8 కోట్ల నుంచి రూ.1,194.9 కోట్లకు దిగజారింది. నిర్వహణ లాభం 55 శాతం తగ్గి రూ.181.4 కోట్లకు జారుకుంది. లాభాల మార్జిన్ ఏకంగా 10.9 శాతం తగ్గడం ఇందుకు కారణం. లాభాల మార్జిన్‌కూడా 26.2 శాతం నుంచి 15.2 శాతానికి జారుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 నెలల్లో కంపెనీ మూలధన వ్యయం రూ.576 కోట్లుగా నమోదైంది. బీఎస్ఈలో లారస్ ల్యాబ్స్ షేరు ధర 0.15 శాతం తగ్గి రూ.398.55 వద్ద ముగిసింది.

రెయిన్‌బో హాస్పిటల్స్ లాభం రూ.62.57 కోట్లు

డిసెంబరు త్రైమాసికానికి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.4 శాతం వృద్ధితో రూ.62.57 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో లాభం రూ.58.24 కోట్లుగా ఉంది. ఆదాయం 9.6 వృద్ధితో రూ.335.96 కోట్లకు పెరిగింది. డిసెంబరు చివరి నాటికి ఈ హాస్పిటల్స్ నెట్‌వర్క్ మొత్తం పడకల సామర్థ్యం 6% పెరిగి 1,655కు చేరుకుంది. ఈనెల 4న హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో ప్రారంభించిన 60 పడకల ఆసుపత్రితో కలిపితే ప్రస్తుత సామర్థ్యం 1,715కు చేరుకుందని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ వెల్లడించింది. గడిచిన త్రైమాసికంలో రూ.60.4 కోట్ల మూలధనం వెచ్చించింది.

మార్కెట్‌లో కొనుగోళ్ల జోష్

సెన్సెక్స్ 689 పాయింట్లు అప్

ముంబై: మెటల్, కమోడిటీ, టెలికాం రంగాల్లో తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చిన స్టాక్‌ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు పరుగులు తీయడంతో బుధవారం ఈక్విటీ మార్కెట్ ఒక శాతం మేరకు లాభపడింది. వరుసగా రెండు రోజుల భారీ నష్టాలకు తెర దించిన సెన్సెక్స్ 689.76 పాయింట్లు లాభపడి 71060.31 వద్ద ముగిసింది. నిఫ్టీ 215.15 పాయింట్ల లాభంతో 21453.95 వద్ద క్లోజయింది. 3.77 శాతం లాభంతో సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్ అగ్రగామిగా నిలవగా హెచ్‌సీఎల్ టెక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కూడా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.71 శాతం లాభంతో 37,884.28 వద్ద, స్మాల్‌క్యాప్ సూచీ 1.72 శాతం లాభంతో 44,124.36 వద్ద ముగిశాయి. స్టాక్‌మార్కెట్ల వద్ద ఉన్న గణాంకాల ప్రకారం ఎఫ్ఐఐలు మంగళవారం రూ.3115.39 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. కేవలం గత నాలుగు రోజుల కాలంలోనే వారు రూ.27,000 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడుల ద్వారా లాభపడిన అసలు యజమాని ఎవరో ప్రకటించాలన్న సెబీ కొత్త నిబంధన వారిలో భయాందోళనలకు కారణమయింది.

గిఫ్ట్‌లో నేరుగా కంపెనీల లిస్టింగ్‌కు అనుమతి

భారత కంపెనీలు విదేశీ నిధులు సమీకరించడం ఇక మరింత సరళం కానుంది. కంపెనీలు గిఫ్ట్ ఐఎఫ్ఎస్‌సీ ద్వారా నేరుగా అంతర్జాతీయ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగ్ అయ్యేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఆర్థిక వ్యవహారాల శాఖ ఇందుకు అనుగుణంగా విదేశీ మారక నిర్వహణ నిబంధనలు సవరించింది. "అంతర్జాతీయ ఎక్స్ఛేంజిల్లో భారతదేశంలో ఏర్పాటైన కంపెనీల ప్రత్యక్ష లిస్టింగ్ పథకం" నోటిఫై చేసింది. అలాగే కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) కంపెనీల (అనుమతించిన అధికార పరిధి గల ప్రాంతాల్లో ఈక్విటీ షేర్ల లిస్టింగ్) నిబంధనలు, 2024 కూడా నోటిఫై చేసింది.

వివిపై రూ.617 కోట్ల సమీకరణ

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఫిన్‌టెక్ కంపెనీ వివిపై ఫైనాన్స్ సిరీస్ బీ ఫండింగ్ రూపంలో రూ.617 కోట్లు (7.5 కోట్ల డాలర్లు) సమీకరించింది. అయితే పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లు ఎవరన్నది వెల్లడించేందుకు కంపెనీ నిరాకరించింది. ఈ ఫండింగ్‌తో తాము కస్టమర్ల సంఖ్యను వచ్చే 12-18 నెలల కాలంలో 10 లక్షలకు పెంచుకోగలుగుతామని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిల్ పినపాల తెలిపారు. ఇదే కాలంలో ఉద్యోగుల సంఖ్య 2000కి పెంచుకోవాలనుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 800 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించిన అనంతరం జాతీయ స్థాయి విస్తరణ చేపడతామని చెప్పారు.

10 నెలల్లో ఫ్రాంక్స్ లక్ష అమ్మకాల మైలురాయి

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ ఫ్రాంక్స్ కారు 10 నెలల కాలవ్యవధిలోనే లక్ష అమ్మకాల మైలురాయిని దాటింది. ఇది ఒక రికార్డు, పరిశ్రమలో ఈ కారు ఒక బెంచ్‌మార్క్ నిర్దేశించిందని కంపెనీ ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఫ్రాంక్స్ కారును గత ఏడాది ఏప్రిల్ 24వ తేదీన ప్రవేశపెట్టారు. 2022లో ఎస్‌యూవీల విభాగంలో తమ వాటా 10.4 శాతం కాగా అది 19.7 శాతానికి చేరడానికి ఈ కారు దోహదపడిందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీ వాస్తవ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,000 ▼	57,750 ▼	76,800 ▲
ముంబై	62,590 ▲	57,330 ▲	71,070 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
25 జనవరి		విశాఖపట్నం	565
చిత్తూరు	573	వరంగల్	542
గోదావరి	560	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	105
విశాఖపట్నం	103		

టికెట్ల కోసం రాజీనామా చేయడం ఎంతసేపు!

- 2 చోట్ల నేను చెప్పినవారికి ఇవ్వలేదు
- మాగుంట కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నా: బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 24: కావలసిన టికెట్ల కోసం రాజీనామా చేయడం ఎంతోసేపు పట్టదని ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వైసీపీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపి, సంతనూతలపాడు టికెట్లు తాను చెప్పిన వారికి రాలేదని, అయినా తాను సర్దుకుపోతున్నట్లు తెలిపారు. బుధవారమిక్కడ తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యర్రగొండపాలెం ఇన్‌చార్జిగా చంద్రశేఖర్‌ను నియమించామని.. అక్కడ ఎవరు మద్దతిచ్చినా.. ఇవ్వకున్నా.. ఆయన్ను గెలిపించుకోవలసిన బాధ్యత తనపై ఉందన్నారు చంద్రశేఖర్ గెలుపు కోసం మంత్రి ఆదిమూలపు సురేశ్ కూడా కృషిచేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి 30 ఏళ్ల నుంచి తమతో కలిసి రాజకీయాల్లో ఉన్నారని.. తాను ఆయనకు మళ్లీ ఎంపీ టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నానని.. అవి ఏ మేరకు ఫలిస్తాయో వేచిచూడాలని వ్యాఖ్యానించారు. తన రాజకీయ భవిష్యత్‌ను పణంగా పెట్టి ఒక నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.

జనసేనలో చేరిన పృథ్వి, జానీ మాస్టర్


పృథ్వీరాజ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, ఎస్వీబీసీ మాజీ ఛైర్మన్ పృథ్వీరాజ్, ప్రముఖ సినీ నృత్య దర్శకుడు షేక్ జానీ మాస్టర్ బుధవారం జనసేన పార్టీలో చేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేనాని పవన్ కల్యాణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, పార్టీ విధానాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారికి పవన్ కల్యాణ్ సూచించారు.

పవన్‌తో వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ భేటీ

గూడూరు వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్ బుధవారం సాయంత్రం జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. జనసేన పార్టీలో చేరేందుకు వరప్రసాద్ అంగీకరించడంతో పవన్ కూడా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. త్వరలో మంచి తేదీ చూసుకుని ఆయన జనసేన పార్టీ తీర్థం పుచ్చుకొనున్నారు.

పార్టీ నిర్ణయమే ఫైనల్..: కొణతాల

ఎక్కడ నుంచి.. ఏం చేస్తాం.. ఏ రకంగా నా సేవలను ఉపయోగించుకుంటుందనేది పార్టీ నిర్ణయిస్తుందని కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం జనసేనాని పవన్‌ను కలిసిన ఈ భేటీ అనంతరం మాట్లాడుతూ.. పార్టీకి అవసరమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎక్కడ పోటీ చేస్తాననేది పవన్ కల్యాణ్ నిర్ణయిస్తారన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమం, ఉత్తరాంధ్ర అభివృద్ధి విషయంలో పవన్ కల్యాణ్ నుంచి తాను హామీ తీసుకున్నట్లు తెలిపారు. గంటా రాజీనామాను ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వానికి గట్స్ ఉంటే రాజీనామాను ఎప్పుడో ఆమోదించాల్సిందన్నారు.


జనసేనకు 'గాజు గ్లాసు': సీఈసీ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి 'గాజు గ్లాసు' గుర్తును ఖరారు చేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఈ-మెయిల్ ద్వారా పార్టీ కార్యాలయానికి అందాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల కాపీలను పార్టీ లీగల్ సెల్ చైర్మన్ ఇవన సాంబశివప్రతాప్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు అందించారు.

ఆ ప్రకటన 'ఫేక్': టీడీపీ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ,జనసేన పొత్తులో భాగంగా టీడీపీ 112 అసెంబ్లీ స్థానాలు, జనసేన 63 స్థానాల్లో పోటీ చేయాలని ఇరు పార్టీల అధిష్ఠానాలు నిర్ణయించాయంటూ ఒక ప్రకటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. కాగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు సంతకంతో ఉన్న ఆ ప్రకటన నకిలీదని టీడీపీ పేర్కొంది.

బిడ్డా.. ఖబడ్దార్..!



- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవికి సొంత పార్టీ నేత వార్నింగ్
- మీసం మెలేసిన జడ్పీటీసీ గోకుల్
- అనుచరులతో భారీ ర్యాలీ, అడ్డుకున్న పోలీసులు


నంద్యాలలో గోకుల్‌కృష్ణారెడ్డి చేపట్టిన స్థానికుల ఆత్మగౌరవయాత్రను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

నంద్యాల క్రైం, జనవరి 24: 'బిడ్డా.. ఖబడ్దార్.. నేను ఇక్కడే పుట్టినా.. ఇక్కడే పెరిగినా. భయపెట్టాలని చూస్తే ఆ భయం ఎలా ఉంటుందో నీకు చూపిస్తా' అంటూ మీసం మెలేస్తూ అధికార పార్టీకి చెందిన నంద్యాల జడ్పీటీసీ సభ్యుడు గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి.. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డికి బహిరంగ వార్నింగ్ ఇచ్చాడు. ఎమ్మెల్యే అరాచకాలు, కుయుక్తులన్నీ బయటపెడతానని హెచ్చరించడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని గోకుల్ కృష్ణారెడ్డి సీఎం జగన్‌ను కలిసి అభ్యర్థించారు. శిల్పా రవి స్థానికేతరుడని, ఈ దఫా స్థానికుడినైన తనకు టికెట్ ఇవ్వాలని వైసీపీ పెద్దలను కోరుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం 'స్థానికుల ఆత్మగౌరవ యాత్ర' పేరుతో ఓ కార్యక్రమానికి పిలుపిచ్చారు. అయితే ఆ యాత్రకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. అయినా పట్టించుకోకుండా నంద్యాల మండలం భీమవరం నుంచి తన అనుచరులు, గ్రామస్థులతో భారీ ర్యాలీగా నంద్యాల చేరుకున్నారు. అక్కడే మోహరించిన పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది.

పెద్దిరెడ్డికి నిరసన సెగ

- మంత్రి కాన్వాయ్‌కు అడ్డంపడిన వైసీపీ ప్రజాప్రతినిధులు
- నాలుగేళ్లుగా తిరుగుతున్నా నీళ్ల బిల్లులు ఇవ్వడం లేదని నిలదీత


వి.కోటలో మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న వైసీపీ నేతలు

వి.కోట, జనవరి 24: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కారును అధికార పార్టీ ఎంపీటీసీలు, సర్పంచులు అడ్డుకున్నారు. చిత్తూరు జిల్లా వి.కోటలో బుధవారం సొంత పార్టీ నుంచి ఎదురైన నిరసనతో మంత్రి కంగుతిన్నారు. వీరంతా కుప్పం, పలమనేరుల్లో వేసవిలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు నాలుగున్నరేళ్లుగా రాకపోవడంతో ఆగ్రహంగా ఉన్నారు. పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో బుధవారం కుప్పం పర్యటనకు వెళ్తున్న మంత్రి వాహనాన్ని వి.కోట అంబేడ్కర్ కూడలి వద్ద నేతలు అడ్డుకున్నారు. నాలుగున్నరేళ్లుగా నీటి బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని మంత్రికి చెప్పారు. 'బిల్లులకు సంబంధించిన టోకెన్లు తనకు ఇస్తే తక్షణం చర్యలు తీసుకుంటా'నని మంత్రి వారికి చెప్పారు. తిరుగు ప్రయాణంలో మంత్రిని కలిసేందుకు పలమనేరు, కుప్పం సెగ్మెంట్లకు చెందిన నీళ్ల బాధితులు దాదాపు వంద మంది దానమయ్యగారిపల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్రజాప్రతినిధులు పోలీసులతో వాగ్వాదం చేస్తుండగా.. అక్కడకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి కారు ఆపి, బాధితులతో మాట్లాడారు. వి.కోట మండలానికి రూ.5 కోట్ల మేరకు బిల్లులు ఇవ్వాల్సి ఉందని, ఎన్నికల షెడ్యూల్ వస్తే తమ గతి ఏమిటని వారు ప్రశ్నించారు. నీటి బిల్లులు అప్‌లోడ్ చేశారని, త్వరలో బకాయిలన్నీ విడుదల చేస్తామని మంత్రి వారికి చెప్పారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధులే తన వాహనాన్ని అడ్డగించడంతో స్థానిక నేతలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఇంత తీవ్రంగా ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని వారిపై మండిపడినట్టు తెలిసింది.

జంప్ జిలానీ!!

టీడీపీలోకి భారీ వలసలు!

- చంద్రబాబు సమయం కోరిన డజను మంది వైసీపీ ఎమ్మెల్యేలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాబోయే ఎన్నికలకు అభ్యర్థుల ఖరారు వ్యవహారం.. అధికార పక్షం వైసీపీలో పెద్ద చిచ్చే రేపినట్లు కనిపిస్తోంది. సీఎం జగన్ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆ పార్టీ సిటింగ్ ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో టీడీపీ వైపు చూస్తున్నారు. తమ అధినేత చంద్రబాబును కలవడానికి సుమారు డజను మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఆయన సమయం కోరినట్లు టీడీపీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వీరిలో 8 మంది ప్రస్తుతం హైదరాబాద్‌లో మకాం వేసి ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లి భేటీ అవడానికి సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరిలో రాయలసీమ ఎమ్మెల్యేలు ముగ్గురు, కోస్తాకు చెందిన ఐదుగురు ఉన్నట్లు సమాచారం. 'చంద్రబాబు సమయం కోరిన ఎమ్మెల్యేల్లో ఐదుగురం హైదరాబాద్‌లో కలుసుకున్నాం. అన్నీ మాట్లాడుకున్నాం. కుదిరితే టికెట్ ఇవ్వాలని.. లేని పక్షంలో మాకు తగిన గౌరవం ఇవ్వాలని ఆయన్ను కోరుతున్నాం. వైసీపీలో వాతావరణం చాలా అసహ్యంగా ఉంది. ఎమ్మెల్యేలను మనుషులుగా కూడా చూడడం లేదు. అది భరించలేకే బయటకు రావాలనుకుంటున్నాం. రాష్ట్రంలో ప్రభుత్వం మారబోతోందని స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజల మనోభావాలకు అనుగుణంగా మేం వ్యవహరిస్తున్నాం' అని వీరిలో ఒక ఎమ్మెల్యే చెప్పారు. తమను మరి కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు సంప్రదిస్తున్నారని.. కొద్ది రోజుల్లో చాలా మార్పులు ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. రాయలసీమలో ఒక మాజీ మంత్రి ఆయనతో మాట్లాడినట్లు సమాచారం.

ఓటర్ల జాబితా ప్రకటించాక..

అయితే వైసీపీ ఎమ్మెల్యేలను చేర్చుకునే విషయంలో టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. వారిని అధికారికంగా చేర్చుకోవడానికి కొంత సమయం తీసుకోవాలని భావిస్తోంది. పార్టీ మారిన వైసీపీ ఎమ్మెల్యేలపై ఆగమేఘాలపై అనర్హత వేటు వేసేందుకు అధికార పక్షం కాచుకుని కూర్చుంది. దీనివల్ల రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీకి పడే ఓట్లు తగ్గిపోతాయి. ఆ ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల(ఎమ్మెల్యేల) జాబితాను కొద్ది రోజుల్లో కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించనుంది. ఆ జాబితా ప్రకటించిన తర్వాత అందులో ఓటర్లుగా ఉన్న ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం సాధ్యం కాదు. వేసినా వారి ఓటు హక్కును తీసివేయలేరు. ఈ జాబితా ప్రకటన వరకూ ఆగి తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలను అధికారికంగా చేర్చుకోవాలని టీడీపీ భావిస్తున్నట్లు సమాచారం.

లావుకే నరసరావుపేట టీడీపీ టికెట్

వైసీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు త్వరలో తమ పార్టీలోకి వస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆయనకు నరసరావుపేట సీటే ఇచ్చే అవకాశం ఉందని వెల్లడించాయి. ఆయనతోపాటు పల్నాడు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు చేరబోతున్నట్లు చెబుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్సీలు, ఒక మాజీ ఎమ్మెల్యే ఈ జాబితాలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 'పల్నాడు జిల్లాలో వైసీపీకి పెద్ద గండి పడుతోంది. ఎన్నికలు రావడానికి బాగా ముందే ఆ పార్టీ దుకాణం ఖాళీ అవుతోంది' అని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు అధికార పక్ష శిబిరంలో భారీ కలకలం రేపుతున్నాయి. పార్టీ మారబోతున్నారని ప్రచారం జరుగుతున్న ఎమ్మెల్యేలను ఆపడానికి వైసీపీ పెద్దలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఈ వార్తలు ప్రసారం చేయవద్దని మీడియాపై ఒత్తిడి తెస్తున్నారు.

27 నుంచి మళ్లీ చంద్రబాబు సభలు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభలు ఈ నెల 27వ తేదీ నుంచి మళ్లీ ప్రారంభం కానున్నాయి. 'రా..కదలిరా' పేరుతో సభలు నిర్వహిస్తున్న ఆయన.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు కోసం తన పర్యటనకు 5 రోజులపాటు విరామం ఇచ్చారు. మళ్లీ శనివారం నుంచి పర్యటనలు ప్రారంభిస్తున్నారు. 3 రోజులపాటు 6 జిల్లాల్లో ఈ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఖరారైన కార్యక్రమం ప్రకారం ఈ నెల 27న అన్నమయ్య జిల్లా పీలేరు, అనంతపురం జిల్లా ఉరవకొండ, 28న నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రూరల్, పత్తికొండ, 29న రాజమహేంద్రవరం జిల్లాలోని రాజమండ్రి రూరల్, గుంటూరు జిల్లాలోని పొన్నూరుల్లో సభలు జరగనున్నాయి.

ధర్మారెడ్డి, వేమిరెడ్డిపై సీబీఐ విచారణ జరగాలి

- కేసుల నుంచి బయట పడేసేందుకే జడ్జికి వజ్రాల వాచ్
- దీనిపై ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలి: వర్ల

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తికి రూ.రెండు కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన వాచ్ ఇవ్వజూపిన వ్యవహారంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై సీబీఐ విచారణ జరగాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో 'వజ్రాలు పొదిగిన బంగారు వాచ్' శీర్షికతో వచ్చిన వార్తను ప్రస్తావిస్తూ ఆయన పలు ప్రశ్నలు వేశారు. 'జగన్‌రెడ్డి పలు కేసుల్లో ముద్దాయి. విచారణ సరిగా సాగితే యావజ్జీవ శిక్ష పడుతుంది. ఆయన కేసుల నుంచి బయటపడేందుకు ఎక్కని గడప లేదు, మొక్కని దేవుడు లేడు. నానా గడ్డి తినైనా ఈ కేసుల నుంచి బయటపడాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగానే 2021లో కరోనా సమయంలో ఏపీ హైకోర్టు జడ్జికి ఇద్దరు పెద్ద మనుషులు... టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ గిఫ్ట్ ఇవ్వబోయారు. గతంలో గాలి జనార్దన్‌రెడ్డి కూడా బెయిల్‌పై బయటకు రావడానికి జడ్జికి రూ.100 కోట్ల లంచం ఇవ్వడానికి ఒప్పందం జరిగింది. హైకోర్టు జడ్జి దానిపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసినా.. సుప్రీం కోర్టు ఎందుకు విచారణ జరిపించలేదు? ఇప్పటికైనా హైకోర్టు జడ్జి ఫిర్యాదుపై విచారణ జరిపించాలి. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి కింగ్ ఆఫ్ లాబీయింగ్, పైరవీ స్పామాట్. ఆయన బతుకంతా తిరుమలకు వచ్చే ప్రముఖులను ప్రసన్నం చేసుకోవడమే. ఢిల్లీలో వైఎస్ కుటుంబానికి పైరవీలు చేస్తుంటాడు. ధర్మారెడ్డి లాంటి వ్యక్తి టీటీడీలో ఉండటం సిగ్గుచేటు. టీటీడీ డాలర్ల కుంభకోణంలో ధర్మారెడ్డి పీఏ ఆత్మహత్య చేసుకోలేదా? రూ.2 కోట్లు ఎవరి ఐటీ రిటర్న్‌లో చూపించారో తేలాలి. జగన్ దగ్గర తీసుకున్నారా? లేదా దేవుడి ఖాతా నుంచి తీసుకెళ్లారో తేలాలి' అని వర్ల డిమాండ్ చేశారు.

పార్టీ మారకముందే ప్రతాపం!

- అద్దంకి వైసీపీ నేత కృష్ణచైతన్య క్వారీపై దాడులు.

బాపట్ల-ఆంధ్రజ్యోతి/బల్లికురవ, జనవరి 24: వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారనే ప్రచారం మాత్రమే జరిగింది తప్ప సదరు నేత పెదవి విప్పనేలేదు. ఊహాగానాలకే పాలకపక్షం ఉలిక్కిపడింది.. తనకు అలవాటైన రీతిలో వ్యవస్థల దుర్వినియోగానికి తెగబడి క్షణాల్లో మైనింగ్ విభాగాన్ని రంగంలోకి దింపి ఆయన గ్రానైట్ క్వారీపై దాడులు చేయించింది. వైసీపీలో ఉంటే ఓకే.. లేకపోతే వేధింపులు తప్పవని తద్వారా బెదిరించింది. శాప్‌నెట్ చైర్మన్, మొన్నటి వరకు బాపట్ల జిల్లా అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా ఉండి.. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్న బాచిన కృష్ణచైతన్య విషయంలో వైసీపీ నాయకత్వం వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీలోనే కలకలం రేపుతోంది. ఇటీవల అద్దంకి ఇన్‌చార్జిగా కృష్ణచైతన్యను తప్పించిన సీఎం జగన్... ఆయన స్థానంలో పాణెం హనిమిరెడ్డిని నియమించారు. దీనిని కృష్ణచైతన్య తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీలోనే ఉంటూ మండలాలవారీగా తన వర్గంతో సమావేశాలు నిర్వహిస్తూ.. చివరి నిమిషంలోనైనా సీటు తనకే వస్తుందని చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే రెండుసార్లు తాడేపల్లి వెళ్లి వైసీపీ పెద్దలను కలిశారు కూడా. అటు నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఆయన టీడీపీ గూటికి చేరతారని ఆయన అనుచరులు మంగళవారం పెద్దఎత్తున ప్రచారం చేశారు. అంతే.. వైసీపీ పెద్దల ఆదేశాలతో గనులశాఖ అధికారులు బుధవారం ఉదయానికల్లా బల్లికురవ మండల పరిధిలోని ముల్లాయపాలెంలో ఆయనకు చెందిన అర్హా స్టోన్స్ గ్రానైట్ క్వారీపై పడ్డారు. బాపట్ల నుంచి వచ్చిన మైనింగ్ ఆర్ఐ రాజు, సర్వేయర్ ఆసీఫ్ క్వారీలో తనిఖీలు నిర్వహించారు. కొలతలు వేయడంతో పాటు ఇతరత్రా నిబంధనలు పాటిస్తున్నారో లేదో ఆరా తీశారు. క్వారీ నలువైపులా ఉన్న హద్దులను, క్వారీలో ఉన్న రాళ్లను, వ్యర్థాలను పరిశీలించి నివేదికలను తయారుచేశారు. వీటి ఆధారంగా రెండు మూడు రోజుల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తారని తెలుస్తోంది. తనిఖీలతో క్వారీలో పనులు నిలిచిపోయాయి. కృష్ణచైతన్యపై ఒత్తిడి పెంచేందుకు ఆయన క్వారీలపై పెద్దమొత్తంలో జరిమానా విధించేలా ఒత్తిళ్లు తెస్తున్నారు. కాగా, క్వారీలో తనిఖీల వెనుక జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఉందని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. అద్దంకి ఇన్‌చార్జి నియామకంలో ఆయనే సీఎంను తప్పుదోవ పట్టించారని గతంలో కృష్ణచైతన్య పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. ఈ ఉదంతంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చైతన్యకే మద్దతిచ్చారు.

త్వరలో చంద్రబాబుతో భేటీ!

తాజా పరిణామాల నేపథ్యంలో కృష్ణచైతన్య, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య 2-3 రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబుతో సమావేశం కానున్నట్లు సమాచారం. ప్రభుత్వం కక్షసాధింపులకు దిగడంతో వారిరువురూ ఇక వైసీపీలో కొనసాగే అవకాశాలు లేవని, పార్టీ మారడం ఖాయమేననే ప్రచారం సాగుతోంది. టీడీపీలో చేరడం లాంఛనమేనని చెబుతున్నారు. కాగా, వైసీపీలోకి వచ్చేందుకు నిరాకరించిన అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆర్థిక మూలాలపైనా జగన్ ప్రభుత్వం తరచూ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన క్వారీలపై తరచూ దాడులు, రూ.వందల కోట్ల జరిమానాలు విధించి లొంగదీసుకునే ప్రయత్నం చేసింది. పెద్దఎత్తున కేసులు కూడా పెట్టింది. ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టినా రవికుమార్ బెదరలేదు.

పాపాఘ్ని ఒడ్డున ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోండి

- కోర్టుకు తెలిపిన వివరాలు అఫిడవిట్ రూపంలో సమర్పించండి
- అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్ర మండలంలో పాపాఘ్ని నది ఒడ్డున ఇసుక అక్రమ తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, మైనింగ్‌శాఖల అధికారులను హైకోర్టు ఆదేశించింది. నది వెంబడి ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలూ జరగడం లేదని, అనుమతులు కూడా ఇవ్వలేదన్న ప్రభుత్వ న్యాయవాదుల వాదనలను నమోదు చేసింది. వివరాలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. జంబుగానిపల్లి గ్రామ సమీపంలో పాపాఘ్ని ఒడ్డున ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని, ఇసుక అక్రమ మైనింగ్‌ను నిలువరించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి, డి.వెంకటరమణ, రెడెప్ప హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎం.లక్ష్మీనారాయణ, ప్రభుత్వం తరఫున న్యాయవాదులు శుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్ వాదనలు వినిపించారు.

విప్ అయితే నాకేంటి?

వెంకటరెడ్డి ఆఫీసులో ఎవరైనా దిగదుడుపే.. సామినేని ఉదయభానుకు తీవ్ర అవమానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఎమ్మెల్యేగా ఎక్కడైనా పెత్తనం చెలాయించవచ్చు! కానీ... అక్కడ మాత్రం మీ పప్పులుడకవు! ఎమ్మెల్యేగిమ్మెల్యే జాన్తానై! ఎందుకంటే... అది గనులశాఖ మేనేజింగ్ డైరెక్టర్ 'వెంకట రెడ్డి' ఆఫీస్! వెంకట రెడ్డి సంగతి పక్కనపెడితే... ఓ డిప్యూటీ మేనేజర్ స్థాయి అధికారిణి సీనియర్ ఎమ్మె ల్యే ప్రభుత్వ విప్‌తో లెక్కలేనట్లుగా మాట్లాడారు. ఏం చేయాలో అర్థంకాక ఆయన మౌనంగా అక్కడి నుంచి వెనక్కి వచ్చి... స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు ఈ చేదు అనుభవం ఎదురైంది. ఉదయభాను తన నియోజకవర్గంలోని పని నిమిత్తం ఈనెల 10వ తేదీన ఏపీఎండీసీ ఎండీ వి.జి.వెంకటరెడ్డి కార్యాలయానికి వెళ్లారు. ఎండీతో భేటీ అనంతరం... హెచ్‌ఆర్‌డీ విభాగం డిప్యూటీ మేనేజర్ కళావతిని కలిసేందుకు ఆమె చాంబర్‌లోకి ఎమ్మెల్యే వెళ్లారు. ఆమె కూర్చోమని కూడా చెప్పలేదు. ఆయన అధికార పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే పైగా... ప్రభుత్వ విప్! అయినప్పటికీ... ఆయనెవరో ఆ అధికారిణికి తెలియలేదు అనుకుందాం! దీంతో... తాను జగ్గయ్యపేట ఎమ్మెల్యేనని, ప్రభుత్వ విప్‌నని ఆయనే చెప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా సీన్ మారలేదు. ఆమె ఎంతో సీరియస్ పని ఉన్నట్లుగా కాగితాలు తిరగేసుకుంటూ అలాగే కూర్చున్నారు. అప్పటికే మూడు నాలుగు నిమిషాలు కావడంతో... ఏపీఎండీసీలో మీ స్థాయి ఏమిటని ఎమ్మెల్యే ఉదయభాను ప్రశ్నించారు. దీంతో ఆమెకు చిర్రెత్తుకొచ్చి నట్లుంది. "నా స్థాయి ఏమిటో తెలుసా? నేను ఎవరో తెలియకుండానే నా చాంబర్‌లోకి వచ్చారా?" అంటూ ఆమె తీవ్ర స్వరంతో మాట్లాడారు. దీంతో ఎమ్మెల్యే షాక్‌కు గురయ్యారు. మహిళా అధికారిణి కావడంతో సంయమనం పాటించి... తీవ్ర అవమానంతో ఆమె చాంబర్ నుంచి బయటకు వచ్చేశారు.

స్పీకర్‌కు ఫిర్యాదు...

ఈ సంఘటన జరిగిన మరుసటి రోజే... అంటే ఈ నెల 11వ తేదీన తనకు జరిగిన అవమానాన్ని వివరిస్తూ స్పీకర్‌కు ఉదయభాను ఫిర్యాదు చేశారు. శాసనసభ్యుడినైన తన హక్కులకు ఏపీఎండీసీ అధికారిణి భంగం కలిగించారని, తనను అవమానించారని, ఆమెపై తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ అంశాన్ని సభా హక్కుల కమిటీ దృష్టికి తీసుకెళ్లి సమావేశం ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

అసెంబ్లీ కార్యదర్శి లేఖ..

ఎమ్మెల్యే ఉదయభాను ఫిర్యాదుపై స్పందిస్తూ... ఏపీఎండీసీ అధికారిణి నుంచి వివరణ తీసుకునేందుకు అసెంబ్లీ కార్యదర్శి పీపీకే రామాచార్యులు గనులశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి లేఖ రాశారు. "ఏపీఎండీసీ హెచ్‌ఆర్‌డీ డిప్యూటీ మేనేజర్ కళావతిపై ఎమ్మెల్యే సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. తనను తీవ్రంగా అగౌరవపరిచి, అవమానించినట్లుగా కనీస గౌరవ మర్యాదలు పాటించలే దని ఎమ్మెల్యే తన నోటీసులో పేర్కొన్నారు. కాబట్టి సంబంధిత అధికారిణి నుంచి వివరణ తీసుకుని నివేదించండి" అని అసెంబ్లీ కార్యదర్శి పేర్కొన్నారు.

ఏం కాదులే.. మేం చూసుకుంటాం!

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యేలు చెడుగుడు ఆడుకున్న ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. అలాంటిది, ఉదయభానులాంటి నాయకుడిని లెక్కచేయని అధికారిణిపై ఎంత కఠినమైన చర్యలు తీసుకుని ఉంటారో! అనుకుంటే తప్పులో కాలేసినట్టే. గనుల శాఖ ఆ మహిళాధికారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యా తీసుకోలేదు. అసెంబ్లీ కార్యదర్శి నుంచి లేఖ అందినట్లు తెలిసినా... "ఏం కాదులే! మేం చూసుకుంటాం" అని ఏపీఎండీసీ ఉన్నతాధికారి అభయం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో చర్యలు, శాఖాపరమైన విచారణ ఉండదని తేలిపోయింది. గనుల శాఖ ఉన్నతాధికారి 'పవర్' ముందు ఇంకెవరూ నిలబడలేరని స్పష్టమైంది.

వైఎస్ కొడుకుగా పుట్టి.. ఇలా చేస్తావా జగనన్నా?

- సీఎంపై పీసీసీ చీఫ్ షర్మిల నిప్పులు


విశాఖలోని కూర్మన్నపాలెంలో స్టీల్ ప్లాంటు కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న షర్మిల

విశాఖపట్నం/అనకాపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటును సర్వనాశనం చేస్తున్నారని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకుగా పుట్టి.. గంగవరం పోర్టును రూ.600 కోట్లకు అదానీకి కట్టబెట్టేశారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. సుమారు రూ.70 వేల కోట్ల విలువ చేసే గంగవరం పోర్టును నిబంధనలను తుంగలో తొక్కి. కేవలం రూ.600 కోట్లకు అదానీకి కట్టబెట్టిన ఘనత జగనన్న గారికే దక్కుతుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల ఆస్తిగా భావించిన వైఎస్.. వాచ్‌మన్‌గా మారి వాటిని రక్షించారని తెలిపారు. అలాంటి నేత కడుపున పుట్టిన జగన్ మాత్రం గంగవరం పోర్టును అప్పనంగా, కారుచౌకగా అదానీకి అప్పగించడం న్యాయమా? అని ప్రశ్నించారు. కుమ్మక్కు రాజకీయాలు, స్వలాభం కోసం ప్రజల సొమ్మును, ప్రజలను జగన్ తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంటులో 30వేల మంది ఉద్యోగులకు భరోసా లేకుండా పోయిందని, కనీసం వారికి భరోసా కల్పించలేకపోవడం జగనన్న పరిపాలనా వైఫల్యం కాదా? అని నిలదీశారు. విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో బుధవారం స్థానిక హోటల్‌లో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. "ప్రత్యేక హోదా ఎజెండాతో ఎన్నికలకు వెళ్లి విజయం సాధించిన జగనన్న గారు.. గడిచిన నాలుగున్నరేళ్లలో ఏనాడైనా బీజేపీని నిలదీశారా?" అని షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ.. బీజేపీతో కంటికి కనిపించని పొత్తు పెట్టుకుందన్నారు. కేంద్రం మెడలు వంచి తెస్తానన్న ప్రత్యేక హోదా ఏమైందన్నారు. ఈ సందర్భంగా షర్మిల సమక్షంలో పలు పార్టీలకు చెందిన నాయకులు సుమారు వంద మంది కాంగ్రెస్‌లో చేరారు.

ఒక్క రాజధానినీ లేకుండా చేశారు

పోలవరానికి 90 శాతం నిధులు ఇస్తామన్న కేంద్రాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించలేకపోతోందని షర్మిల అన్నారు. రాష్ట్రానికి కనీసం రాజధాని లేకుండా చేశారని దుయ్యబట్టారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. కూర్మన్నపాలెంలో 1,077 రోజులుగా కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని బుధవారం రాత్రి ఆమె సందర్శించి సంఘీభావం ప్రకటించారు. 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని షర్మిల నినదించారు. రాహుల్‌గాంధీని ఇక్కడకు తీసుకువచ్చి ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాదని మాట ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఉక్కు అంశాన్ని పొందుపరుస్తామన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరిగితే రాష్ట్రమంతా సిగ్గుపడాలన్నారు.

వార్తలు, క్లిప్పింగులు ఆధారాలు కావు

- సభలో విప్ ఉల్లంఘిస్తేనే అనర్హత వేటు
- గతంలో ఉమ్మడి హైకోర్టు తీర్పుపై టీడీపీ నేతల అధ్యయనం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీలోకి మారిన వైసీపీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో.. ఈ అంశానికి సంబంధించి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ఒకటి తెరపైకి వచ్చింది. ఈ తీర్పును ప్రస్తుతం టీడీపీలోని న్యాయవాద వర్గాలు అధ్యయనం చేస్తున్నాయి. వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో 9మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి మారారు. అప్పటి స్పీకర్ వారిపై అనర్హత వేటు వేయడంతో హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ మారినట్లుగా సభ వెలుపల చేసిన వ్యాఖ్యలు, వీడియో క్లిప్పింగుల వంటివి ప్రాథమిక సాక్ష్యం కిందకు రావని, సభలో విప్‌ను ఉల్లంఘించినట్లుగా సాక్ష్యం లేనందువల్ల అనర్హత వేటు చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు టీడీపీలోకి మారిన నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలకు పంపిన నోటీసుల్లో వారు పార్టీ మారినట్లుగా సాక్ష్యం కింద పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగులు, టీవీల్లో వచ్చిన వీడియో క్లిప్పింగులను స్పీకర్ కార్యాలయం జత చేసింది. అనర్హత చట్టం కింద ఎమ్మెల్యేలు సమాధానం ఇవ్వడానికి నెల నుంచి 2నెలల సమయం ఇవ్వాల్సి ఉంటుందని, తమకూ అంతే సమయం ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరారు. కానీ స్పీకర్ వారం రోజులే గడువిచ్చారు. ఈ అంశాలపై సదరు ఎమ్మెల్యేలు న్యాయ నిపుణులను సంప్రదించినట్లు సమాచారం. కాగా, టీడీపీ నుంచి వైసీపీలోకి మారిన నలుగురు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలని టీడీపీ శాసనసభాపక్షం కొద్ది రోజుల క్రితం స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై చంద్రబాబుకు స్పీకర్ నోటీసు పంపారు. ఆ పార్టీ అధ్యక్షుడిగా తన వైఖరి తెలపాలని, తన వద్ద ఉన్న సాక్ష్యాధారాలను సమర్పించాలని అందులో కోరారు.

షోకాజ్‌పై వివరణకు నెల గడువివ్వండి!

నెల్లూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికల్లో విప్‌ను ధిక్కరించి ఓటు వేసినందుకు సంజాయిషీ కోరుతూ స్పీకర్ తమ్మినేని సీతారాం పంపిన షోకాజ్ నోటీసులు బుధవారం నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలకు అందాయి. దీనిపై వివరణ ఇవ్వడానికి తమకు నెల రోజులు గడువు ఇవ్వాలని స్పీకర్‌ను కోటంరెడ్డి కోరారు. మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఇదే తరహాలో నెల గడువు కోరినట్లు తెలిసింది.

మూడేళ్ల క్రితం రాజీనామా... ఇప్పుడు ఆమోదమా?

- నిబంధనలు పాటించకపోవడంపై న్యాయ పోరాటం: గంటా



విశాఖపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం తాను చేసిన రాజీనామాను ఇప్పుడు తనను సంప్రతించకుండా స్పీకర్ ఆమోదించడంపై న్యాయ పోరాటం చేస్తానని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం 2021 ఫిబ్రవరి 12న ఎమ్మెల్యే పదవికి రాజీనామా లేఖను స్వయంగా స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు అందించా. తరువాత పలు పర్యాయాలు స్పీకర్‌ను కలిసి నా రాజీనామాను ఆమోదించాలని కోరా. అప్పటి నుంచి ఇప్పటివరకూ రాజీనామా లేఖను కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచారు. ఇప్పుడు రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయని ఆమోదించడం నిబంధనలకు విరుద్ధం. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ సీఎం కనుసన్నల్లో పనిచేస్తున్నాయని చెప్పడానికి నా రాజీనామా ఆమోదమే ఉదాహరణ. ఇప్పటికీ రాజీనామాకు కట్టుబడే ఉన్నాను. ఆమోదం విషయంలో నిబంధనలు పాటించకపోవడంపై న్యాయపోరాటం చేస్తా' అని గంటా అన్నారు.

జగన్, షర్మిల... కాంగ్రెస్ ప్రతినిధులే: దినకర్

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'జగన్, షర్మిల ఇద్దరూ కాంగ్రెస్ ప్రతినిధులే. వారికి రామాలయం నిర్మాణం కన్నా అన్యమత వ్యాప్తి అంటేనే ప్రీతి' అని బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. 'మణిపూర్‌లో హింసాకాండ గురించి మాట్లాడుతున్న షర్మిల ఏపీలో మహిళలు, దళితులపై జరుగుతున్న అకృత్యాలు, అరాచకాలపై నాలుగున్నరేళ్లుగా ఎందుకు మాట్లాడలేదు? విభజన సమయంలో జగన్ పార్లమెంట్‌లోనే ఉన్నారు. సోనియాకు భయపడి విభజనకు వ్యతిరేకంగా దొంగచాటుగా ప్లకార్డు పట్టుకున్నారు. అప్పుడు షర్మిల జగన్‌ను ఎందుకు నిలదీయలేదు' అని దినకర్ నిలదీశారు.

బైరైటీస్‌లో

'వసూల్' రాజా

(మొదటి పేజీ తరువాయి)

దింపి బినామీ కంపెనీలను పుట్టించారు. మంగంపేట కేంద్రంగా బెరైటీస్ అమ్మకాల్లో అడ్డగోలుగా 650 కోట్లకు పైగా దోచేశారు. ఫ్యామిలీ ప్యాక్ దోపిడీపై వందలు, వేల ఫిర్యాదులు వచ్చినా చర్యల్లేవు. ప్రభుత్వంలో ఆ ఫిర్యాదుల ఆనవాళ్లు కనబడకుండా చేస్తూ అప్రతిహతంగా దోపిడీ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని అందించే ఏపీఎండీసీని గుల్ల చేస్తున్నారు. ఈ గజదొంగల దోపిడీ గురించి సర్కారుకు తెలిసినా అంతా అస్మదీయులే కావడంతో చూస్తూ ఊరుకుంటోంది.

నీదీ.. నాదీ కడపే

బెరైటీస్ మైనింగ్ నిల్వల్లో ప్రపంచంలో భారత్ రెండోస్థానంలో ఉంది. దేశీయంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోనూ గనులున్నా కడప జిల్లా మంగంపేట టాప్. కడప జిల్లాకు చెందిన ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్‌రాజా కూడా ఈ ప్రాంతం వారే. ఇక బంగారుకొండదీ ఇదే జిల్లా. బెరైటీస్ గనులపై ముందుగానే కన్నేసిన వసూల్‌రాజా తన పలుకుబడిని ఉపయోగించి బంగారుకొండను గనుల శాఖకు తీసుకొచ్చారు. తర్వాత వివిధ శాఖల్లో పనిచేస్తున్న కడప జిల్లాకే చెందిన మరో ముగ్గురు అధికారులను గనుల శాఖకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చారు. వీరిలో ఒకరు సీనియర్ అధికారి. వసూల్‌రాజా, బంగారుకొండ కలిసి ఓ బినామీ కంపెనీని తెరపైకి తెచ్చారు. దీని కన్నా ముందు నుంచే బెరైటీస్ వ్యాపారంలో పేరున్న అతిపెద్ద కార్పొరేట్ దిగ్గజాలను పక్కన పెట్టి మరీ ఆ కంపెనీకి పెద్దపీట వేశారు. విచిత్రం ఏమిటంటే ఆ కంపెనీ కూడా కడప జిల్లా వాసిదే. సీ గ్రేడ్ డంపింగ్ యార్డ్‌లోకి ఏ గ్రేడ్ బెరైటీస్‌ను తరలించి, దాన్ని అమెరికా, పశ్చిమాసియా దేశాలకు ఎగుమతి చేసి వందల కోట్ల లాభం ఆర్జిస్తున్నారు. వ్యాపారం వందల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడంతో బంగారుకొండ తన బావమర్దిని పర్యవేక్షకుడిగా పెట్టారు. చివరకు ఆ కంపెనీ తరపున పలు కీలకపత్రాలు, అగ్రిమెంట్లపై బావమర్దే సంతకం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఓ మహిళా అధికారి బెరైటీస్ వ్యాపారంలోకి దిగారు. ఆమెది కూడా కడపే. ఆమె తన భర్త, సోదరుడితో మూడు బినామీ కంపెనీలు ఏర్పాటు చేయించారు. ఆ కంపెనీలు కూడా బెరైటీస్‌ను దక్కించుకొని దేశ, విదేశాలకు ఎగుమతి చేశాయి. ఆ తర్వాత మంగంపేట కేంద్రంగా పనిచేసే ఓ కీలక అధికారి తన బావమర్దిని ఈ వ్యాపారంలోకి తీసుకొచ్చారు. రెండు బినామీ కంపెనీలను తెరమీదకు తీసుకొచ్చారు. దీన్ని చూసి మంగంపేటలోనే మరో అధికారి తన భార్య పేరిట కంపెనీ ఏర్పాటు చేసి వ్యాపారంలోకి వచ్చారు. ఏపీఎండీసీలో కీలకస్థాయిలో ఉన్న మరో అధికారి (ఇటీవల పదవీ విరమణ చేశారు) కూడా అదే పనిచేశారు. అయనా తన భార్య, సోదరుడి పేరిట వ్యాపారం నిర్వహించారు. ఇలా పరోక్షంగా, ప్రత్యక్షంగా వ్యాపారంలోకి దిగిన అధికారులు.. కొనుగోలు చేసిన బెరైటీస్‌ను ఒక్క వ్యాపారికే అమ్మారని తెలిసింది. ఆయన బెరైటీస్‌ను పౌడర్‌గా మార్చి విదేశాలకు ఎగుమతి చేసినట్లు తెలిసింది. నాలుగున్నరేళ్లుగా ఈ దందా అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది. ఓ అధికారి గతేడాది రిటైరయినా ఇప్పటికీ దందా సాగిస్తున్నారు.

బంగారుకొండ మౌఖిక ఆదేశాలతో..

బెరైటీస్ దోపిడీ ఎలా చేయాలి? సీ గ్రేడ్ యార్డ్‌లో ఏ గ్రేడ్ బెరైటీస్‌ను ఎలా డంప్ చేయాలి? దాన్ని ఎలా దేశం దాటించాలి? వంటి విషయాల్లో వసూల్‌రాజా ప్లాన్ ఇస్తే, దాన్ని గనుల ఘనుడు బంగారుకొండ అమలు చేశారని తెలిసింది. అయితే ఏ పనీ లిఖితపూర్వకంగా, పేపర్‌పై ఉండదు. అన్నీ మౌఖిక ఆదేశాలు, నోటిమాటలే. అధికారుల బినామీ కంపెనీలకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకు సీ గ్రేడ్ డంపింగ్ యార్డులోకి ఏ గ్రేడ్ బెరైటీస్‌ను గుట్టుగా ఎలా తరలించాలో బంగారుకొండ ఇచ్చే మౌఖిక సూచనలు, సలహాలను మంగంపేటలోని అధికారి పాటించారు. మధ్యలో కొందరు అధికారులు, పరిశోధకులు అభ్యంతరం చెప్పినా బేఖాతరు చేశారు. చివరకు అడ్డొచ్చిన వారిని తప్పించి పని పూర్తి చేశారు. ఇలా గత నాలుగున్నరేళ్ల కాలంలో 30 శాతం ఏ గ్రేడ్ బెరైటీస్‌ను గుట్టుగా సీ గ్రేడ్ కింద చూపి బినామీ కంపెనీలకు అప్పగించినట్లు తెలిసింది. దీని విలువ 650 కోట్లపై మాటేనని ప్రాథమిక అంచనా.

వ్యాపారంలో భేదాభిప్రాయాలు

దోపిడీకి జట్టు కట్టిన వారిలో ఎక్కువ మంది కడప జిల్లాకు చెందినవారే అయినా ఆ బంధం ఎక్కువకాలం నిలబడలేదు. పంపకాల్లో తేడాలు రావడం, ఓ మహిళాధికారి నిర్వాకంతో తిప్పలు తెచ్చిపెట్టింది. బినామీ వ్యాపారాలు చేస్తున్నారన్న సంగతి బయటకు వెళ్లింది. దీంతో గనుల శాఖలో, అటు కడప జిల్లా వైసీపీలో అగ్గిరాజుకుంది. దాన్ని చల్లార్చేందుకు వెంటనే వసూల్‌రాజా ఆ మహిళాధికారిని గనుల శాఖ నుంచి తప్పించి సొంత విభాగానికి పంపారు. వారి వ్యాపారం మూతపడిపోయింది. ఆ తర్వాతే దోపిడీ ముఠా గుట్టు మరింతగా బయటకొచ్చింది. విషయం ప్రభుత్వ పెద్దల దాకా వెళ్లింది. ఫ్యామిలీ ప్యాక్ వ్యాపారాల దోపిడీపై గనుల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విజిలెన్స్ విచారణకు మంత్రి సిఫారసు చేశారు. తొలుత మంగంపేటలో పనిచేస్తున్న ఓ కీలక అధికారిని సస్పెండ్ చేశారు. కానీ ఆయనతో తప్పులమీద తప్పులు చేయించిన బంగారుకొండ, ఆయన వెనకున్న వసూల్‌రాజా సేఫ్‌గా ఉన్నారు.

నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం నిర్ణయం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించాయి. నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రుల యాజమాన్య సంఘం పేర్కొంది. నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ సమ్మె నోటీసులు ఇవ్వడం, ప్రభుత్వం వారిని బుజ్జగించడం... ఓ తంతులా మారింది. గత ఏడాది డిసెంబరు 29 నుంచి సేవలు నిలిపివేస్తున్నట్లు కొంతకాలం క్రితం నోటీసులు ఇచ్చింది. వెంటనే చర్చలు జరిపిన ప్రభుత్వం... సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం మాటను నమ్మిన ఆసుపత్రుల యాజమాన్య సంఘం సమ్మె విరమించుకుంది. 20 రోజులుగా ప్రభుత్వంతో నాటి హామీల అమలుపై చర్చలు జరుగుతున్నా... ప్రభుత్వం నుంచి సానుకూలమైన హామీ ఆస్పత్రులకు లభించలేదు. విసిగిన యాజమాన్యాలు సేవలు నిలిపివేయాలని నిర్ణయించాయి. జనవరి 25, గురువారం నుంచి మొత్తం సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం అడ్మిషన్లలో ఉన్న రోగులకు మాత్రం యథావిధిగా ఆరోగ్య సేవలు కొనసాగిస్తారు. కొత్త రోగులకు ఎలాంటి అడ్మిషన్లు ఇవ్వరు. శస్త్ర చికిత్సల ప్యాకేజీలు పెంచాలని, బిల్లులు బకాయిలు లేకుండా వెంట వెంటనే విడుదల చేయాలని, ఆస్పత్రులు, ట్రస్ట్ మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. వీటిల్లో ఒక్కదాన్ని కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. ఇప్పటికే రూ.1,000 కోట్లు బకాయిలున్నట్లు తెలుస్తోంది.



అమరావతి సమరం..

అజరామరం!

రోజులు.. వారాలు.. నెలలు.. సంవత్సరాలు.. కాలగమనంలో కరిగిపోతున్నాయి.. కానీ అన్యాయంపై అమరావతి అన్నదాతలు సాగిస్తున్న సమరం అజరామరంగా సాగుతూనే ఉంది. కరోనాలు, లాక్‌డౌన్‌లు, తుఫానులు, విలయాలు, పోలీసుల దౌర్జన్యాలు, దాష్టీకాలు, కేసులు, అరెస్టులు, వేదింపులు, లాఠీల దెబ్బలు, తూటాల వంటి మాటలు ఇలా ఎన్ని ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా అమరావతి అన్నదాతలు సాగిస్తున్న పోరాటం సాగుతూనే ఉంది. 1500 రోజులుగా రాజధాని రైతులు, కూలీలు అమరావతి కోసం పోరాడుతూనే ఉన్నారు.



- మరో మైలురాయిని చేరిన రాజధాని మహోద్యమం
- నేటికి 1500 రోజుకు చేరిన మట్టి మనుషుల మహా పోరు
- దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా గుర్తింపు

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రం కోసం, రాజధాని కోసం వేలాది ఎకరాలు తృణప్రాయంగా త్యజించి, జగన్ ప్రభుత్వ నయవంచనకు బలై విధిలేని పరిస్థితిలో మొదలైన అన్నదాతల అమరావతి ఉద్యమం 1500 రోజులుగా కొనసాగుతూనే ఉంది. రాజధాని రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత, బహుజన బిడ్డలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని సాగిస్తూనే ఉన్నారు. పోలీసుల నిర్బంధాలు, లాఠీల కరాళ నృత్యాలు, దేహాలపై రక్తమోడుతున్న గాయాలు.. ఏవీ వారి పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి. అందుకే ఆ మహా మహోద్యమం మరిచిపోలేని విజయాలతో ముందుకు సాగిపోతోంది. దేశ చరిత్రలో సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచిపోయింది. దేవతల రాజధానిగా పేరొందిన ఏపీ సరికొత్త రాజధాని అమరావతిని నాశనం చేస్తూ వైసీపీ ప్రభుత్వం.. మూడు రాజధానుల ప్రకటన చేసింది మొదలు రాజధాని రైతులు ఉద్యమానికి దిగారు. అయితే, వీరి ఉద్యమాన్ని ఎప్పటికప్పుడు భగ్నం చేసేందుకు సర్కారు చేయని ప్రయత్నం లేదు. మహిళలు స్నానం చేసే సమయంలో డ్రోన్ కెమేరాలు తిప్పి.. దీనిని అడ్డుకున్న 40 మందిపై కేసులు పెట్టి 20 రోజులపాటు జైలుపాలు చేసింది ఇప్పటి వరకూ 2600 మందిపై 600కు పైగా కేసులు బనాయించారు. నాలుగేళ్లలో 250 మంది రైతులు గుండెలు పగిలి చనిపోయారు. బెదిరించడం, భయపెట్టడం, అవమానపరచడం, లేదంటే రెచ్చగొట్టడం, అదీ కాదంటే అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో కుక్కడం.. ఇలా రోజుకో రకంగా రైతులను వేధించారు. అయినా రైతులు వెనక్కి తగ్గలేదు.

నేటికి 1500 రోజులు!

అమరావతిని రక్షించుకోవడం కోసం మొదలైన అన్నదాతల ఉద్యమం గురువారం నాటికి 1500వ రోజుకు చేరింది. ఈ క్రమంలో రైతులు దీక్షా శిబిరాల్లో పలు కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. రాజధాని కోసం తపిస్తూ.. జగన్ సర్కారు చేసిన మోసంతో గుండెలు పగిలి మరణించిన రైతులు, రైతు కూలీలకు నివాళులర్పించనున్నారు. కౌలు చెల్లించకుండా వేధిస్తున్న ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత పెంచేలా సన్నాహాలు చేసుకుంటున్నారు.

పోరాటానికి నాంది ఇలా..

రాజధాని అమరావతి నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వానికి 29 గ్రామాల పరిధిలో ఉన్న 34,322 ఎకరాల భూములను 29,881 మంది రైతులు భూ సమీకరణ కింద ఇచ్చారు. వారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. కానీ 2019, డిసెంబరు 17న సీఎం జగన్ శాసన సభలో చేసిన మూడు రాజధానుల ప్రకటన రాజధాని వాసులను కుదిపేసింది. ఆ మర్నాడే రాజధాని ఉద్యమం ఊపిరిపోసుకుంది. తుళ్లూరు, మందడం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో మొదలైన ఉద్యమం క్రమంగా రాజధాని గ్రామాలను చుట్టేసింది. అదే నెల 19వ తేదీన రైతులు బంద్ నిర్వహించారు. ఈ ఉద్యమానికి అధికార వైసీపీ మినహా మిగిలిన పార్టీలన్నీ సంఘీభావం ప్రకటించాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్, అప్పటి బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, సీపీఐ, సీపీఎం కార్యదర్శులు రామకృష్ణ, మధు గ్రామాల్లో పర్యటించి రైతులకు మద్దతు తెలిపారు.

మహోజ్వల ఘట్టం.. పాదయాత్ర

అమరావతి ఉద్యమంలో రాష్ట్రం మొత్తాన్నీ ఏకం చేయాలన్న భావనతో 2021, నవంబరు 1న రైతులు చేపట్టిన 'న్యాయస్థానం టూ దేవస్థానం' పాదయాత్ర ఉద్యమ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. అప్పటి వరకు రాజధానిపై ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలన్నింటినీ ఈ పాదయాత్ర తిప్పికొట్టింది. నవంబరు 1న హైకోర్టు వద్ద మొదలై డిసెంబరు 17న తిరుమల శ్రీవారి చెంతకు చేరే వరకు 57 రోజుల పాటు ఈ యాత్ర సాగింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన సభకు రాయలసీమ వాసుల నుంచి అనూహ్య స్పందన లభించడం విశేషం. అమరావతి ఉద్యమం వెయ్యిరోజుల మైలురాయిని చేరిన సందర్భంగా రాజధాని రైతులు 'అమరావతి నుంచి అరసవల్లి' వరకు మహా పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రకు లభించిన ప్రజాదరణను చూసి ఓర్వలేని ప్రభుత్వం, అధికారపార్టీ నేతలు పాదయాత్రలో పాల్గొన్న మహిళలపై చేసిన దౌర్జన్యాలు, దాష్టీకాలకు అంతేలేదు.

రైతుల శపథం

ఉద్యమం 1100వ రోజుకు చేరిన సందర్భంగా రాజధాని గ్రామాల్లో రైతులు నిరసన దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ దమన నీతిని ఎండగట్టారు. అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని శపథం చేశారు. రాజధాని ఉద్యమం 1200 రోజును చేరిన సందర్భంగా మందడం దీక్షా శిబిరంలో 'దగా పడ్డ రైతు.. దోపిడీకి గురవుతున్న ఆంధ్రాపౌరులు' సదస్సు నిర్వహించారు. సదస్సుకు వచ్చిన బీజేపీ నేత సత్యకుమార్ '200 మంది రైతులను బలితీసుకున్న జగన్‌పై హత్యానేరం కింద కేసు పెట్టాలి' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సభ నుంచి తిరిగి వెళుతున్న క్రమంలో ఎంపీ నందిగం సురేశ్ వర్గం ఆయనపై దాడి చేసి కారును ధ్వంసం చేసింది.

న్యాయస్థానంలో నైతిక విజయాలు

మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. అమరావతిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మూడు నెలల్లోగా రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వాలని, ఆరు నెలల్లోగా రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలని సూచించింది. ప్రభుత్వం మాత్రం పట్టించుకోలేదు. తీర్పు వచ్చిన 8 నెలల వరకు మౌనంగా ఉండి, తర్వాత సుప్రీం కోర్టులో అప్పీలు చేయడంతో ప్రస్తుతం కేసు విచారణలో ఉంది.

ఉద్యమ ఘట్టాలు

- 2019 డిసెంబరు 17న శాసనసభలో సీఎం జగన్ మూడు రాజధానుల ప్రకటన చేశారు. మర్నాడే రాజధాని ఉద్యమం మొదలైంది.
- డిసెంబరు 31న తమకు కారుణ్య మరణాలకు అనుమతివ్వాలని కోరుతూ రైతులు రాష్ట్రపతికి లేఖలు రాశారు.
- 2020 జనవరి 3న ఉద్యమం చేస్తున్న అమరావతి మహిళలపై పోలీసులు దాడి చేశారు. దీనికి నిరసనగా రాజధాని గ్రామాలు బంద్ నిర్వహించాయి.
- జనవరి 9న ప్రతిపక్ష నేత చంద్రబాబు తలపెట్టిన బస్సు యాత్రను విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన అక్కడే బైఠాయించారు.
- 2020 జనవరి 10న బెజవాడ దుర్గమ్మకు ముడుపులు చెల్లించుకునేందుకు వెళ్తున్న మహిళలపై పోలీసులు దాడి చేశారు. వారి జుత్తు పట్టుకు లాగడం, ఇనుపకంచె వేసి ఒళ్లు చీరుకుపోయేలా చేయడం వంటి అనైతిక చర్యలపై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసింది.
- జనవరి 20న అమరావతి జేఏసీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ముఖ్య నాయకులందరినీ ముందస్తుగా అరెస్టు చేశారు. అయినప్పటికీ రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత బహుజనులు చెట్లు, పొదలు, తుప్పల మాటున అసెంబ్లీ చేరుకున్నారు. పురుష పోలీసులు మహిళలపై లాఠీలతో విరుచుకుపడ్డారు.
- మార్చి 20న కరోనా కారణంగా ప్రపంచం మొత్తం లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. అలాంటి సమయంలోనూ ఉద్యమం వెనకడుగు వేయలేదు.
- లాక్‌డౌన్‌లోనే అమరావతి ఉద్యమం వందోరోజు పూర్తి చేసుకుంది. 2020, ఏప్రిల్ 7న జాతీయ రహదారి దిగ్బంధం పిలుపు విజయవంతమైంది.
- జూలై 4 నాటికి ఉద్యమం 200 రోజులకు చేరుకుంది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో దీక్షలు చేపట్టారు. 200 నగరాల నుంచి ఎన్ఆర్ఐలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఉద్యమానికి మద్దతు తెలిపారు.
- అక్టోబరు 12 నాటికి ఉద్యమం 300 రోజులకు చేరుకుంది. ప్రాణాలు కోల్పోయిన రైతులకు నివాళిగా తుళ్లూరులో 'ఆత్మబలిదాన యాత్ర' భారీగా నిర్వహించారు.
- 2021 జనవరి 20 నాటికి ఉద్యమం 400 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతులు చేపట్టిన 'రాజధాని సంకల్ప ర్యాలీ' విజయవంతమైంది. అదే రోజు 'ఇన్‌సైడర్ ట్రేడింగ్' కేసును హైకోర్టు కొట్టేసింది.
- 2022, ఫిబ్రవరి 24నాటికి అమరావతి ఉద్యమం 800 రోజులకు చేరింది. యువకులు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ప్రదర్శనలు నిర్వహించారు. వీటితో పాటు రైతు గర్జన, జనభేరి కార్యక్రమాలను కూడా నిర్వహించారు.
- 2022 జూన్ 4 నాటికి ఉద్యమం 900 రోజులు పూర్తయింది. రైతులు న్యాయదేవతకు క్షీరాభిషేకం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


అంపాపురంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగించి అమ్మకానికి సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి

అంపాపురంలో ప్రభుత్వభూమి అన్యాక్రాంతం

మొన్నటి వరకు ప్రభుత్వ భూమి..! ఇప్పుడు ప్రైవేటు భూమి!

- సర్వే నెంబర్ 109-3లో డొంక భూమిపై రెవెన్యూ కన్ను
- పట్టాదారుల భూమి సహా డొంకనూ అమ్మేందుకు బిగ్ డీల్
- రెవెన్యూకు వాటా! పట్టాదారులతో డీల్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఈ చిత్రం చూశారా! మొన్నటి వరకు అది ప్రభుత్వ భూమి! ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించినచో శిక్షార్హులని బోర్డు పెట్టారు. ఇప్పుడా బోర్డు మాయమైంది. కాదు.. మాయం చేశారు. ఎందుకంటే ఈ భూమిని అన్యాక్రాంతం చేసేందుకు ఏకంగా రెవెన్యూ అధికారులే కీలకపాత్ర పోషిస్తున్నారు కాబట్టి. బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో సర్వే నెంబర్ 109లో 14 ఎకరాల ముచ్చట ఇది. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న పేదలను బెదిరించి తృణమో, ఫలమో విదిల్చి ఆ భూములకు కొందరు బినామీలతో ఏకంగా పట్టాలనే సృష్టించారు. మరికొందరు కోర్టుకెళ్లి పట్టాలు పొందారు. రికార్డుల్లో పట్టాలు ఎవరికైతే ఇచ్చారో వారి పేర్లతో రికార్డులు ఎక్కించారు. అయితే రిజిస్ట్రేషన్లు జరగటం లేదు. దీని వెనుక పెద్ద కథ ఉంది. ఈ భూములను జగనన్న కాలనీల కోసం కొనేందుకు అధికారులు స్కెచ్ వేసి భారీగా పరిహారం పొందాలన్న ప్రయత్నం జరిగింది. అప్పట్లో ఆ పాచిక పారలేదు. ఈ భూములను జగనన్న కాలనీకి తీసుకునేందుకు రెవెన్యూ తరఫున ఒక మధ్యవర్తిని రంగంలోకి దింపి ఎకరం రూ.20లక్షలు ఇప్పిస్తామన్నారు. రూ.8లక్షలు రెవెన్యూకు ఇచ్చేలా, మిగిలిన రూ.12లక్షలు పార్టీకి ఇచ్చేట్టు ఒప్పందం జరిగింది. అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించి రెవెన్యూ అధికారులు తమ వద్ద పెట్టుకున్నారు. అనుకున్నట్టుగానే కాలనీ కొనుగోలుకు ప్రతిపాదించారు. అయితే దురదృష్టం వెంటాడి నూజివీడు సబ్ కలెక్టర్ సెలవులో ఉండటంతో విజయవాడ సబ్ కలెక్టర్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఫైల్ తన దగ్గరకు రావటంతో పరిశీలించి ప్రభుత్వ భూమిని పేదల ఇళ్లకు కోసం కొనుగోలు చేయటానికి ప్రతిపాదన పంపుతారా అంటూ మండిపడ్డారు. ఏకంగా తహసీల్దార్‌కు షోకాజు నోటీసు జారీ చేశారు.

ఈ వ్యవహారం వివాదాస్పదం కావటంతో ఉమ్మడి జిల్లా జేసీ దీన్ని రద్దు చేశారు. అప్పటి నుంచి స్తబ్దుగా ఉన్న ఈ వ్యవహారం ఇటీవల వార్తలకెక్కింది. ఈ భూములను ఎలాగైనా బడా పార్టీలకు అమ్మి లాభపడాలన్నది స్థానిక రెవెన్యూ అధికారుల ఆలోచన. అంతే పట్టాదారులతో సంప్రదింపులు ప్రారంభించారు. కొందరు ఎదురుతిరగటంతో ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డును పాతారు. ఏం జరిగిందో తెలియదు ఆ బోర్డు ఇప్పుడు లేదు. ఓ బిగ్‌షాట్‌కు స్థలాన్ని అమ్మేందుకు తెరచాటు ఒప్పందం జరిగినట్టు తెలుస్తోంది. దీన్ని విక్రయించే బాధ్యతలను కొందరు అధికారులు తీసుకోవటం గమనార్హం. గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చిన భూములతో పాటు సర్వే నెంబర్ 109 -3లోనే మరో నాలుగెకరాల డొంకను కలిపేసి విక్రయానికి పెట్టడం గమనార్హం. ఆ భూమి ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉంది. మరి ఎలా విక్రయిస్తారో వారికే తెలియాలి. ఈ భూమిని అమ్మేందుకు ఎకరం రూ.50 లక్షల చొప్పున బేరం పెట్టినట్టుగా తెలుస్తోంది.

ఇన్నాళ్లకు మా రోడ్డు కనిపించిందా ?

- 7వ డివిజన్‌లో కార్పొరేటర్‌ను నిలదీసిన స్థానికులు

మొగల్రాజపురం, జనవరి 24: కార్పొరేటర్ పదవిలోకి వచ్చి తరువాత ఎన్నాడైనా మా రోడ్డులోకి వచ్చావా.. మా సమస్య పరిష్కరించావా అని స్థానికులు 7వ డివిజన్ కార్పొరేటర్ మెరకనపల్లి మాధురిని వైసీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సమక్షంలో నిలదీశారు. 7వ డివిజన్ శిఖామణి సెంటర్ సమీపంలో బుధవారం అవినాష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ సమస్యలను అడిగారు. ఆ సమయంలో మట్టా సామ్రాట్ వీధిలోని స్థానికులు కొందరు కార్పొరేటర్ మాధురిని నిలదీశారు. తమ వీధిలో కల్వర్టులు పాడైరాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఓట్ల కోసం వచ్చినపుడు చెప్పాం.. ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ఇన్నాళ్లకు గుర్తుకొచ్చామా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవినేని అవినాష్ వారిని సముదాయిస్తూ వీఎంసీ ఎఈని పిలిచి వెంటనే కల్వర్టు మరమ్మతులు చేయాలని కోరారు.

దాసరి రమణ నగర్‌లోనూ ఇంతే..

అమ్మకల్యాణ మండపం ఎదురుగా దాసరి రమణ రోడ్డులోనూ ఇదే సమస్య. ప్రధాన రోడ్డును కొత్తగా వేశారు. అంతర్గత రోడ్లు ప్రధాన రోడ్డుకు కలిసే చోట కల్వర్టులపై కొత్త సిమెంట్ బిళ్లలు వేయడానికి సిద్ధం చేశారు. నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30న ఐఎంఏ కొవిడ్ అమర వైద్యుల దినోత్సవం

గవర్నర్‌పేట, జనవరి 24: కొవిడ్ కాలంలో అనితర సాధ్యమైన సేవలు, త్యాగాలు అసువులు బాసిన వైద్యుల అమరత్వాన్ని స్మరిస్తూ జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి రోజు ఈనెల 30న కొవిడ్ అమరవైద్యుల దినోత్సవంగా అన్ని ఐఎంఏ శాఖల్లో నిర్వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్ణయించినట్టు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు, డాక్టర్ పి.ఫణేంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఎంఏ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేకే అగర్వాల్, ఏపీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి గంగాధరరావుతో పాటు రాష్ట్రంలోని సుమారు 124 మంది డాక్టర్లు కొవిడ్ బాధితులకు సేవలందిస్తూ మృతి చెందారని గుర్తుచేశారు. వైద్యులు, వైద్య సంస్థలు, అనుబంధ సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు స్థానిక ఐఎంఏ సంస్థలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సౌత్‌జోన్ వర్సిటీ చెస్‌కు హెల్త్ వర్సిటీ ప్లేయర్స్

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 24: తిరుచురాపల్లిలోని భారతీదాసన్ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల చెస్ టోర్నీలో పాల్గొనే హెల్త్ వర్సిటీ క్రీడాకారులను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ.త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బి.దీపక్ (అనంతపూర్ ప్రభుత్వ వైద్యకళాశాల), పి.స్నేహిత్, బిగణేష్ (చినవుటుపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల), సీహెచ్.నవీన్ (ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల), ఆర్.శ్రీరంగబాబు (విశాఖ ఆంధ్ర మెడికల్ కళాశాల), హితేశ్వర్ నాయక్ (రాజమండ్రి డాక్టర్ ఏఆర్ ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల) విద్యార్థులు ఎంపికయ్యారు. వీర్ని వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి అభినందించారు.

డిజిటల్ మార్కెటింగ్ కోర్సుకు ఉచిత శిక్షణ

భారతీనగర్, జనవరి 24: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఆపైన అర్హత గల అభ్యర్థులకు ప్రత్యేకంగా 3 నెలలపాటు సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ (డిజిటల్ మార్కెటింగ్) కోర్సుకు ఉచిత శిక్షణ అందిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్ కుమార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయసారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ అందిస్తామని, శిక్షణానంతరం ప్రముఖ సంస్థలో ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ ఇంటర్, డిగ్రీ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్ వంటి వాటిని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫిబ్రవరి 2న ఉదయం 10 గంటల్లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి (ఎన్ఎస్‌డీసీ ఏపీఎస్ఎస్‌డీసీ) ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9347779032, 8008742842 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పీఆర్‌సీలో తీవ్ర నష్టం: ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్

అమరావతి: వేతన సవరణ ఒప్పందంలో విద్యుత్తు సంస్థల ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సంస్థలో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని అసహనం వ్యక్తం చేసింది. అసోసియేషన్ 2024 డైరీని ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ ప్రతాపరెడ్డి ముస్తాబాద్ ఏపీఎస్ఈబీ అతిథిగృహంలో బుధవారం ఆవిష్కరించారు. పలువురు ఇంజనీర్లు మాట్లాడుతూ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి పీఆర్‌సీ వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధర్నాకు అనుమతి రద్దుపై యూటీఎఫ్ ఆక్షేపణ

అటు సమస్యలు పరిష్కరించకుండా, ఇటు పోరాటాలు చేయకుండా ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ ఆరోపించింది. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న తలపెట్టిన రాష్ట్ర ధర్నాకు తొలుత అనుమతిచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రద్దు చేసిందని యూటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. బదిలీలు, పదోన్నతులు, పీఎఫ్ సమస్యలపై 2 నెలలు జిల్లాల్లో ధర్నా చేస్తున్నామని, 25న రాష్ట్రస్థాయి ధర్నాకి పిలుపునిచ్చామన్నారు. గతేడాది డిసెంబరులో రాష్ట్రస్థాయి ధర్నాకు పిలుపునిస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి వాయిదా వేయించిందన్నారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇప్పుడు మరోసారి ధర్నా చేయాలని భావించగా అకస్మాత్తుగా అనుమతిని రద్దు చేసిందన్నారు.


విజేతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం

క్రాస్‌కంట్రీ రేస్‌లో పవన్‌కు ప్రథమస్థానం

విజయవాడ స్పోర్ట్స్: ఉయ్యూరులోని ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో ఇటీవల జరిగిన కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల పురుషుల క్రాస్ కంట్రీ రేస్ (10 కి.మీ)లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్సు కళాశాలలో బీకామ్ ఫస్టియర్ చదువుతున్న బి.పవన్ ప్రథమస్థానం కైవసం చేసుకున్నాడు. వ్యక్తిగత చాంపియన్‌షిప్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. టాప్ 6 స్థానాల్లో నిలిచినవారు ఆలిండియా ఇంటర్ వర్శిటీ క్రాస్ కంట్రీ పోటీల్లో కే ఆర్‌యూ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారని ఫిజికల్ డైరెక్టర్ ఎ.చినబాబు తెలిపారు. పవన్‌ను పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్ అభినందించారు.

రాజభాషగా హిందీ: డీఆర్ఎం

రైల్వేస్టేషన్, జనవరి 24: హిందీ రాజభాష అని రైల్వే డివిజనల్ డివిజన్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. బుధవారం నగరంలోని డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో పట్టణ, అధికార భాష అమలు కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా డీఆర్ఎం, పట్టణాధికార భాష అమలు కమిటీ ఛైర్మన్ నరేంద్ర ఏ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని రాజభాష విభాగం పనిచేయడం, టోలిక్ సమావేశాలు సకాలంలో నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ నేటికాలంలో హిందీ నేర్చుకోవడం, అధికారిక పనికోసం ఉపయోగించడం సులభమన్నారు. ఇలాంటి పోటీల వల్ల హిందీ వాడకం పెరుగుతుందన్నారు. హిందీ న్యూస్ రీడింగ్, నోటింగ్, డ్రాఫ్టింగ్, ఎస్సే రైటింగ్, పొయిట్రీ, రెసిటేషన్, ఎల్లొక్యూషన్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజయవాడ కేంద్రంగా ఉన్న 40 కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి 276 మంది ఉద్యోగులు, అధికారుల్లో విజేతలకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, కమిటీ కార్యదర్శి ఆశ మహేష్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మంచి పాలనకు ఓటే వజ్రాయుధం

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ


టీడీపీ సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న అనురాధ

భారతీనగర్, జనవరి 24: ఐదేళ్ల పాటు మనల్ని పరిపాలించేవారు ఎలాంటివారు కావాలనేది నిర్ణయించుకుని ఆరోజు వేసే ఓటనే వజ్రాయుధం మంచి పనులకు నాంది పలుకుతుందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. బుధవారం 4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్‌కాలనీలోని స్థానిక మహిళలతో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడిందీ, ఎలా నష్టపోయిందనేది చర్చించారు. రాబోయే కాలంలో ఏ ప్రభుత్వాన్ని ఎన్నుకొంటే మంచి అభివృద్ధి జరుగుతుందో చర్చించి మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఓటు వేసేందుకు దగ్గర్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై స్థానికుల కోరిక మేరకు గద్దె రామ్మోహన్ ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన చేశారన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి కింద రూ.15వేలు ఇస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటూ మాట మార్చి అదీ రూ.13వేలే ఇస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ వస్తే ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు, 18ఏళ్ల దాటిన మహిళలకు ఇంటిలో ఎంతమంది మహిళలుంటే అంతమందికి నెలకు రూ.1500 ఇవ్వడం, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. 3సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచి గద్దె రామ్మోహన్ సేవలందించారని రానున్న ఎన్నికల్లో ఆయన్ను ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారన్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, గుజ్జర్లపూడి నాగేశ్వరరావు, మన్నే విజయ, కొనరాజు పరమేశ్వరరావు, కే.ఉమా, చలసాని రోజా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 2 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళన

ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ హెచ్చరిక

ధర్నాచౌక్, జనవరి 24: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని లేదంటే ఫిబ్రవరి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కమిటీ ఛైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ప్రతిపక్షనేతగా సీఎం జగన్ గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి ఇచ్చి నాలుగేళ్ల 9నెలలు గడుస్తున్నా 25వేల మంది కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ సమస్యలను విస్మరించారన్నారు. ఖాళీగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో థర్డ్ పార్టీ విధానం తొలగించి విద్యుత్ యాజమాన్యాలే కాంట్రాక్టు కార్మికులకు నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.వెంకటేశ్వరరావు, నాయబ్ రసూల్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుకూలంగా టాటా స్టీల్ ఉత్పత్తులు

- పూర్తి సాంకేతికత, నాణ్యతతో దక్షిణాదిలోనే తొలిగా మల్లవల్లిలో..
- టీడీపీ ప్రభుత్వ హయాంలో భూ కేటాయింపులు.. ఎట్టకేలకు ఉత్పత్తులు ప్రారంభం


నిర్మాణరంగంలో తమ ఉత్పత్తుల వినియోగంపై వివరిస్తున్న టాటా స్టీల్ మార్కెటింగ్ చీఫ్ రాహుల్‌మిశ్రా, సామ్రాట్ గ్రూప్ ఎండీ రాజాజైన్

హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 24: నిర్మాణరంగంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన పర్యావరణహితంగా (రెడీమేడ్) సిద్ధంగా ఉపయోగించగల ఉక్కు ఉత్పత్తులను అందించేందుకు టాటా స్టీల్ లిమిటెడ్ నిబద్ధతతో పనిచేస్తుందని టాటా స్టీల్ లిమిటెడ్ (లాంగ్ ప్రొడక్ట్స్) వైస్ ఛైర్మన్ ఆశిష్ అనుపమ్ తెలిపారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలోని మల్లవల్లి మోడల్ పారిశ్రామికవాడలో పూర్తి సాంకేతికతతో 8 కోట్ల వ్యయంతో నిర్మించిన సామ్రాట్ ఐరన్ ప్రైవేట్ లిమిటెడ్(టాటాస్టీల్ సర్వీస్ సెంటర్)ఉక్కు పరిశ్రమను బుధవారం ఆయన ప్రారంభించారు. నిర్మాణ రంగంలో ఉపయోగించే ఉక్కు ఉత్పత్తులను రెడీమేడ్(ఉపయోగించేందుకు సిద్ధం)గా తయారు చేయడాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డౌన్‌స్ట్రీమ్ వ్యాపారరంగంలో పెరుగుతున్న కార్యకలాపాలతో భారతదేశ నిర్మాణ రంగంలో మరింతగా సేవలందించేందుకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాన్ని, తగిన వ్యవస్థలను నిర్మిస్తూ, మల్లవల్లిలో సామ్రాట్ ఐరన్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి సేవా కేంద్రాల ద్వారా మరింత విస్తరించేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. నిర్మాణరంగంలో సాంప్రదాయక ఉక్కు ఉత్పత్తులకు అతీతంగా సమగ్ర పరిష్కారప్రదాతగా టాటా స్టీల్ మరిన్ని ఆవిష్కరణలతో దేశవ్యాప్తంగా ఇలాంటి సేవా కేంద్రాలను 10కి పైగా ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు టాటా స్టీల్ మార్కెటింగ్ చీఫ్ రాహుల్‌మిశ్రా వివరించారు. నెలకు 3 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పూర్తి ఆటోమేటెడ్ పరిజ్ఞానంతో దక్షిణ భారతదేశంలోనే మొదటిదిగా మల్లవల్లిలో ప్రారంభించడం జరిగిందని, ఇప్పటికే ఘజియాబాద్, కటక్‌లలో ఇలాంటి కేంద్రాల ద్వారా నిర్మాణరంగానికి విస్తృత సేవలందిస్తున్నామన్నారు. 5 ఎకరాల విస్తీర్ణంలో 8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్యాక్టరీ ఉత్పత్తులతో నిర్మాణరంగానికి సమగ్ర ఉక్కు ఉత్తత్తులను అందిస్తుందన్నారు. పోర్ట్‌ఫోలియోను వెల్డెడ్ వైర్‌మెష్ మరియు బోర్‌పైల్ కేజ్‌లను చేర్చడం ద్వారా వన్-స్టాప్ డౌన్‌స్ట్రీమ్ కన్‌స్ట్రక్షన్ సర్వీస్ సెంటర్‌తో సేవలను మరింత విస్తృతం చేయదలిచామని, ఈ సదుపాయం టాటా స్టీల్ నుంచి దక్షిణ భారతావనిలో ఛానల్ భాగస్వామిగా మాతోనే మొదలైందని సామ్రాట్ గ్రూప్ ఎండీ రాజాజైన్ అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఏఈసీ) కమ్యూనిటీ సమావేశంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారి సూచనలతో పూర్తి ఆటోమేటెడ్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా నిర్మాణ రంగంలో కీలకపాత్ర పోషించేందుకు టాటాస్టీల్ మరో ముందుడగే ఈ ఫ్యాక్టరీ(సేవా కేంద్రం) అని తెలిపారు. తదనంతరం మొదటి ఉత్పత్తులను వారు జెండా ఊపి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ హయాంలో భూ కేటాయింపులు జరిగిన ఈ సంస్థ కాస్త ఆలస్యంగానైనా తమ ఉత్పత్తులను ప్రారంభించడం స్థానికులు ప్రశంసిస్తున్నారు.

ఎన్టీఆర్‌కూ 'భారతరత్న' ఇవ్వండి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్: బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించడాన్ని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు స్వాగతించారు. ఆయన గొప్ప సోషలిస్టు అని పేద, అణగారిన వర్గాల అభివృద్ధికి ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన శతజయంతి సందర్భంగా 'భారత రత్న' ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్‌కు కూడా 'భారత రత్న' ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాలు జరిగాయని గుర్తు చేశారు. టీడీపీ ప్రతి మహానాడులో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తున్నా మోదీ ప్రభుత్వానికి ఎన్టీఆర్‌కు 'భారత రత్న' ఇవ్వాలనే ఆలోచన రాకపోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీ నేతలు తూమాటి ప్రేమ్‌నాథ్, సయ్యద్ రఫీ, కేవీపీ బసవేశ్వరరావు, కేఎల్ విజయరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ చీకటి: చలసాని

మొగల్రాజపురం: సంప్రదాయ కోర్సులను బోధించే కళాశాలలో కన్నా ఇంజనీరింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞాన కోర్సులను అందించే కళాశాలలో ర్యాగింగ్ జరగడం బాధాకరమని ప్రముఖ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులైతే భవిష్యత్ చీకటిగా మారుతుందని, సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ రాజేష్ జంపాల మాట్లాడుతూ అక్షరాస్యులై కూడా ర్యాగింగ్‌కు పాల్పడటం అనాగరిక చర్య అన్నారు. సంచాలకులుగా యాంటీ ర్యాగింగ్ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు వ్యవహరించగా విద్యార్థులు, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.


స్టెల్లా కాలేజీలో జరిగిన బాలికా దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ దిల్లీరావు

బంగారు భవిష్యత్ దిశగా అడుగేయండి: కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 24: ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి బంగారు భవిష్యత్తును స్వంతం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు విద్యార్థినులతో అన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజీలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, మెరీస్ స్టెల్లా కాలేజీ, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, సంయుక్త ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ దిల్లీరావు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలికా దినోత్సవం, బాలికల హక్కుల పోస్టర్లను ఆవిష్కరించి బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాలికలకు, మహిళలకు బాసటగా నిలిచేలా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, లింగ వివక్షత, మానవ అక్రమ రవాణా వంటి సమస్యలను ప్రస్తావించి, వాటి నిర్మూలనకు సమష్టి భాగస్వామ్యం అవసరమన్నారు. ఓటు హక్కు నమోదు, వినియోగం, ఎథికల్ ఓటింగ్‌పై కలెక్టర్ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖ చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్-100/112, ఉమెన్ హెల్ప్‌లైన్-181పై అవగాహన కల్పించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, దిశ పోలీసు ఇనస్పెక్టర్ వాసవి, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ జిల్లా సమన్వయకర్త ఎ.రమేష్, బర్డ్ ఎన్‌జీవో ప్రతినిధి కె.ప్రకాష్ కుమార్, కళాకారులు ఆర్.పిచ్చయ్య, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లేనక్వాడ్రస్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ సిస్టర్ సహాయ మేరీ, సిస్టర్ లావణ్య, ఉషాకుమారి, డాక్టర్ లిటిల్ ఫ్లవర్, స్వప్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిరుపయోగ చెక్కుల దహనం


చెక్కులను తగులబెడుతున్న సిబ్బంది

కృష్ణలంక, జనవరి 24: జిల్లాలోని ఖజానా కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న ఎంఐసీఆర్, సీటీఎస్ చెక్ పుస్తకాలను దహనం చేసి నిర్మూలించినట్టు జిల్లా ఖజానాధికారి ఎం.హెచ్.రహ్మాన్ తెలిపారు. బుధవారం తూర్పులోని ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో చెక్ పుస్తకాల నిర్మూలన జరిగింది. జిల్లా ఖజానాధికారి ఎం.హెచ్.రహ్మాన్ పాల్గొని మాట్లాడుతూ జీవో నెం.135 ప్రకారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశాలతో నిరుపయోగంగా ఉన్న 4,666 చెక్కు పుస్తకాలను దహనం చేసినట్టు తెలిపారు. ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, సెకండ్ ఏడీజే కోర్టు సీఏవో కె.రామారావు, కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ పాషా, డీపీవో జయచంద్ర గాంధీ, విద్యాశాఖ ఏపీ జి.రాజేశ్వరి నిర్వహించినట్టు తెలిపారు. 2018 ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్న నేపథ్యంలో చెక్‌లు నిరుపయోగంగా ఉన్నట్టు తెలిపారు. కొత్తపేట ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించినట్టు వెల్లడించారు. ఏటీవోలు వి.సుబ్రమణ్యం, పీవీ రమణారావు, ఉప ఖజానా అధికారి కాకాని నాగేశ్వరరావు, ఎస్‌టీవోలు బి.మోహనరావు, శేషుకుమార్, కె.మల్లేశ్వరరావు, బి.సతీష్, ఎస్.ప్రఫుల్ కుమార్, ఎం.కృష్ణారావు, అర్షద్ ఒమర్, ఎస్.సత్యనారాయణ, ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన రెండు రోజుల వర్క్‌షాపు

కృష్ణలంక, జనవరి 24: కేఎల్ వర్సిటీ, ఏపీ చాంబర్స్‌తో కలిసి 2 రోజులుగా నిర్వహించిన నేషనల్ ఐపీ యాత్ర, వర్క్‌షాపు బుధవారంతో ముగిశాయి. ఐపీ యాత్ర అనేది ఎంఎస్ఎంఈలలో పేటెంట్లు, పారిశ్రామిక డిజైన్లు, కాపీరైట్‌లు, ట్రేడ్‌మార్క్‌లు, ట్రేడ్ సీక్రెట్స్, జీఐ రిజిస్ట్రేషన్ మొదలైన మేధోసంపత్తి హక్కుల అవగాహనను పెంపొందించడానికి, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ చొరవ. దేశ, విదేశాల్లో ఐపీ ఫైలింగుల సంఖ్యను పెంచే లక్ష్యంతో దేశ ఆర్థిక వ్యవస్థలో మేధోపరమైన ప్రయత్నం. ఐపీ ఆస్తులను దాఖలు చేయడం, పొందడం, వాణిజ్యీకరించడం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్, ప్రభుత్వ మద్దతు, జీఐ సర్టిఫికేషన్, జీఐ ఉత్పత్తులతో ఎంఎస్ఎంఈ వ్యవస్థాపకులకు అవగాహన కల్పించింది. ఈ ఈవెంట్ ఎంఎస్ఎంఈలకు వారి ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రదర్శించడానికి ఒక వేదికను అందించింది. ఐపీఆర్ డివిజన్ అదనపు డైరెక్టర్ సతీష్‌కుమార్, ఐపీ బ్యాంకు సీఈవో దొప్పలపూడి అశోక్, ఎంఎస్ఎంఈ జాయింట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎం.అజిత్, ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తదితరులు ప్రసంగించారు.

రాజ్యాంగ విలువల పట్ల బాధ్యత, అవగాహనతో ఉండాలి

ధర్నాచౌక్: తమ హక్కులపై అవగాహన లేకపోవడం వల్లే అణగారిన వర్గాలు అలాగే ఉన్నారని జేసీ పి.సంపత్ కుమార్ తెలిపారు. రాజ్యాంగం అందించే విలువల పట్ల బాధ్యత కలిగి పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ విలువలు-నేటి రాజకీయాలు' అనే అంశంపై గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డెం మాట్లాడుతూ నేటి రాజకీయాలు రాజ్యాంగ విలువల ప్రకారం ఉన్నాయా, లేవా? అని పరిశీలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు పక్షాన నిలబడి పనిచేసే వ్యక్తులనే ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలన్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి శివ భాగ్యారావు, ఆల్ తెలుగు ప్రజాపార్టీ జాతీయ అధ్యక్షుడు జేసు రత్నకుమార్, సరస్వతీ అయ్యర్, నాగార్జున వర్శిటీ ప్రొఫెసర్ సరస్వతీ అయ్యర్, రిటైర్డ్ అధికారి సంజా అంబేడ్కర్ ప్రసంగించారు.

ఐటీ జెయింట్స్ ఇండియన్ సర్వర్స్ కంపెనీతో అవగాహన ఒప్పందం

వన్‌టౌన్: కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలోని సీఎస్ఈ (ఏఐఎంఎల్) విభాగం బుధవారం ఐటీ జెయింట్స్ ఇండియన్ సర్వర్స్ కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇరువురు ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఐటీ జెయింట్స్ ఇండియన్ సర్వర్స్ కంపెనీ సీఈవో డి.సాయిసతీశ్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌తో అవగాహన ఒప్పందం వలన విద్యార్థులు నూతన సాంకేతికతను తెలుసుకుంటారన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలకు తమ సహకారం ఉంటుందన్నారు. సీఎస్ఈ నూతనంగా స్టూడెంట్ క్లబ్, స్టూడెంట్ చాప్టర్‌ను సెక్రటరీ పి.లక్ష్మణస్వామి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతాంజలిశాస్త్రి, డాక్టర్ డి. దుర్గాప్రసాద్, డాక్టర్ ఎస్‌కే అక్బర్, డాక్టర్ కల్పన, పి.శిల్ప, ఎన్‌వీ మహాలక్ష్మి, బి.వి.దుర్గ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే!

» రాష్ట్ర ప్రభుత్వానికి రేషన్ డీలర్ల సమాఖ్య హెచ్చరిక

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమవుతామని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు హెచ్చరించారు. రాష్ట్రంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించుకునేందుకు బుధవారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. డీలర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన పార్టీలకే డీలర్లు మద్దతు ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం రేషన్ డీలర్లకు పలు సౌకర్యాలు కల్పిస్తూ ఉత్తర్వులు(జీవో నెం.5) జారీ చేసినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోను అమలు చేయకుండా తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆ జీవో ప్రకారం.. డీలర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు, హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం, ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని, మరణించిన డీలర్లకు మట్టి ఖర్చులు మంజూరు చేయాలని కోరారు. సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.వరప్రసాద్ హాజరయ్యారు. ఆయనను డీలర్ల సమాఖ్య ముఖ్య సలహాదారుగా నియమించుకున్నట్లు లీలా మాధవరావు తెలిపారు. డీలర్ల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'పరిటాల'కు ఘన నివాళి

» వెంకటాపురానికి వేలాదిగా వచ్చిన అభిమానులు



వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళులు

రామగిరి, జనవరి 24: మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్రకు వేలాది మంది అభిమానులు ఘన నివాళులు అర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఆయన స్వగ్రామం వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి జనం పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి అభిమానులు విశేషంగా తరలివచ్చారు. పరిటాల రవీంద్ర సతీమణి, మాజీ మంత్రి పరిటాల సునీత, కుమారుడు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఉదయమే ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తదితరులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. కాగా, టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం స్వర్గీయ పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి సందర్భంగా పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆసరా పేరుతో అబద్ధాలు: కూన రవికుమార్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆసరా పేరుతో అబద్ధాలు చెప్పేవాడిని, డబ్బుపిచ్చితో కల్తీ మద్యం అమ్ముతూ తాళిబొట్లు తెంపేవాడిని, సొంత తల్లి, చెల్లిని మెడపట్టి గెంటిన వాడిని రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలు నమ్ముతారా? అని మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళగిరిలో ప్రశ్నించారు. చంద్రబాబు ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున కోటి మందికి అందిస్తే.. జగన్ ఇప్పటి వరకు రూ.15 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసిస్తూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామా చేసి మూడేళ్లు అవుతుంటే, స్పీకర్ ఇన్నేళ్లు నిద్రపోయి ఇప్పుడు జగన్ ఆదేశాలతోనే ఆ రాజీనామాను ఆమోదించారని, వచ్చే ఎన్నికల్లో ఆముదాలవలస ప్రజలు స్పీకర్ చీటీ చింపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు: చిరంజీవిరావు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'టీడీపీకి పార్టీలోను, పక్క రాష్ట్రాల్లోను స్టార్ క్యాంపెయిన్లు ఉన్నారని ఉరవకొండ సభలో సీఎం జగన్ సన్నాయి నొక్కులు నొక్కాడు. వారు టీడీపీకి అండగా నిలవడానికి కారణమేమిటో ఆయన ఆలోచించుకోవాలి' అని ఆ పార్టీ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిరంజీవిరావు అన్నారు. బూతులు మాట్లాడే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నవి లేనట్లురాసే, చూపే జగన్ మీడియా వైసీపీ ప్రధాన స్టార్ క్యాంపెయినర్లు కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, చివరకు చిన్నారుల కిట్లపై కూడా తన బొమ్మలు ముద్రించుకోవడం జగన్ క్యాంపెయినింగ్ పిచ్చికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు.

సొసైటీల వెయ్యి కోట్లు సీఎం ఖజానాకు: గోరంట్ల

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి ధనదాహానికి రాష్ట్ర సహకార రంగం బలైపోయింది. తన పార్టీ వారు, నచ్చిన వారిని సహకార సంఘాల్లో నామినేట్ చేయడం ద్వారా సీఎం జగన్ రూ.1,000 కోట్ల సొసైటీ సొమ్ము కాజేశాడు' అని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. నిధులు పక్కదారి పట్టించి స్థానిక సంస్థలు సహా అన్నీ వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేసినట్లే సీఎం సహకార రంగాన్నీ నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార రంగంలోని అవకతవకలపై సమగ్ర విచారణ జరగాలన్నారు. ఇక, రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి పెట్టాలని వైసీపీ ఎమ్మెల్యేలే కోరుతున్నారని బుచ్చయ్య చౌదరి తెలిపారు. 'టీడీపీ అభ్యర్థిని నిలబెడితే ఓటేసి గెలిపిస్తామని 50 మంది ఎమ్మెల్యేలు మాతో సంప్రదిస్తున్నారు. గంటా శ్రీనివాసరావు రాజీనామాపై మూడేళ్ల పాటు స్పీకర్, సీఎంలు గాడిదలు కాస్తున్నారా? సీఎం జగన్ భయపడుతున్నారు. అందుకే గంటా రాజీనామాను ఇప్పుడు ఆమోదించారు' అని బుచ్చయ్య పేర్కొన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి హైకోర్టు నోటీసులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా పీవీజీడీ ప్రసాదరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఆయనకు వ్యక్తిగత హోదాలో నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీచేసి, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ప్రసాదరెడ్డి ఏయూ వీసీగా పనిచేసిన సమయంలో పాల్పడిన అవకతవకలపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అండ్ మైనార్టీ అల్యుమిని అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రెటరీ యూవీ రమణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

మార్కెట్ కమిటీ ఉద్యోగులకు పదోన్నతులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 218 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మార్కెటింగ్ శాఖ పదోన్నతులు కల్పించింది. 112 మందికి గ్రేడ్ 1, 2, 3 ప్రత్యేక శ్రేణి కార్యదర్శులుగా పదోన్నతులు లభించాయి. సూపర్‌వైజర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా అవకాశం దక్కింది. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు గత వారం నుంచి కౌన్సెలింగ్ ద్వారా మూడు ప్లేస్‌మెంట్ల ఆప్షన్‌తో ఎంచుకున్నచోట పోస్టింగ్‌లు ఇచ్చారు.

నేటి నుంచి రేడియాలజీ జాతీయ సదస్సు

విజయవాడ (లబ్బీపేట), జనవరి 24: ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ 76వ జాతీయ సదస్సును మంగళగిరిలోని సికె కన్వెషన్ సెంటర్‌లో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు సదస్సు చైర్మన్ డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ తెలిపారు. ఇమేజింగ్ బియాండ్ ఇమాజినేషన్ అనే ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో 3500 మంది ప్రముఖులు, 330 మంది ఫ్యాకల్టీ వస్తున్నారని, విదేశాల నుంచి మరో 100 మంది హాజరవుతున్నారని తెలిపారు.

ఠాకూర్‌కు భారతరత్న సంతోషకరం: బాబు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరీ ఠాకూర్‌కి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న లభించినందుకు సంతోషంగా ఉందని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన 'అట్టడుగు, అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి జన నాయక్ కర్పూరీ ఠాకూర్ చేసిన కృషి అసమాన్యమైనది. చెరగని ముద్ర వేసిన ఆయన సేవలకు నేడు సమున్నత గౌరవం దక్కింది' అని పేర్కొన్నారు.

బాబు, లోకేశ్ నాయకత్వంలో టీడీపీ బలోపేతం

» శ్రేణులకు టీడీపీ ఎమ్మెల్సీల పిలుపు.. కర్నూలు జిల్లాలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

కర్నూలు(అర్బన్), జనవరి 24: చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, కంచర్ల శ్రీకాంత్ సంయుక్తంగా పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలులో కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, హిందూపురం, పరిధిలోని 36 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ఒక రోజు ఇంటిగ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ... 'ప్రజలకు, పార్టీ నాయకులు చేరువయ్యేలా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో సాంకేతిక అంశాలను రాజకీయాలకు జోడిస్తున్నాం. పార్టీ కేడర్‌ను ప్రజలకు దగ్గర చేసేందుకు జాతీయ ప్రధాన కార్యాదర్శి లోకేశ్ గ్రామ, బూత్ స్థాయిల్లో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి సీఎం కావాలన్న దురాశతో సీఎం జగన్ రెడ్డి ఓట్ల దొంగగా మారిపోయాడు' అని ఆరోపించారు.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రం సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే' - సుప్రీంకోర్టు



'మీరు మంచిగా మారండి. బయటకు వెళ్లిన తర్వాత మీ కుటుంబాలతో గౌరవంగా, సంతోషంగా బతకాలి. మళ్లీ నేరాలు చేయకూడదు. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. వాటి సంగతి నేను చూసుకుంటాను'

- రాజమహేంద్రవరం జైలులో ఆసుపత్రి శంకుస్థాపనకు వచ్చినప్పుడు ఖైదీలతో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు

ఖైదీలకు మళ్లీ కన్నీరేనా!

» విడుదల కోసం జైలు పక్షుల ఎదురు చూపులు

» గణతంత్ర దినోత్సవానికి క్షమాభిక్షపై అయోమయం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'క్షమ' లేని పాలకుల దయా'భిక్ష' దొరక్క సత్ప్రవర్తన కలిగిన ఎందరో ఖైదీలు జైళ్లలోనే మగ్గిపోతున్నారు. క్షమాభిక్ష జీవో కోసం చివరి క్షణం వరకూ ఎదురుచూడటం.. ప్రభుత్వం కనికరం చూపకపోవడంతో నిరాశ నిండిన గుండెలతో కన్నీటిని దిగమింగుకొంటూ.. ఆహారం సయించక.. కంటిపై కునుకు రాక.. ఇటు ఖైదీలు.. అటు వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఒత్తిడిలో మునిగిపోతున్నాయి. అయినా ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. గత ప్రభుత్వంలో సమయానికి క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక గత నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే జీవో ఇచ్చారు. జైలు అధికారులు ఎంత వేగంగా ప్రక్రియ పూర్తిచేసి జాబితాను పంపుతున్నా నెలల తరబడి తాత్సారం జరుగుతోంది. పాలకుల నిర్దయతో గతేడాది ఆగస్టు 15న విడుదల కావాల్సిన జీవిత ఖైదీల జాబితా ఇంకా సర్కారు వద్దే నానుతోంది. దీంతో ఈ గణతంత్ర దినోత్సవానికి వెలువడే నిర్ణయం జైళ్లలోని జీవిత ఖైదీలు ఎదురు చూస్తున్నారు.

రాజమహేంద్రవరం జైలులో...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 16న జీవో 58 ఇచ్చింది. దీని ప్రకారం ఏడాదికి మూడు విడతల్లో ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం వడపోత అనంతరం 34మంది క్షమాభిక్షకు అర్హులని జైలు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వీరంతా గత ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. హైపవర్ కమిటీ సమావేశం పూర్తయి సుమారు 3 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ ఆ జాబితాను కేబినెట్‌లో పెట్టలేదు.

ప్రభుత్వం తీరుతో అన్యాయం

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు క్షమాభిక్ష జీవోలు జారీ అయ్యేవి. రెండేళ్లకోసారైనా పెద్దసంఖ్యలో ఖైదీలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేవారు. కానీ జగన్ ప్రభుత్వంలో వారికి ఎదురుచూపులే మిగిలాయి. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్కసారి మాత్రమే క్షమాభిక్షపై ఖైదీలను విడుదల చేశారు. అప్పట్లో సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలిపి సుమారు 60 మందికి పైగా బయటకు వెళ్లారు. అక్కడా వారికి అన్యాయమే జరిగింది. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఖైదీలను వెంటనే విడుదల చేయలేదు. ఏడాది ఆలస్యంగా 2022 ఆగస్టు 15న బయటకు వదిలారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలాకాకుండా 2022నే కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరే అవకాశం లభించేది. ప్రభుత్వం తీరుతో ఆ ఖైదీలు ఏడాది శిక్ష అదనంగా అనుభవించారు.

ఖైదీ కుటుంబంపై ప్రతికూల ప్రభావం

సాధారణ జీవిత ఖైదీలకు 7ఏళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి తీవ్రమైన నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65ఏళ్లు దాటినవారికి ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు పూర్తిచేస్తే, కొన్ని నిబంధనలకు లోబడి క్షమాభిక్షకు అర్హులవుతారు. ప్రస్తుతం 15ఏళ్లకు పైబడి శిక్ష అనుభవిస్తున్నవాళ్లు, రెమిషన్‌తో కలిపి 20ఏళ్లు దాటిపోయిన ఖైదీలు, 65ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నారు. క్షమాభిక్ష జీవో జారీలో తీవ్ర నిర్లక్ష్యంతో వారి కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు అంతకుముందు ఎలాంటి నేర చరిత్ర ఉండదు. క్షణికావేశంలోనో, స్నేహితులతో వెళ్లి లేదా ఏదో గొడవ పెద్దదై నేరం జరిగి ఉంటుంది. అలాంటి కేసుల్లోని వారు కూడా ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. కొన్ని కేసుల్లో భార్య భర్త ఇద్దరికీ శిక్ష పడటంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు. దేశంలో సంచలనం రేకెత్తించిన కేసుల్లో సైతం క్షమాభిక్ష ప్రసాదిస్తున్నారని.. క్షణికావేశంలో నేరానికి పాల్పడినవారిపై మాత్రం దయ చూపట్లేదని ఖైదీల కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. ఖైదీ సత్ప్రవర్తనను దృష్టిలో ఉంచుకొని క్షమాభిక్ష ప్రసాదించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోడికత్తి శ్రీను జైల్లో... వివేకా హంతకులు బయట!

» ఐదేళ్లుగా శ్రీనుకు బెయిల్ రాకుండా జగన్ కుట్రలు

» రౌండ్ టేబుల్‌లో వివిధ పార్టీల నేతలు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చే పోరాటం చేయాలని, ఆ కుటుంబానికి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు అండగా నిలవాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఈ కేసులో సీఎం జగన్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయపక్షాల నేతలు, దళిత సంఘాలు, శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ,



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేత ఫారూక్ షబ్లీ, జనసేన నేత మహేశ్, దళిత బహుజన జేఏసీ నేత పోతుల బాలకోటయ్య తదితరులు ప్రసంగించారు. కోడికత్తితో చిన్నగా గీసిన శ్రీనివాసరావు ఐదున్నరేళ్లుగా జైల్లో ఉంటే, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోని నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. 2019లో అధికారంలోకి రావడానికి జగన్ వేసిన పాచికలో జనుపల్లి బలైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని జాతీయస్థాయిలో మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. వైసీపీ, బీజేపీ కలిసి శ్రీనివాసరావుకు బెయిల్ రాకుండా డ్రామాలాడుతున్నాయన్నారు. పదేపదే విదేశాలకు వెళ్లే జగన్‌కు కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పడానికి సమయం లేదా? అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలను దోచుకుని 12 కేసుల్లో ఉన్న జగన్ బెయిల్‌పై బయట ఉన్నారని, ఇది న్యాయవ్యవస్థకే సిగ్గుచేటని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరిని చిన్నపిల్లలను అడిగినా చెబుతారన్నారు. జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ వచ్చే వరకు పోరాటం చేయాలని, అన్ని రాజకీయ పక్షాలు ఢిల్లీలో పోరాటం చేయాలని సమావేశం నిర్ణయించింది. కాగా, శ్రీను బెయిల్ కేసులో అవసరమైతే ఇంప్లీడ్ అవుతామని వర్ల పేర్కొన్నారు. కాగా ఈ సమావేశంలో కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు.

మీడియాపై ఐ-'ప్యాక్'!

» జర్నలిస్టులకు వైసీపీ ఎన్నికల వల

» నాలుగైదు గ్యాడ్జెట్లతో కిట్ల పంపిణీ

» ఒక్కో కిట్ విలువ రూ.5వేల లోపే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ అన్ని వర్గాలను మచ్చిక చేసుకునేందుకు వైసీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా మీడియాపైనా ఎన్నికల వల విసురుతోంది. ఇళ్ల స్థలాల కేటాయింపు పేరిట ఇప్పటికే హడావుడి ప్రారంభించగా, ఇప్పుడు మండల స్థాయిలో పాత్రికేయులు, సోషల్ మీడియాలో న్యూస్ కంటెంట్ సృష్టికర్తలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు విలువైన ప్రత్యేక కిట్లు అందిస్తోంది. ఇదంతా ఐప్యాక్ బృందాల ఆధ్వర్యంలో సాగుతున్నట్లు తెలిసింది. జగన్ ఒంటెత్తు పోకడలు, ప్రజా వ్యతిరేక చర్యలతో వైసీపీకి వెన్నుదన్నుగా ఉంటోన్న వర్గాలు దూరమవుతున్నాయి. ప్రతిపక్షాలకు ప్రజాదరణ పెరుగుతోంది. దీన్ని అడ్డుకునేందుకు ఆయన సొంత, కూలి మీడియా ఎన్ని ప్రయత్నాలు చేసినా క్షేత్రస్థాయిలో ఆ నష్టాన్ని అడ్డుకోలేకపోతున్నాయి. దీంతో గ్రామ, మండల స్థాయిలోనే వ్యతిరేక వార్తలను అడ్డుకొని, సొంత భజన జరిగేలా, ప్రతిపక్షాలపై అడ్డగోలుగా బురద చల్లేలా వైసీపీ వ్యూహం పన్నుతోంది. ఇలాంటి ఎత్తుగడలు అమలు చేయడంలో ఆరితేరిన ఐప్యాక్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మీడియా ప్రతినిధులకు కిట్ల పంపిణీ మొదలుపెట్టింది. పోర్ట్రానిక్స్ కంపెనీకి చెందిన సెల్ఫీ కెమెరా స్టిక్ స్టాండ్, బ్లూటూత్ నెక్‌బ్యాండ్, పవర్‌బ్యాంక్, స్మార్ట్‌వాచ్ ఇలా నాలుగైదు గ్యాడ్జెట్లతో కూడిన కిట్లను ఎంపిక చేసిన పాత్రికేయులు, సోషల్ మీడియాలో స్థానిక న్యూస్ కంటెంట్ క్రియేటర్లకు అందిస్తున్నారు. నిజానికి మండల, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో తమ హక్కుల పరిరక్షణ కోసం పాత్రికేయులు పోరాటం చేస్తున్నారు. తమపై దాడులకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని నినదిస్తున్నారు. వీటిపై స్పందించకుండా పోరాడుతున్న వారికి కిట్లు అందించడమేంటని జర్నలిస్టు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్ సర్కారుకు, అధికార వైసీపీకి భజన చేసే కొంతమందికి తరచుగా విందులు, ఖరీదైన బహుమతులు ఇస్తున్నారని పాత్రికేయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగున్నరేళ్లలో ఎంతోమంది జర్నలిస్టులపై దాడులు జరిగాయి. అనేకమంది మరణించారు. ఈ దురాగతాలపై సీఎం జగన్, వైసీపీ ఎక్కడా స్పందించలేదు. మీడియాపై దాడులకు తెగబడిన సొంత పార్టీ నేతలను నియంత్రించలేదు. తీరా ఎన్నికల సమయం రాగానే పాత్రికేయులకు తాయిలాలు ఇవ్వడానికి సిద్ధపడటంపై జర్నలిస్టు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్కార్ సొమ్ముతో వైసీపీ భజన

» పథకాల ముసుగులో ఎన్నికల ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ సొమ్ముతో వైసీపీ ఎన్నికల ప్రచారం చేపడుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు ముసుగులో పార్టీ ప్రచారం చేసుకుంటోంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'సొంత' ప్రయోజనం కోసం, వచ్చే ఎన్నికల్లో గెలవడం కోసం ప్రభుత్వాన్ని అన్ని విధాలుగా వాడుకుంటోంది. తాజాగా డ్వాక్రా గ్రూపులతో ఆయా మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి 'జగనన్న డ్వాక్రా గ్రూపులకు అంత చేశాడు, ఇంత చేశాడు' అంటూ ప్రచారం చేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. మంగళవారం జగన్ ఆసరా పథకం కింద డ్వాక్రా గ్రూపులకు నగదు బదిలీ చేస్తూ బటన్ నొక్కారు. దీంతో ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అయినా ప్రతి మండలంలో డ్వాక్రా గ్రూపు సభ్యులందరినీ ఒకచోటకు చేర్చి ఎమ్మెల్యే/పోటీ చేయబోయే ఇన్‌చార్జ్‌తో చెక్కుల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. అన్ని జిల్లాల డీఆర్‌డీఏ పీడీలకు ఈమేరకు ఆదేశాలు అందినట్లు సమాచారం. అందుకోసం ప్రతి మండలానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కూడా సమకూరుస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతిపైసా సర్కార్‌దే..

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సొంత పార్టీ ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలున్నాయి. వైసీపీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించి ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లిస్తున్నారు. వారిని వైసీపీ ఎన్నికల సేవల కోసం వినియోగించుకుంటున్నారు. ఇక జగన్ 'బటన్' నొక్కుడు కార్యక్రమాల ప్రచారం కోసం ప్రకటనలకు కోట్లు ఖర్చు చేస్తున్నారు. పనిలో పనిగా జగన్ సొంత మీడియాకు భారీగా లబ్ధి చేకూరుస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి చేపట్టినవి, చేయనివి కూడా ప్రభుత్వ ఖర్చుతోనే అబద్ధాల ప్రచారం చేసుకుంటున్నారు. వైసీపీ రంగులద్దిన అందమైన ప్రచార పుస్తకాలు ముద్రించి వలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. 1.50 కోట్ల బుక్‌లెట్ల ముద్రణకు సుమారు రూ.10 కోట్లు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. గతంలో గ్రామ పంచాయతీ, సచివాలయాలు తదితర ప్రభుత్వ భవనాలన్నింటికీ వైసీపీ రంగులు వేయించి వందల కోట్లు దుర్వినియోగం చేశారు. ఇటీవల ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని జగన్ సర్కార్ ప్రారంభించింది. ఆటస్థలాలు లేకపోయినా, ఆటగాళ్లు కాని వారి పేర్లు నమోదు చేసుకుని ఆయా కార్యక్రమాలు నిర్వహించి ప్రచారం చేసుకుంటోంది. అందుకోసం ప్రతి మండలంలో రూ.లక్షలు నిధులు వెచ్చిస్తోంది. పేరుకు ప్రభుత్వ పథకం కాగా ప్రచారం జగన్, వైసీపీ గురించే చేస్తున్నారు. జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమాలకు ప్రభుత్వ బస్సులతో పాటు ప్రైవేట్ స్కూళ్లను బెదిరించి స్కూల్ బస్సులలో జనాన్ని తరలిస్తున్నారు.

జగన్ సభలకు సీఐఎఫ్ నిధులు

వైఎస్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల కోసం సీఐఎఫ్ నిధులు వాడి కరిగించగా, ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా వాడేస్తున్నారు. నవరత్నాల అమల్లో భాగంగా జగన్ బటన్ నొక్కినప్పుడల్లా సభలకు డ్వాక్రా మహిళలను తరలించడం అలవాటైపోయింది. ఈ క్రమంలో బస్సులను ఆర్టీసీ అందించినప్పటికీ డ్వాక్రా సభ్యులకు ఆహారం, టిఫిన్, కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిల్ తదితర ఖర్చులన్నీ ఆయా మండల సమాఖ్యలే భరిస్తున్నాయి. ఇందుకోసం సీఐఎఫ్ నిధులు వాడేస్తున్నారు. ప్రతిసారి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు మాత్రమే ఇస్తుందని, ఖర్చు చేసిన తర్వాత బిల్లులు తీసుకోవడం కష్టంగా ఉందంటున్నారు. దాని ప్రభావం సీఐఎఫ్ నిధులపై పడుతోందని వాపోతున్నారు.

నిధులిస్తామని పిలిచి ఎండలో నిలబెట్టారు

కావలి, జనవరి 24: ఆసరా నిధులు ఇచ్చేందుకు సంతకాలు పెట్టాలని పిలిపించిన పొదుపు మహిళలకు అధికారులు చుక్కలు చూపించారు. నెల్లూరు జిల్లా కావలి, రూరల్ మండలంలోని పొదుపు గ్రూపులకు నాలుగో విడత ఆసరా నిధులు ఇవ్వడానికి సభ పెట్టారు. ఈ సభలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చారు. చోటామోటా నేతలు కూడా మైకుల్లో రెచ్చిపోయారు. మీటింగ్ అయ్యాక మహిళలు భోజనాలకు తోచుకెళ్లడంతో గేట్లు మూయించారు. మహిళలు రోడ్డుపైనే గంటల తరబడి నిలబడిపోయారు. చివరిగా వెళ్లిన వారికి భోజనాలు అందలేదు.

జనసేన ప్రచార వాహనంపై దాడి

» అద్దాలు ధ్వంసం.. తాళాలు, వాహన పత్రాలు లాక్కెళ్లిన వైసీపీ నేతలు

» కాకినాడ జిల్లా పెదపూడిలో దౌర్జన్య కాండ

» రోడ్డుపై టీడీపీ, జనసేన శ్రేణుల ఆందోళన

కాకినాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ గూండాగిరీకి దిగింది. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామగ్రామాన ప్రచారం చేస్తున్న జనసేన ప్రచార వాహనంపై వైసీపీ నేతలు దాడికి తెగబడ్డారు. వాహన అద్దాలు ధ్వంసం చేసి తాళాలు, జీపుప్రచార అనుమతి పత్రాలను లాక్కుపోయారు. బుధవారం సాయంత్రం కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడిలో ఈ దారుణం జరిగింది. దీనిపై జనసేన, టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన చేపట్టాయి. సామర్లకోట మండలానికి చెందిన జనసేన నేతలు ప్రచార అనుమతులు తీసుకుని వాహనంలో గ్రామగ్రామాన తిరుగుతూ జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. పెదపూడి మండలం శహనాపురంలో ఈ వాహనాన్ని వైసీపీ స్థానిక నేత బుద్దా వెంకన్న, ఎంపీటీసీ భర్త చందక్ల వెంకటరమణ, మరికొంతమంది అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తమకు అనుమతులు ఉన్నాయని, కావాలంటే మీరు కూడా ప్రచారం చేసుకోండని జనసేన నేతలు అనడంతో వైసీపీ నేతలు ప్రచార వాహనంపై దాడి చేసి అద్దాలు పగులగొట్టారు. వాహనం తాళాలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జనసేన నేతలు ఆందోళనకు దిగారు. దాడి కి పాల్పడిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఇరువర్గాల మధ్య గొడవ పెరిగి ఉద్రిక్తతకు దారితీయడంతో పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన పోలీసులు ఆఖర్లో వచ్చి వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఇరువర్గాలను చెదరగొట్టారు.

కంటైనర్ టెర్మినల్ మూసేస్తే 10 వేల మంది రోడ్డుపాలు

» పోరాటం చేసైనా అడ్డుకుంటాం: ఉద్యోగులు, కార్మికులు

ముత్తుకూరు, జనవరి 24: అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేస్తే సుమారు పది వేలమంది బతుకులు రోడ్డుపాలవుతాయని ఆధారిత కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న కంపెనీల ఉద్యోగులు, కార్మికులు ఏకమై కంటైనర్ టెర్మినల్ తరలిపోకుండా నిలుపుకొనేందుకు పోర్టులోని గోపాలపురంలో బుధవారం కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే కంటైనర్ టెర్మినల్‌ను అదానీ కృష్ణపట్నం పోర్టు నుంచి చెన్నైకి తరలిస్తున్నారని, దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది జీవనోపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను కాపాడాలని కంటైనర్ టెర్మినల్ ఉద్యోగులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కంటైనర్ టెర్మినల్‌ను కృష్ణపట్నం పోర్టు నుంచి అదానీ కంపెనీ చెన్నైకి తరలిస్తోందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది జీవనోపాధి కోల్పోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రం మార్పుకోరుతోంది!

» జగన్ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయారు

» ఈసారి కాంగ్రెస్‌కే అవకాశమిస్తారు

» 'ఆంధ్రజ్యోతి'తో రాష్ట్ర ఇన్‌చార్జి ఠాగూర్

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా .. పాలనాపరంగా రాష్ట్రం మార్పు కోరుతోందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్నారు. సీఎం జగన్ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయారని, జనం ఈసారి కాంగ్రెస్‌కే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తంచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ప్రక్రియను బుధవారం విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, మస్తాన్‌వలీతో కలసి ఠాగూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తన స్వరాష్ట్రం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు భావోద్వేగంలో ఒకేలా ప్రవర్తిస్తారని, ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాలను మార్చేసే అలవాటు రెండు రాష్ట్రాల ప్రజలకు ఉందన్నారు. ఏపీలో ఐదేళ్లు చంద్రబాబుకు, మరో ఐదేళ్లు జగన్‌కు అవకాశం



ఇచ్చారని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని తెలిపారు. తమకు 90 అసెంబ్లీ స్థానాలు దక్కుతాయని చెప్పారు. ఇటీవల ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో రాహుల్‌కు 49 శాతం మంది.. మోదీకి 46 శాతం మంది ఓటేశారని తెలిపారు. ఏపీలో కాంగ్రెస్‌కు చెక్కుచెదరని కేడర్ ఉందని.. కానీ పదేళ్లుగా నాయకత్వమే లేకుండా పోయిందన్నారు. వైఎస్ షర్మిల రాకతో.. కాంగ్రెస్ బలోపేతమవుతుందని, పార్టీలో నూతనోత్తేజం కనిపిస్తోందని చెప్పారు. విభజన హామీలను కేంద్రం చేత అమలు చేయించడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు.

అభ్యర్థులకు దరఖాస్తులు..

కాంగ్రెస్ అభ్యర్థిత్వాల దరఖాస్తులకు రుసుములు నిర్ధారించారు. లోక్‌సభ జనరల్ స్థానానికి రూ.25,000, రిజర్వుడు స్థానానికి రూ.15,000, అసెంబ్లీ జనరల్ సీటుకు రూ.10,000, రిజర్వుడు నియోజకవర్గానికి రూ.5,000 యాప్ ద్వారా చెల్లించాలని ఠాగూర్ చెప్పారు. గుంటూరు ఈస్ట్‌కు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, మడకశిరకు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, బద్వేల్‌కు కమలమ్మ దరఖాస్తులు స్వీకరించారు. మరో పది మంది కూడా దరఖాస్తులు తీసుకున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల తీసుకోలేదు. ఎప్పుడు తీసుకుంటారని అడుగగా.. సమయం రావాలని ఆళ్ల బదులిచ్చారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఈసీ దృష్టికి

» హైకోర్టు స్పష్టీకరణ.. పిల్ పరిష్కారం

అమరావతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే దాని దృష్టికి తీసుకెళ్లవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదు విషయంలో పారదర్శకత పాటించేలా ఎన్నికల అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఈ పిల్‌ను మచిలీపట్నానికే చెందిన ఇమడాబత్తుల దిలీప్‌కుమార్ దాఖలు చేశారు. ఎలక్షన్ రిజిస్ట్రేషన్ రోల్స్, సెక్షన్ 6ని అనుసరించి ఓటర్ల జాబితా సిద్ధం చేసేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు. ఈసీ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం సాగుతుందని తెలిపారు. ప్రస్తుత పిటిషన్‌పై విచారణను కొనసాగించాల్సిన అవసరం లేదన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎంవీ రమణకుమారి వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలను అనుసరించి ఓటర్ల జాబితాను సిద్ధం చేయడంలో ఎన్నికల అధికారులు విఫలమయ్యారని తెలిపారు. సెక్షన్ 6 ప్రకారం అక్షర క్రమం లేదా ఇంటి నంబర్ ఆధారంగా వరుస క్రమంలో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా ప్రస్తుత జాబితా ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● గురువారం 25 జనవరి 2024



నేషనల్ అకాడమీ ఆఫ్ డిఫెన్స్‌లో

పీజీడీఎం

నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్(ఎన్ఏడీపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం)(బిజినెస్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ డిఫెన్స్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ప్రధానంగా డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అంశాలు బోధిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు; ఇండస్ట్రియల్ విజిట్‌లు, సెమినార్‌లు, కేస్ స్టడీస్, డిజర్టేషన్/ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. డిఫెన్స్ ప్రొడక్షన్ విభాగాల్లో ఆసక్తి ఉన్నవారు, భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఆఫీసర్లు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న వారు, పీఎస్‌యూల ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్, ఇండస్ట్రీ 4.0, మాన్యుఫాక్చరింగ్ ఎక్సలెన్స్ వంటి టెక్నో మేనేజీరియల్ టాపిక్స్; స్ట్రాటజీ, ఛేంజ్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ గవర్నెన్స్, ఈఎస్‌జీ తదితర పాలసీ& ప్రాక్టీస్ రిలేటెడ్ అంశాలు; వార్‌ఫేర్ అండ్ ల్యాండ్/నేవెల్/ఎయిర్ సిస్టం, సెక్యూరిటీ స్టడీస్, డిఫెన్స్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ సెక్యూరిటీ సిస్టమ్, డిఫెన్స్ అక్విజిషన్, ఆఫ్‌సెట్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, డిఫెన్స్ ఎక్స్‌పోర్ట్, ఐపీఆర్/రక్ష జ్ఞాన్ శక్తి వంటి డిఫెన్స్ అంశాలు; డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, బిజినెస్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ-డీప్‌లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్, డిజైన్ థింకింగ్ వంటి అంశాలు; లీడర్‌షిప్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, డైవర్సిటీ&ఇన్‌క్లూజన్, బిజినెస్ కమ్యూనికేషన్ వంటి పర్సనల్ డెవలప్‌మెంట్ అంశాలు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

వెయిటేజీ: క్యాట్ వ్యాలిడ్ స్కోర్‌నకు 45 శాతం, అకడమిక్ ప్రతిభకు 15 శాతం, గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూ స్కోర్‌నకు 15 శాతం; స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, సెల్ఫ్ డిసిప్లిన్, అదనపు అర్హతలు, జెండర్ డైవర్సిటీ, అనుభవాలకు ఒక్కోదానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.7,00,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 18 నుంచి 31 వరకు
- **ఇంటర్వ్యూ కాల్ లెటర్స్ విడుదల:** ఏప్రిల్ 2
- **వెబ్‌సైట్:** www.ddpdoo.gov.in/units/nadp

నీలిట్‌లో ఇంటర్న్‌షిప్

హరిద్వార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆర్నెల్ల వ్యవధి గల లెవెల్ 1-వర్క్ బేస్డ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. హరిద్వార్‌లో 6, డెహ్రాడూన్‌లో 4 సీట్లు ఉన్నాయి. మహిళలు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. హరిద్వార్ నీలిట్‌కు చెందిన సైంటిస్ట్‌లు, నిపుణులు మెంటార్లుగా వ్యవహరిస్తారు. టెక్నికల్ స్కిల్స్, వర్కింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, రీజనింగ్, ఐడియేషన్, అనలిటికల్ థింకింగ్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్‌కు సంబంధించి ప్రొఫెషనల్ వర్క్ ఎన్విరాన్‌మెంట్‌లో శిక్షణ ఇస్తారు. వివిధ విభాగాల్లో ప్రొఫెషనల్ స్కిల్స్‌ను పరిచయం చేస్తారు. కమ్యూనికేషన్, ప్రజెంటేషన్, అంత్రప్రెన్యూర్‌షిప్, నాయకత్వ లక్షణాలు పెంపొందేలా ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్పెసిఫిక్/టార్గెటెడ్ ప్రాజెక్ట్ వర్క్, డిజైన్ బేస్డ్ యాక్టివిటీస్, డెవలప్‌మెంటల్ యాక్టివిటీస్, రీసెర్చ్ బేస్డ్ యాక్టివిటీస్, లైవ్ ప్రాజెక్ట్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు. అర్హులైన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్‌లు కల్పిస్తారు.

ఇంటర్న్‌షిప్ అంశాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, క్వాంటం కంప్యూటింగ్, అగ్‌మెంటెడ్ రియాలిటీ అండ్ వర్చువల్ రియాలిటీ, బ్లాక్ చెయిన్, వైర్‌లెస్ నెట్‌వర్క్స్, స్మార్ట్ మొబిలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా అనలిటిక్స్, డిజిటల్ ప్రిజర్వేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, 3డీ ప్రింటింగ్, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్, ఎమర్జింగ్ మెమరీ/స్టోరేజ్ టెక్నాలజీస్, మెషిన్ విజన్, సీపీయూ డిజైన్.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారు లేదా ప్రస్తుతం ఏడు/ఎనిమిది సెమిస్టర్లు చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు కూడా అర్హులే.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఐఐఎం కాశీపూర్‌లో పీ హెచ్‌డీ



కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- పీ హెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ లేదా బెంగళూరు ఐఐఎం నిర్వహించే ఐఐఎంబీ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్‌కి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.

స్పెషలైజేషన్‌లు: బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్ ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/సీఏ/సీఎంఏ/సీఎస్ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/బీఆర్క్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 డిసెంబరు 31లోపు సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. జీమ్యాట్/జీఆర్‌ఈ/క్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా జేఆర్‌ఎఫ్ నెట్ అర్హత తప్పనిసరి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. పారిశ్రామిక రంగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఐఐఎంబీ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్, వెర్బల్, లాజికల్, డేటా ఎబిలిటీస్ తదితర అంశాలనుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: నెలకు రూ.37,000 నుంచి రూ.42,000 వరకు ఫెలోషిప్ ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద రూ.1,25,000; కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.3,00,000 చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జాతీయ పరీక్ష స్కోర్ ఉన్న అభ్యర్థులకు రూ.1000; ఐఐఎంబీ టెస్ట్ స్కోర్ అభ్యర్థులకు రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iimkashipur.ac.in

IIM KASHIPUR

అడ్వెంచరస్ కెరీర్ ఫోరెన్సిక్ సైన్స్

సోనీ టెలివిజన్‌లో కొన్నేళ్లుగా అలరిస్తున్న దారావాహిక సీఐడీ. అందులో తప్పనిసరిగా ల్యాబ్ టెస్ట్ ఉంటుంది. వాస్తవానికి ఒక ఎపిసోడ్‌కు అవసరమైన క్లూ అక్కడే లభ్యమయ్యేది. నేరగాళ్లను పట్టుకోవడం ఒక ఎత్తు అయితే, దాన్ని సశాస్త్రీయంగా నిరూపించడంలో ప్రధాన పాత్ర వహించేది ల్యాబ్. నేరస్థలం వద్ద సేకరించిన వస్తువులను శాస్త్రీయంగా పరిశీలించడం, నిజాన్ని రాబట్టేందుకు అవసరమైన సాక్ష్యాన్ని ధ్రువీకరించడం అన్నవి రెండూ అక్కడ జరుగుతాయి. వస్తువుల సేకరణ నుంచి శాస్త్రీయంగా నేర ధ్రువీకరణ వరకు జరిగే వ్యవహారం అంతటినీ ఒక మాటలో చెప్పాలంటే ఫోరెన్సిక్ సైన్స్ అనవచ్చు.



➡ 'ఫోరమ్' అనేది లాటిన్ పదం. పది మంది ఒక చోట చేరి, చర్చించి ఒక నిర్ధారణ లేదా నిర్ణయానికి రావడంగా ఈ పదానికి అర్థం చెప్పుకోవచ్చు. దానికి శాస్త్రీయతను జోడించినప్పుడు అది ఫోరెన్సిక్ సైన్స్ అవుతుంది. లీగల్, సివిల్, క్రిమినల్, నియంత్రణ, చట్టబద్ధతకు సంబంధించిన విషయాలను నిర్ధారించేందుకు రెండు రకాల సాక్ష్యాలు ఉపకరిస్తాయి. అందులో మొదటిది వ్యక్తులు చెప్పేవి. చిన్న పిల్లలు అబద్ధం చెప్పరన్న నమ్మకంతో వారి సాక్ష్యానికి విలువ ఇస్తున్నారు. మహిళలు, వృద్ధుల చెప్పేదానికి ఒక మేర విలువ ఉంది. అయితే, ప్రలోభాలకు గురై మాటకు కట్టుబడకపోవడం, కోర్టుకు వచ్చేటప్పటికి వాంగ్మూలాన్ని మార్చేయడం అన్నది ఎప్పటి నుంచో ఈ సమాజంలో ఉంది. ఫలితంగా మానవుల సాక్ష్యం హేతుబద్ధతకు నిలవటం లేదు. రెండోది శాస్త్రం సహకారంతో పక్కాగా సాక్ష్యాన్ని ముందుంచడం. శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన పెరిగిన దరిమిలా ఏదైనా విషయాన్ని సైంటిఫిక్‌గా రుజువు చేసే అవకాశం కలుగుతోంది. డిఎన్ఏ పరీక్ష, పాలిగ్రాఫ్, వాయిస్(మాట) అలాగే ఇమేజ్(చిత్రం) ఐడెంటిటీ తదితరాలు ఇందులోకి వస్తాయి. భౌతిక సాక్ష్యాలను పరిశీలించి నేర నిర్ధారణ జరుగుతుంది. ఇంటర్నెట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆ రకంగానూ నేరాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో నేర నిరూపణకు శాస్త్ర వినియోగం పెరిగింది. సాధ్యమైనంత వరకు శాస్త్రీయంగా నిరూపించడం ద్వారా వివిధ కేసులను సముచితంగా పరిష్కరించే వీలు న్యాయ వ్యవస్థకు లభిస్తోంది.

➡ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో క్రిటికల్ ఎలిమెంట్ ఫోరెన్సిక్ సైన్స్. ఈ సైంటిస్టులు సాధారణంగా క్రైమ్ సీన్ నుంచి సేకరించిన ఎవిడెన్స్‌ను విశ్లేషిస్తారు. ఇన్వెస్టిగేషన్, తదుపరి ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారాన్ని అందిస్తారు. తద్వారా అసలు దోషులను పట్టిస్తారు. అమాయకులను బైటపడేస్తారు. అలా నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్ ఈ రోజుల్లో కీలకపాత్ర పోషిస్తోంది.

➡ మెడిసిన్, ఇంజనీరింగ్ కాకుండా మరేదైనా మంచి కోర్సు చేయాలనుకుంటే ఫోరెన్సిక్ సైన్సెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. సాహసాలు చేయాలనుకునే యువత ఎంచుకోదగ్గ కోర్సు. అడుగడుగున థ్రిల్ కలిగిస్తుంది. ఎథికల్ హ్యాకింగ్‌తో మొదలుపెట్టి ఇంటెలిజెన్స్ సర్వీసులు అంటే ఇంటెలిజెన్స్ బ్యూరో, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, సీఐడీ, సీబీఐ అది కాదంటే ప్రైవేటు డిటెక్టివ్‌గా పనిచేయాలంటే ఫోరెన్సిక్ సైన్స్ చదవడం అభిలషణీయం అవుతుంది. ఇక్కడ పేర్కొన్న వాటిలో కొన్నింటిలో కుదురుకునేందుకు యూపీఎస్సీ ఎగ్జామ్‌ను ఎదుర్కోవాలి. మరికొన్నింటికి వేరే మార్గాలు ఉన్నాయి.

➡ విశ్లేషణ అలాగే క్రైమ్ సంబంధిత డేటాను ఇంటర్‌ప్రెటేట్ చేసేందుకు కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ సమాచారాన్ని ఉపయోగించాలి. మొత్తమ్మీద చట్టాన్ని అమలు చేసే సంస్థలకు ఉపయోగపడేలా ఉండాలి. ముఖ్యంగా ఇందులో నిలదొక్కుకోవాలంటే బయాలజీ, కెమిస్ట్రీ, సైకాలజీపై పట్టు ఉండాలి.

కోర్సులు: ఎంబీబీఎస్ తదుపరి ఎండీ ఫోరెన్సిక్ సైన్స్ చేస్తే ఈ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. పెద్ద ఆసుపత్రుల్లో జరిగే శవపరీక్షలో పాల్గొనాల్సి ఉంటుంది. తద్వారా నేర నిరూపణకు శాస్త్రీయంగా సమాచారాన్ని ఇవ్వవచ్చు.

➡ ఎక్కువ మంది సులువైన మార్గం అంటే మూడేళ్ళ బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ చదువుతారు. మరికొందరు ఆపై పీజీ కూడా చేస్తారు. దేశవ్యాప్తంగా పలు సంస్థలు ఈ కోర్సులను అందిస్తున్నాయి. డీఎన్ఏ ప్రొఫైలింగ్, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణ, రక్తపు మరకల విశ్లేషణ, సలైవా అండ్ బోన్ అనాలిసిస్‌కు తోడు క్రిమినల్ జస్టిస్‌ను కూడా చదవాల్సి ఉంటుంది. పీజీలో చాలా స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. ఫోరెన్సిక్ సైన్సెస్ నుంచి క్రిమినల్ సైన్స్ వరకు స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ కోర్సులు చేయవచ్చు.

➡ లీగల్ వ్యవహారాలపై ఆసక్తి ఉన్న వ్యక్తులు పీజీ డిప్లొమా ఇన్ సైబర్‌లా, ఎల్ఎల్ఎం ఇన్ క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ చదవాలి. నేషనల్ లా స్కూల్స్ ఈ కోర్సులను అందిస్తున్నాయి. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ కూడా వివిధ కోర్సులను అందిస్తోంది. ఫోరెన్సిక్ జస్టిస్ అండ్ పాలసీ స్టడీస్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమనటేరియన్ ఫోరెన్సిక్స్‌ని ఆఫర్ చేస్తోంది.

ఉద్యోగం: స్టేట్ ఫోరెన్సిక్ లేబరేటరీలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు అంటే సీబీఐ తదితరాలు, మెడికల్ కాలేజీల్లో వీరికి ఉపాధి లభిస్తుంది. కొన్ని పరిమితులతో ప్రైవేటు దర్యాప్తుల్లో పాల్గొనవచ్చు. కొంత అనుభవం గడించిన తరవాత ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకోవచ్చు. ఐటీలో మాదిరిగా ఆరంభంలోనే కళ్ళు చెదిరే ప్యాకేజీలు ఇందులో ఉండవు. స్కోప్ ఎంత ఉన్నప్పటికీ సంబంధిత టెక్నిక్స్, ఇంప్లిమెంటేషన్ అలవడ్డాకే మంచి మొత్తాలను అందుకునే అవకాశం లభిస్తుందనే విషయాన్ని ఇటు వైపు వచ్చే యువత గుర్తుంచుకోవాలి.

ఈ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- ➡ గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, గాంధీనగర్
- ➡ లోక్‌నాయక్ జేపీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, న్యూఢిల్లీ
- ➡ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, ముంబై
- ➡ ఐఎఫ్ఎస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, పుణె
- ➡ ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- ➡ డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయ్, సాగర్
- ➡ బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ, ఝాన్సీ
- ➡ ఎమిటీ యూనివర్సిటీ
- ➡ యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్
- ➡ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఆగ్రా
- ➡ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ జింక పేరు 'ముంట్ జాక్'. దీన్ని బార్కింగ్ డీర్ అని కూడా పిలుస్తారు. అయితే ఇలాంటి జింకలు చాలా తక్కువగా ఉన్నాయి. ఎత్తు 45 సెం.మీ., పొడవు 115 సెం.మీ ఉంటుంది.
- వీటి ఆనవాళ్లు 35 మిలియన్ల సంవత్సరాల కిందట నుంచే ఉన్నాయని పరిశోధకులు కనుగొన్నారు.
- మనదేశంలోని హిమాలయన్ ప్రాంతంతో పాటు చైనా, భూటాన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో కూడా వీటి సంతతిని చూడవచ్చు.
- 15 కేజీలనుంచి 34 కేజీల లోపు బరువు ఉంటాయి. ప్రపంచంలోనే అతి చిన్న ముంట్‌జాక్ జింక లండన్‌లో ఉంది. అది కేవలం 45 సెం.మీ. పొడవు ఉంటుంది. దాని బరువు పది కేజీల నుంచి ప్రారంభం అవుతుంది.
- పండ్లు, దుంపలు, నట్స్ తింటాయి. వీటికి దగ్గరలో శత్రువులు తిరగాడినా, ఆహారం దొరికినా కమ్యూనికేషన్ కోసం గట్టిగా అరుస్తాయి.




- వీటి కొమ్ములు చిన్నగా ఉన్నా... పదునుగా ఉంటాయి. జీవనకాలం 19 ఏళ్లు.
- నక్కలు, తోడేళ్లు, పులులుతో పాటు మనుషుల వల్ల కూడా ఎక్కువగా చనిపోతుంటాయి.
- ఇవి అడవులు, సవాన్న ఎడారులు, నీటి ప్రాంతాల్లో జీవిస్తాయి.
- ఇవి వైల్డ్ అనిమల్స్. చిన్నప్పటి నుంచి పార్కుల్లో పెంచటం కొన్ని దేశాల్లో చేస్తున్నారు.వీటిని ఒక చోట నుంచి మరొక చోటకు తీసుకుపోవటం నేరం. మన దేశంతో పాటు శ్రీలంక, భూటాన్.. ఇలా దగ్గరి దేశాల్లో కలిపి వీటి సంఖ్య లక్షనుంచి రెండు లక్షల లోపే ఉంటుంది. ఇవి సోషల్ అనిమల్స్.

దారి కనుక్కోండి



5 తేడాలను గుర్తించండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 212

		4		8				9
		1				6		5
		7			5	1		2
	2			3	7			
3			8		1			7
			5	2			6	
1		3	4			2		
6		2				9		
4				1		3		

సుడోకు - 211 సమాధానం

6	3	4	2	8	7	9	5	1
5	8	1	6	4	9	7	3	2
9	2	7	3	1	5	6	8	4
1	7	9	5	3	2	4	6	8
4	5	3	7	6	8	2	1	9
2	6	8	4	9	1	3	7	5
3	9	5	1	7	4	8	2	6
8	1	6	9	2	3	5	4	7
7	4	2	8	5	6	1	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.